www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 29-1-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 284 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చవితి పూర్తి; నక్షత్రం: పుబ్బ రా. 6.58 తదుపరి ఉత్తర; వర్జ్యం: తె. 3.06-4.55; దుర్ముహూర్తం: మ. 12.51-1.36, మ. 3.06-3.51; అమృతఘడియలు: ఉ. 11.44-1.33; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.05 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వీధి లైట్లు తీసేసి.. రాళ్లు రువ్వి..



టీడీపీ సభను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం

పల్నాడులో కన్నాపై వైసీపీ మూకల దాడి

త్రుటిలో తప్పించుకున్న మాజీ మంత్రి

అనుచరుడు సహా ముగ్గురికి గాయాలు 12

అవును.. వైసీపీ వలంటీర్లే!

ముసుగు తొలగించిన ముఖ్యమంత్రి

తమ పార్టీవారే అని అంగీకారం

పథకాల పంపిణీ పేరిట నియామకం

సొంత పార్టీ ప్రచారానికి వాడకం

నిత్యం జగన్ సేవలోనే వలంటీర్లు

ఇప్పుడు మరింత విస్తృతంగా ప్రచారం

వైసీపీ గెలుపు కోసం వారితో పనులు

ఓటర్ల జాబితా ప్రక్రియలో జోక్యం

గ్రామ సచివాలయాల వేదికగా సభలు

పార్టీ సభలకూ తరలుతున్న వలంటీర్లు



వలంటీర్లతో ముఖ్యమంత్రి జగన్ (ఫైల్)

ప్రైవేటు, ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్.. ఏ ఉద్యోగమైనా అభ్యర్థుల అర్హతలను బట్టి నియమిస్తారు. అంతేకానీ అభ్యర్థి ఏ పార్టీ వ్యక్తి అని చూడరు. జగన్ చెప్పినట్టు వలంటీర్లందరూ వైసీపీ కార్యకర్తలైతే వారిని ఏ ప్రాతిపదికన నియమించారు?

పథకాల అమలు, ఓటర్ల జాబితాకు సంబంధించి వలంటీర్లపై ఇప్పటికే ఎన్నో ఆరోపణలు వచ్చాయి. జగన్ సర్కారు ప్రభుత్వ సొమ్ము ఖర్చు పెట్టి వారితో పార్టీ ప్రచారం చేయించుకుంటోంది. జగన్ చెప్పినట్టుగా వైసీపీ కార్యకర్తలైన వలంటీర్లు.. ఎన్నికల సమయంలో వైసీపీకి అనుకూలంగా పనిచేయడంతో పాటు పథకాల పేరు చెప్పి ఓటర్లను ప్రభావితం చేస్తారనే ఆరోపణలు వస్తున్నాయి.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'వలంటీర్లు ఎవరో కాదు.. వారు కూడా మనల్ని అభిమానించే, మన పార్టీని అభిమానించే మన వాళ్లేనని చెప్పడానికి గర్వపడుతున్నాను'.. -శనివారం విశాఖ జిల్లా సంగివలసలో జరిగిన 'సిద్ధం' బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ఇలా అసలు విషయం చెప్పేశారు. 'సేవ' ముసుగు తీసేశారు. 'వలంటీర్ల' పేరుతో

మిగతా 11వ పేజీలో...

21 మంది ఐఏఎస్‌ల బదిలీ

3 జిల్లాల కలెక్టర్లకు స్థానచలనం

తిరుపతికి లక్ష్మీషా

ఏడుగురు జేసీలూ.. 3



ఇచ్చిన ప్రతి మాటా తప్పారు!

జగన్.. వైఎస్ వారసుడెలా అవుతారు: షర్మిల సూటి ప్రశ్న

వైసీపీని భుజాలపై మోశాను

3,200 కి.మీ. పాదయాత్ర చేశాను

ఎన్నికల్లో గెలిపించాను.. అయినా కృతజ్ఞత లేదు

నా వ్యక్తిగత జీవితంపై రకరకాలుగా దాడులు

భయపడను.. ఎన్ని నిందలేసినా ముందుకే!

బీజేపీని వైఎస్ వ్యతిరేకిస్తే.. జగనన్నేమో ఊడిగం

తిరుపతి, అనంతల్లో పీసీసీ చీఫ్ విసుర్లు

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'వైఎస్.. మాట మీద నిలబడే నాయకుడు.. జగన్ మాత్రం మాట తప్పే నాయకుడు.. ఇచ్చిన ప్రతి మాటా తప్పిన జగన్, మాటకు కట్టుబడే వైఎస్‌కు వారసుడెలా అవుతారు..' అని ఆయన చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూటిగా ప్రశ్నించారు. ఆదివారం తిరుపతి, అనంతపురంలలో ఆయా ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ శ్రేణులతో ఆమె సమావేశమయ్యారు. ఒకప్పుడు వైసీపీని తన భుజాలపై మోశానని, జగనన్న రాజకీయ

మిగతా 11వ పేజీలో...



కర్నూలు జిల్లా పత్తికొండ సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న చంద్రబాబు

జగన్‌రెడ్డి.. భస్మాసురుడు!

ఓటేసిన ప్రజల తలపై చెయ్యిపెట్టి జీవితాలను భస్మం చేస్తున్నాడు

'జగనాసురుడి'ని ఓటుతో తరిమికొట్టండి

వైసీపీ ప్రభుత్వానికి మిగిలింది 73 రోజులే

'పేద బిడ్డ' లక్షల కోట్ల ఆస్తులు పోగేశాడు

ఫ్యాన్ రెక్కల్ని ప్రజలే విరగ్గొట్టేస్తారు

వైసీపీని ఓడించేందుకు జనం 'సంసిద్ధం'

సీఎంపై టీడీపీ అధినేత చంద్రబాబు ఫైర్

నెల్లూరు, పత్తికొండల్లో 'రా..కదలిరా' సభలు

గెట్ రెడీ జగన్ రెడ్డీ. నీ ఫ్యాన్ బాదుడు రెక్కల్ని ఉత్తరాంధ్ర ప్రజలు విరిచేస్తారు. ఇన్‌ఫ్రా రాజకీయ రెక్కల్ని సీమ ప్రజలు తుంచేస్తారు. నీ విధ్వంస నిర్ణయాల రెక్కల్ని కోస్తా ప్రజలు పీకి పాతరేస్తారు. కడాన నిన్ను ఇంటికి పంపిస్తారు. -చంద్రబాబు

నెల్లూరు/కర్నూలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): "జగన్ రెడ్డి పురాణాల గురించి మాట్లాడుతున్నాడు. నేను అభిమన్యుడిని కాను, అర్జునుడిని అంటున్నాడు. జగన్‌రెడ్డీ నువ్వు అభిమన్యుడివి కావు, అర్జునుడివీ కావు.. నువ్వో భస్మాసురుడివి. నీకు ఓటు వేసిన వాళ్ల నెత్తినే చెయ్యిపెట్టిన వ్యక్తివి. నీకు వ్యతిరేకంగా ఓటేసి నిన్ను భస్మం చేసే బాధ్యత 5 కోట్ల మంది ఆంధ్రులు తీసుకున్నారు. ఖబడ్దార్!" అని చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఆదివారం

మిగతా 11వ పేజీలో...

గళమెత్తినందుకు గురి పెట్టారు!

రెండుసార్లు మా సంస్థలపై ఈడీ విచారణ

ఇప్పుడూ భూతద్దంలో చూస్తున్నారు

అనుమతులు తెచ్చుకున్నా వేధింపులు

ఇతర రాష్ట్రాలు, దేశాల్లోనూ కంపెనీలు పెడుతున్నాం

అప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడక్కర్లేదు

ప్రస్తుతానికి రాజకీయాలకు గుడ్‌బై

పూర్తిస్థాయిలో వ్యాపారంపై దృష్టి

ఎంపీ గల్లా జయదేవ్ ప్రకటన

గుంటూరు ప్రజలకు 'కృతజ్ఞతాభివందనం'

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'అమరరాజా' అధినేత, గుంటూరు ఎంపీ, టీడీపీ నేత గల్లా జయదేవ్ క్రియాశీల రాజకీయాలకు 'విరామం' ప్రకటించారు. పూర్తిస్థాయిలో వ్యాపారంపై దృష్టి సారిస్తానని తెలిపారు. తాను రాజకీయాలకు దూరమవుతున్నానే తప్ప

మిగతా 12వ పేజీలో...



'కృతజ్ఞతాభివందనం' సభలో మాట్లాడుతున్న జయదేవ్

మీరు రోడ్డేస్తే.. మేం తవ్వేస్తాం!



టీడీపీ ప్రజాప్రతినిధి నిధులతో వేసిన సీసీ రోడ్డును ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేస్తున్న దృశ్యం

కాంట్రాక్టర్‌కు వైసీపీ నాయకుడి బెదిరింపులు

రోడ్డు తొలగించకుంటే కేసు పెడతామని హెచ్చరిక

గత్యంతరం లేక రోడ్డును ధ్వంసం చేసిన కాంట్రాక్టరు

టీడీపీ నిధులతో రోడ్డేశారని అక్కసు

హిందూపురం, జనవరి 28: 'మేం రోడ్డు వేయం. ఇంకెవరైనా వేయిస్తే చూస్తూ ఊరుకోం!'.. ఇదీ వైసీపీ నేతల విధానం! అభివృద్ధి చేయరు.. ఎవరైనా చేస్తే ఓర్వలేరు. దీనికి నిదర్శనమే హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం నాయనపల్లి ఎస్సీ కాలనీలో ఆదివారం జరిగిన ఘటన! నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్య ఉందని స్థానిక ప్రజలు.. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కరించాలని కోరారు. ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని, విజయవాడ ఎంపీ నిధులు రూ.25 లక్షలతో నాయనపల్లిలో డ్రైనేజీ ఏర్పాటు చేశారు. అందులో రూ.6.5 లక్షలు మిగలగా.. ఆ నిధులతో ఎస్సీ కాలనీలో

మిగతా 12వ పేజీలో...

బెజవాడలోనూ అదే దుస్థితి 3

అంబులెన్స్ ఇవ్వక బైకులపై మృతదేహాలు

కృష్ణా నదిలో ముగ్గురు చిన్నారుల మునక.. గాలించి వెలికితీసిన మత్స్యకారులు

నది ఇసుకలో రోడ్డు సమీపం వరకు బైక్‌లపై మృతదేహాలు తరలింపు

అప్పటికి 2-3 గంటలు గడిచినా తమ పరిధి కాదంటూ అంబులెన్స్ పెట్టని వైనం

బైకులపైనే రోడ్డుపైకి తరలింపు.. అక్కడే పోలీసులున్నా 'పరిధుల' పేరిట తాత్సారం

చివరికి తల్లిదండ్రులు, బంధువుల ఆగ్రహంతో రాత్రి 9 దాటాక అంబులెన్స్ ఏర్పాటు



బైక్‌పై మృతదేహాన్ని తరలిస్తున్న బంధువులు



నేటి చట్టాలు రేపటి కోసం 2

ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఆధునీకరిస్తున్నాం

సుప్రీం వజ్రోత్సవ వేడుకల్లో మోదీ

ఇక డిజిటల్ సుప్రీంకోర్టు: సీజేఐ

నితీశ్.. తొమ్మిదోసారి!

బిహార్ సీఎంగా మరోసారి ప్రమాణం

బీజేపీకి 2 డిప్యూటీ సీఎం పదవులు.. ప్రమాణ స్వీకారానికి హాజరైన నడ్డా



బిహార్ సీఎంగా ప్రమాణం చేస్తున్న నితీశ్

అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ

పాత మిత్రులం మళ్లీ కలిశాం.. ఇక విడిపోం

'ఇండియా'లో సరిగా లేకనే బయటకు: నితీశ్

కూటమి సారథ్యం లాక్కోడానికి కాంగ్రెస్ కుట్ర

సీట్ల పంపకాలపైనా జాప్యం, దీనివల్లే విడిపోయాం.. జేడీయూ నేత కేసీ త్యాగి 2

పదవీకాలంలో 11వ స్థానం

ప్రమాణాల్లో నంబర్ 1

9 సార్లు ప్రమాణం చేసిన ఏకైక సీఎం నితీశ్‌కుమార్

ఒక్క దెబ్బకు 3 పిట్టలు!

నితీశ్‌తో బీజేపీ దోస్తీ మర్మమిదే!

ఆయన నిష్క్రమణతో 'ఇండియా' కూటమి కకావికలు

బెంగాల్లో కాంగ్రెస్‌తో పొత్తు లేదని ఇప్పటికే తేల్చిన మమత

పంజాబ్, ఢిల్లీల్లో ఆప్ అదేబాట

ఇప్పుడు జేడీయూనీ బయటకు రప్పించిన మోదీ-షా



నీ పరిస్థితేం బాలేదు.. నీది బాగుందా?

జగన్ X 'సొంత' జిల్లా ఎమ్మెల్యే

తాడేపల్లి ప్యాలెస్‌లో సీఎంకు షాక్

'సర్వేలో వ్యతిరేకత' అని చెప్పిన సీఎం

నేనేం మర్డర్లు చేయలేదు 12

చేసినోడిని వెనకేసుకురాలేదు: ఎమ్మెల్యే

ఏం మాట్లాడుతున్నావ్ అంటూ జగన్ గుస్సా

ఎమ్మెల్యేను బయటికి తీసుకెళ్లిన వైవీ

ఎస్సీ నియోజకవర్గంలో.. పెద్దిరెడ్డి పెత్తనమేంటి?

గ్రావెల్, ఇసుక అక్రమాలు మీవి.. నిందలు మోపేది నాపైనా? 3

సత్యవేడును భ్రష్టు పట్టించారు

1989లో మోటర్ సైకిల్‌పై పెద్దిరెడ్డి..

మరి ఇప్పుడు ఇన్ని ఆస్తులెలా వచ్చాయ్?


నా సెగ్మెంట్ మీటింగు మీ ఇంట్లోనా?

జనరల్ స్థానాల్లో ఇలా చేసే దమ్ముందా?

వైసీపీలో ఎస్సీలకు గౌరవం లేదు

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఫైర్

పనికో రేటు.. అవినీతి రూటు!



పత్రికల్లో వచ్చినా బేఖాతర్

కృష్ణా జిల్లా ఫైర్ బ్రాండ్ మంత్రి స్టయిల్

కీలక నియోజకవర్గంలో అక్రమాల దందా

పనేదైనా.. వ్యక్తులెవరైనా పైసలు దక్కాల్సిందే

చెరువు తవ్వకాల నుంచి మట్టి తోలకాల వరకు

పోస్టింగ్స్ నుంచి పేకాట శిబిరం దాకా 'మామూలే'

వసూళ్ల దందాలో 'తమ్ముడు తమ్ముడే' స్టయిల్

స్వలాభమే ధ్యేయంగా అధికార పార్టీ మంత్రి

విపక్షాలపై నోరేసుకు పడడంలో స్టేట్ ఫస్ట్

బాబు ఇంటిపై దాడితో మంత్రి పదవి గిఫ్ట్

ఎవరైనా అవినీతికి పాల్పడితే అది నాలుగు గోడల మధ్యే ఉండిపోవాలనుకుంటారు. నలుగురికీ తెలిస్తే.. నవ్వులపాలవుతామని భావిస్తారు. కానీ, కృష్ణా జిల్లా నుంచి మంత్రిగా ఉన్న ఓ ఫైర్ బ్రాండ్ మాత్రం అందుకు విరుద్ధం. పత్రికల్లో తన అవినీతిపై వచ్చే కథనాలను చాలా స్పోర్టివ్‌గా తీసుకుంటారు. ఆయన తీసుకునే పర్సంటేజీలను తక్కువ చేసి చూపితే బాధపడిపోతారు. తన స్థాయిని మరీ తగ్గించేస్తున్నారని సన్నిహితుల వద్ద ఆవేదన చెందుతారు. 12

అమ్మో ఎమ్మెల్యే

యువజన కాంగ్రెస్ నేతగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ప్రస్తుత వైసీపీ మంత్రి.. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై కృష్ణాజిల్లాలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. 2014 ఎన్నికలకు వేరే చోట నుంచి వైసీపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు. 2019లో మళ్లీ పాత స్థానం నుంచి పోటీ చేసి విజయం దక్కించుకుని.. ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. అది కూడా టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపైకి తన మూకతో దాడికి యత్నించడం వల్ల లభించిన ప్రమోషన్‌గా వైసీపీలో ప్రచారం ఉండడం గమనార్హం.

మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేకు సంబంధించి కొంత భూమి వివాదంలో ఉంది. ఆ మాజీ ఎమ్మెల్యే కృత్తివెన్ను మండలంలో సుమారు 50 ఎకరాల్లో చెరువులు తవ్వారు. వాటిలో కొంత భూమి వివాదాస్పదమైంది. ఈ వివాదంలో జోక్యం చేసుకున్న మంత్రి.. సుమారు రూ.25 లక్షలు పిండేశారని టాక్.


ఇండియా కూటమిలో ఉన్నప్పుడు ఖర్గే, రాహుల్ తదితరులతో నితీశ్

నితీశ్ ఓ ఊసరవెల్లి!

- జేడీయూ అధినేతపై కాంగ్రెస్ ధ్వజం
- లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూ కనుమరుగే: తేజస్వీ
- ఈ బంధం మనుగడ ఏడాదే: ప్రశాంత్ కిశోర్

న్యూఢిల్లీ, పట్నా, కోల్‌కతా, చెన్నై, జనవరి 28: నితీశ్ కుమార్‌కు తరచుగా రాజకీయ పిల్లిమొగ్గలు వేయడం అలవాటేనని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. ఆయనొక ఊసరవెల్లి అని కాంగ్రెస్ పేర్కొనగా, రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనే జేడీయూ అంతమవుతుందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ జోశ్యం చెప్పారు. కాగా, చెత్త.. డస్ట్‌బిన్‌లోకే వెళ్లిందని లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య జేడీయూను ఉద్దేశించి విమర్శించారు. నితీశ్ పూర్తిగా విశ్వసనీయతను కోల్పోయారని డీఎంకే విమర్శించగా, నితీశ్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ హెచ్చరించింది. నితీశ్ కూటమిని వీడనున్న విషయం తనకు ముందే తెలుసని, అయితే, ఇండియా కూటమిని సమైక్యంగా ఉంచేందుకే తాను ఇప్పటివరకు ఆ ప్రస్తావన తేలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. 'ఆయా రామ్-గయా రామ్ లాంటి వారు దేశంలో ఎంతోమంది ఉన్నారు. మొదట్లో ఆయన నేను కలిసి పోరాడాం. లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్‌లతో నేను మాట్లాడినప్పుడు నితీశ్ వెళ్లిపోతున్నాడని చెప్పారు' అని ఖర్గే వెల్లడించారు. నితీశ్ వెళ్లినంత మాత్రాన బీజేపీపై ఇండియా కూటమి పోరాటం ఆగదన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ, నితీశ్ ఈ రాజకీయ డ్రామాకు తెరతీశారని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ఆరోపించారు. కాగా, నితీశ్-బీజేపీ బంధం ఎంతోకాలం మనలేదని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. బిహార్‌లో కొత్త ప్రభుత్వం మనుగడ ఏడాది లేదా అంతకంటే తక్కువే ఉంటుందని, 2025 అసెంబ్లీ ఎన్నికలకు ముందే వీరి బంధం తెగిపోనుందని జోశ్యం చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆరు నెలలకే మార్పు ఏర్పడుతుందని, కావాలంటే రాసిస్తానని పీకే తెలిపారు.

నితీశ్‌కుమార్ పచ్చి అవకాశవాది: అసదుద్దీన్

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కూటములు మారుతున్న జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ బిహార్ ప్రజలకు తక్షణం క్షమాపణలు చెప్పాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఇక నుంచి బిహార్‌లో పేరుకు మాత్రమే నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి అని.. పరిపాలనంతా ఇక ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ కనుసన్నల్లోనే జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు మజ్లిస్ బీజేపీ బీ టీం అంటూ విమర్శించిన నితీశ్‌కుమార్ ఇప్పుడు ఏ సమాధానం చెబుతారంటూ ఒవైసీ ఎద్దేవా చేశారు. నితీశ్‌ను పచ్చి రాజకీయ అవకాశవాదిగా అభివర్ణించారు.

రాజకీయ అవకాశవాదానికి ముగింపు పలకాలి

కోల్‌కతా, డిసెంబరు 28: రాజకీయ అవకాశవాదానికి తప్పకుండా ముగింపు ఉండాలని పశ్చిమబెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీ దిలీప్ ఘోష్ వ్యాఖ్యానించారు. 'ఎవరైనా రాజకీయ నేత ఐదేళ్ల కాలంలో ఒక్కసారే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. కానీ ఐదేళ్లలో కనీసం రెండుమూడు సార్లు ప్రమాణ స్వీకారాలు చేసే రాజకీయ నాయకుడు నితీశ్ కుమార్. అది కూడా విభిన్న కూటముల నుంచి. ఇలాంటి రాజకీయ అవకాశవాదానికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది' అన్నారు.

నితీశ్.. తొమ్మిదోసారి!

బిహార్ సీఎంగా మరోసారి ప్రమాణం.. బీజేపీకి రెండు డిప్యూటీ సీఎం పదవులు.. హాజరైన నడ్డా

- మిత్రులం మళ్లీ కలిశాం.. ఇక విడిపోం
- ఇండియా కూటమిలో సరిగా లేదు.. అందుకే బయటకు: నితీశ్



ఆదివారం మధ్యాహ్నం గవర్నర్‌కు రాజీనామా సమర్పిస్తున్న నితీశ్, సాయంత్రం బీజేపీ మద్దతుతో మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

పట్నా, జనవరి 28: గత కొన్ని రోజులుగా నడుస్తున్న నాటకీయ పరిణామాల మధ్య జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ తొమ్మిదోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఆదివారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ నితీశ్‌తో ప్రమాణం చేయించారు. బీజేపీ నుంచి ముగ్గురు, జేడీయూ నుంచి ముగ్గురు, మాజీ సీఎం జితన్‌రాం మాంఝీ పార్టీ హిందుస్థాన్ ఆవామ్ మోర్చాకు చెందిన ఒకరు, ఓ స్వతంత్ర ఎమ్మెల్యే మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు. జేడీయూ తాజా మాజీ మిత్రపక్షం ఆర్జేడీ ఈ కార్యక్రమాన్ని బహిష్కరించగా, కాంగ్రెస్ నుంచి ఎవరూ హాజరు కాలేదు. కొత్త ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటానికి, రాష్ట్ర అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తుందన్నారు. సీఎంగా ప్రమాణం అనంతరం నితీశ్ విలేకర్లతో మాట్లాడారు. 'గతంలో వారితోనే (ఎన్‌డీఏతో) కలిసి ఉన్నా. ఆ తర్వాత దారులు వేరయ్యాయి. మళ్లీ ఒక్కటయ్యాం. ఇక ఎక్కడికీ వెళ్లే ప్రశ్నే ఉత్పన్నం కాదు' అని పేర్కొన్నారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా డిప్యూటీ సీఎంలుగా బాధ్యతలు చేపడతారని, మరికొన్ని రోజుల్లో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చెప్పారు.

అందరి అభిప్రాయాలతోనే నిర్ణయం

అంతకుముందు ఉదయం జేడీయూ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. పొత్తులపై నిర్ణయాధికారాన్ని సీఎం నితీశ్‌కు అప్పగిస్తూ తీర్మానం చేశారు. మరోవైపు, రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు సమావేశమై, జేడీయూకి మద్దతివ్వాలన్న తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. సామ్రాట్ చౌదరిని పార్టీ శాసనసభాపక్ష నేతగా, మాజీ స్పీకర్ విజయ్ కుమార్ సిన్హాను ఉప నేతగా ఎన్నుకున్నారు. దీనిపై నేతలిద్దరూ పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆర్జేడీ సృష్టించిన జంగిల్‌రాజ్ నుంచి బిహార్‌ను కాపాడటానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వీరిద్దరితో కలిసి నితీశ్‌కుమార్ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు రాజీనామా లేఖను సమర్పించారు. బీజేపీ మద్దతుతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి అవకాశం ఇవ్వాలని కోరారు. రాజీనామా సమర్పించిన తర్వాత రాజ్‌భవన్ బయట విలేకర్లతో నితీశ్ మాట్లాడుతూ, మహాఘట్‌బంధన్ (ఆర్జేడీ-జేడీయూ) కూటమితోపాటు, ఇండియా కూటమిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మహాఘట్‌బంధన్ గురించి మీకు అందరికీ తెలుసు. ఇండియా కూటమి కోసం నేను చేసిన ప్రయత్నాలూ తెలుసు. అయితే, కొంతకాలంగా వ్యవహారాలు సరిగా నడవటం లేదు. దీనిపై మా పార్టీలో కూడా అసంతృప్తి నెలకొంది. అందరి అభిప్రాయాలు తీసుకున్నా' అని తెలిపారు.

లోకం తీరు



కాంగ్రెసే కారణం: జేడీయూ

ఇండియా కూటమి సారథ్య బాధ్యతలను లాక్కోవాలని కాంగ్రెస్ చూసిందని, అందువల్లే తాము బయటకు వచ్చామని జేడీయూ సీనియర్ నేత కేసీ త్యాగి చెప్పారు. 'డిసెంబరు 19న జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ప్రధాని అభ్యర్థిగా ఖర్గే పేరును కుట్రపూరితంగా ముందుకు తీసుకొచ్చారు. అంతకుముందు ముంబైలో జరిగిన భేటీలో ప్రధాని అభ్యర్థిని ప్రకటించవద్దని నిర్ణయం జరిగింది. దీనికి భిన్నంగా ఖర్గే పేరును మమతతో ప్రతిపాదింపజేశారు. అంతేగాక, సీట్ల పంపకాలపై కాంగ్రెస్ జాప్యం చేస్తూ వస్తోంది. బీజేపీని ఎదుర్కొనే ప్రణాళికలు ఆ కూటమి వద్ద లేవు' అని పేర్కొన్నారు.

ఒక్క దెబ్బకు మూడు పిట్టలు!

న్యూఢిల్లీ/పట్నా, జనవరి 28: బిహార్ రాజకీయం రక్తికడుతోంది. గత పదేళ్లలో ఆరు సార్లు మిత్రులను మార్చేసిన బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌ను ఇక ఎన్‌డీఏలో చేర్చుకునేది లేదని కొద్ది నెలల కిందట బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. కానీ లోక్‌సభ ఎన్నికల ముంగిట ఆయన్ను సాదరంగా స్వాగతించారు. బీజేపీపై ప్రతిపక్షాలన్నీ ఒకే అభ్యర్థిని నిలిపితే ఆ పార్టీ ఓటమి ఖాయమంటూ 'ఇండియా' కూటమికి బీజం వేసిన నితీశ్.. ఆ కూటమిని వదిలేసి తిరిగి ఎన్‌డీఏ గూటికి చేరడం విచిత్రమే. ఆయన్ను తిరిగి తమ వైపు లాక్కోవడం ద్వారా ప్రధాని మోదీ-షా.. ఒకే దెబ్బకు మూడు పిట్టలను కొట్టారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇందులో ప్రధానమైనది.. విపక్ష ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయడం. నిజానికి ఈ కూటమి ఏర్పాటులో నితీశ్‌దే కీలక పాత్ర. 2022 ఆగస్టు 8న బీజేపీకి కటీఫ్ చెప్పి.. తన చిరకాల ప్రత్యర్థి ఆర్‌జేడీ లాలూప్రసాద్ యాదవ్ గూటికి చేరి.. ఇంకోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన ఆయన.. ప్రతిపక్షాలన్నీ బీజేపీపై ఒకే అభ్యర్థిని నిలిపితే.. వ్యతిరేక ఓటు చీలకుండా ఉంటుందని.. ఈ దిశగా అవి ఏకం కావాలని పిలుపిచ్చారు. కాంగ్రెస్ పొడగిట్టని బెంగాల్, ఢిల్లీ సీఎంలు మమతా బెనర్జీ (టీఎంసీ), అరవింద్ కేజ్రీవాల్ (ఆప్), సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను, ఇతర విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చారు. 'ఇండియా' కూటమికి జాతీయ కన్వీనర్ కావాలనుకున్నారు. అయితే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత కాంగ్రెస్ నితీశ్, మమతను దూరం పెట్టడం మొదలుపెట్టింది. తర్వాత జరిగిన ఐదు రాష్ట్రాల.. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే ఇక తనకు తిరుగుండదని.. కూటమికి తానే నాయకత్వం వహించవచ్చని భావించింది. తెలంగాణలో తప్ప వింగతా రాష్ట్రాల్లో ఘోరంగా ఓడిపోయినా.. ఆ పార్టీ వెనక్కి తగ్గలేదు. కూటమి చైర్మన్‌గా ఖర్గే నియామకం తర్వాత నితీశ్‌కు పరిస్థితి అర్థమైంది. ఇదే సమయంలో మమత, కాంగ్రెస్ నడుమ చిచ్చు మొదలైంది. తమను సంప్రదించకుండా.. మాటమాత్రమైనా చెప్పకుండా రాహుల్‌గాంధీ స్వలాభం కోసం 'భారత్ జోడో న్యాయ యాత్ర'ను ప్రారంభించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. బెంగాల్లోని 42 లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీకి రెండే ఇస్తానని ప్రతిపాదించారు. ఇందుకు కాంగ్రెస్ అంగీకరించకపోవడంతో బెంగాల్లో ఆ పార్టీతో పొత్తు ఉండదని ఆమె ప్రకటించారు. యాత్రలో పాల్గొనడానికీ నిరాకరించారు. అటు పంజాబ్(13), ఢిల్లీ(7)ల్లో ఆప్ ఒంటరిగా పోటీచేస్తుందని..హరియాణా (10),గోవా(2),గుజరాత్‌లో (26) సీట్ల సర్దుబాటు చేసుకుందామని కేజ్రీవాల్ మెలిక పెట్టారు. అటు మహారాష్ట్ర(48)లో తాము గత ఎన్నికల్లో పోటీచేసిన 23 స్థానాల్లో ఒక్కటి కూడా వదులుకోబోమని ఉద్ధవ్ శివసేన ప్రకటించింది. దీంతో కూటమికి బీటలు పడినట్లయింది. ఇప్పుడు 40 ఎంపీ స్థానాల బిహార్‌లో నితీశ్‌ను తమ వైపు తిప్పుకొంటే.. ఆర్‌జేడీ-కాంగ్రెస్-లెఫ్ట్ కూటమిని ఓడించవచ్చని మోదీ-షా ఆలోచించారు. కుర్మీ వర్గానికి చెందిన నితీశ్ తమ వైపు ఉంటే.. బిహార్లో 16 లోక్‌సభ స్థానాల్లో గెలుపు అవకాశాలు ఉంటాయని.. యూపీలోనూ సీట్లు పెంచుకోవడానికి ఇది ఉపకరిస్తుందన్నది మోదీ-షా ఆలోచనగా భావిస్తున్నారు.


ప్రమాణస్వీకారం తర్వాత విందులో బీజేపీ అధ్యక్షుడు నడ్డా, బిహార్ గవర్నర్ అర్లేకర్, నితీశ్, డిప్యూటీ సీఎం సామ్రాట్

తగ్గుతున్న నితీశ్ ప్రభ..

2005 నుంచి మధ్యలో (2014-15) 9 నెలలు తప్ప బిహార్ సీఎంగా కొనసాగుతున్న నితీశ్ ప్రభ కొన్నేళ్లుగా మసకబారుతోంది. 2010లో ఆయన పార్టీ జేడీయూ 115 స్థానాలు గెలిచింది. 2015లో అది 71కి తగ్గింది. 2020 ఎన్నికల్లో ఏకంగా 43కి పడిపోయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ 78 స్థానాలతో అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఆర్‌జేడీ 75 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. 2022లో బీజేపీతో తెగతెంపులు చేసుకుని.. లాలూతో జట్టుకట్టిన తర్వాత.. ప్రభుత్వంలో ఆర్‌జేడీదే పైచేయి. ఇప్పుడు ఎన్‌డీఏలోకి తిరిగొచ్చి.. మళ్లీ సీఎం పీఠాన్ని దక్కించుకున్నా.. నితీశ్ కుమార్ బీజేపీ నియంత్రణలోనే పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

'పల్టూరామ్' తొమ్మిది ప్రమాణస్వీకారాల కథ!

2000	బిహార్ సీఎంగా తొలిసారి ప్రమాణ స్వీకారం. కానీ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సినంతమంది ఎమ్మెల్యేలు లేకపోవడంతో రాజీనామా. తొలిసారి ఆయన సీఎం పదవిలో ఉన్నది కేవలం ఏడు రోజులే.
2005	బీజేపీతో కలిసి పోటీ చేసి ప్రభుత్వ ఏర్పాటు. రెండోసారి ప్రమాణ స్వీకారం
2010	బంపర్ మెజారిటీతో మళ్లీ అధికారంలోకి. మూడోసారి ప్రమాణ స్వీకారం
2013	ఎన్డీయే ప్రధాని అభ్యర్థిగా మోదీని ప్రకటించడంతో.. 17 ఏళ్లుగా బీజేపీతో ఉన్న బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్, సీపీఐ తదితర పార్టీలు బయటి నుంచి ఇచ్చిన మద్దతుతో ప్రభుత్వాన్ని నడిపారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి దిగితే జేడీయూకి రెండు సీట్లే వచ్చాయి. దీంతో సీఎం పదవికి రాజీనామా చేసి జితన్‌రామ్ మాంఝీని సీఎం చేశారు.
2015 ఫిబ్రవరి	జితన్‌రామ్ మాంఝీ రాజీనామా. సీఎంగా నితీశ్ నాలుగోసారి ప్రమాణ స్వీకారం.
2015 నవంబర్	ఆర్జేడీ, కాంగ్రెస్, జేడీయూతో కూడిన మహాకూటమి విజయం. సీఎంగా నితీశ్ ఐదో ప్రమాణస్వీకారం.
2017 జూలై	సీఎం పదవికి రాజీనామా చేసి మహాకూటమి నుంచి బయటకు. కొన్నిగంటల వ్యవధిలోనే ఎన్డీయేతో చేతులు కలిపి ఆరోసారి ప్రమాణ స్వీకారం.
2020	బీజేపీతో కలిసి ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా ఏడోసారి ప్రమాణ స్వీకారం.
2022 ఆగస్టు	ఎన్డీయే నుంచి బయటకు. సీఎం పదవికి రాజీనామా. మహాకూటమితో కలిసి మళ్లీ ప్రభుత్వం. 8వ సారి ప్రమాణం.
2024 జనవరి	మహా కూటమి నుంచి బయటకు. సీఎం పదవికి రాజీనామా. బీజేపీతో కలిసి మళ్లీ ప్రభుత్వం. 9వ సారి ప్రమాణం.



పదవీకాలంలో 11వ స్థానం..

ప్రమాణాల్లో నెంబర్ వన్!

- అత్యధికకాలం సీఎంలుగా ఉన్న నేతలు ప్రమాణం చేసింది ఐదుసార్లే

దేశంలో సుదీర్ఘకాలం పాటు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న నేతలతో నితీశ్ పోటీ పడుతున్నారు. 17 ఏళ్ల 158 రోజుల పాలనతో ఆయన 11వ స్థానంలో ఉన్నారు. విచిత్రమేమిటంటే, పదవీకాలం పరంగా 10 మంది తర్వాత ఉన్నప్పటికీ.. సీఎంగా ప్రమాణాల పరంగా మాత్రం నితీశ్‌దే రికార్డు. ముఖ్యమంత్రిగా 9 సార్లు ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి ఆయన తప్ప దేశంలో మరెవరూ లేరు. నితీశ్ కుమార్ కన్నా ఎక్కువ కాలంపాటు ముఖ్యమంత్రులుగా పని చేసిన 10 మందిలో 9 మంది ఐదుసార్లు సీఎంగా ప్రమాణం చేయగా, మాణిక్ సర్కార్ నాలుగు సార్లే ప్రమాణం చేశారు. వీరందరి కన్నా వెనక ఉన్న నితీశ్ మాత్రం 9 సార్లు ఆ పని చేసి 'రికార్డు' నెలకొల్పారు.

పేరు	రాష్ట్రం	పదవీకాలం	సీఎంగా ప్రమాణం
1. పవన్ చామ్లింగ్	సిక్కిం	24 ఏళ్ల 164 రోజులు	5 సార్లు
2. నవీన్ పట్నాయక్	ఒడిశా	23 ఏళ్ల 327 రోజులు	5 సార్లు
3. జ్యోతిబసు	పశ్చిమ బెంగాల్	23 ఏళ్ల 137 రోజులు	5 సార్లు
4. గెగాంగ్ అపాంగ్	అరుణాచల్ ప్రదేశ్	22 ఏళ్ల 250 రోజులు	5 సార్లు
5. లాల్ తన్హాలా	మిజోరం	22 ఏళ్ల 60 రోజులు	5 సార్లు
6. వీరభద్రసింగ్	హిమాచల్ ప్రదేశ్	21 ఏళ్ల 13 రోజులు	5 సార్లు
7. మాణిక్ సర్కార్	త్రిపుర	19 ఏళ్ల 363 రోజులు	4 సార్లు
8. ఎం.కరుణానిధి	తమిళనాడు	18 ఏళ్ల 362 రోజులు	5 సార్లు
9. ప్రకాశ్‌సింగ్ బాదల్	పంజాబ్	18 ఏళ్ల 350 రోజులు	5 సార్లు
10. యశ్వంత్ పర్మార్	హిమాచల్ ప్రదేశ్	18 ఏళ్ల 83 రోజులు	5 సార్లు
11. నితీశ్‌కుమార్	బిహార్	17 ఏళ్ల 158 రోజులు	9 సార్లు

నేటి చట్టాలు రేపటి కోసం

ప్రస్తుత కాలానికి అనుగుణంగా చట్టాలను ఆధునికీకరిస్తున్నాం

- సుప్రీంకోర్టు వజ్రోత్సవ వేడుకల్లో మోదీ



న్యూఢిల్లీ, జనవరి 28: "ప్రస్తుత కాలానికి అనుగుణంగా చట్టాలను ఆధునికీకరిస్తున్నాం. నేడు మారుతున్న ఈ చట్టాలు రేపటి భారత దేశాన్ని మరింత బలోపేతం చేస్తాయి" అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన సుప్రీంకోర్టు వజ్రోత్సవ(75వ వార్షికోత్సవం) వేడుకలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అదేవిధంగా డిజిటల్ సుప్రీంకోర్టు రిపోర్ట్(డీజీ ఎస్సీఆర్), డిజిటల్ కోర్ట్ 2.0, సుప్రీంకోర్టు నూతన వెబ్‌సైట్‌లను ప్రధాని ప్రారంభించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. ఇటీవల తీసుకువచ్చిన మూడు కొత్త నేర న్యాయ చట్టాలతో దేశ న్యాయ, పోలీసింగ్, విచారణ వ్యవస్థలు సరికొత్త యుగంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. వందల ఏళ్లనాటి చట్టాల నుంచి కొత్త చట్టాలకు మారుతున్న క్రమంలో ఈ ప్రక్రియ సజావుగా ఉండేలా చూసుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు సామర్థ్యం పెంపుదల, చట్టాలపై అవగాహనకు సంబంధించిన శిక్షణను ప్రారంభించినట్టు చెప్పారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు కూడా ముందుకు రావాలని, న్యాయవ్యవస్థలోని అన్ని విభాగాల సామర్థ్యాలను పెంచేందుకు సహకరించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. విశ్వసనీయమైన న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూ అనేక నిర్ణయాలు తీసుకుంటోందని వెల్లడించారు. 'జన్ విశ్వాస్' బిల్లు ఈ రూపంలో వచ్చిందేనని, దీనివల్ల న్యాయవ్యవస్థపై పడుతున్న అనవసరపు భారాన్ని తగ్గిపోతుందని చెప్పారు. "మధ్యవర్తిత్వ చట్టంతో న్యాయస్థానాలపై భారం తగ్గుతుంది. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాన్ని మెరుగుపరుస్తుంది" అని ప్రధాని తెలిపారు. సుప్రీంకోర్టు భవనాల విస్తరణ, మౌలిక సదుపాయాలకు సంబంధించి రూ.800 కోట్ల పనులకు గత వారమే ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. అయితే, కొత్త పార్లమెంటు భవనంపై పిటిషన్లు వేసినట్టుగా.. సుప్రీంకోర్టు మౌలిక సదుపాయాల కల్పనను సవాల్ చేస్తూ ఎవరూ పిటిషన్ వేయరని భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు నిర్ణయాలు డిజిటల్ రూపంలో అందుబాటులోకి రావడం, తీర్పులు స్థానిక భాషల్లో అనువదించే ఏర్పాటు చేయడం పట్ల ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. ఈ తరహా ఏర్పాట్లు దేశవ్యాప్తంగా ఇతర కోర్టుల్లోనూ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, ఇతర న్యాయమూర్తులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సుప్రీంకోర్టు
సీజేఐ

సుప్రీంకోర్టు తీర్పులు ఇక నుంచి డిజిటల్ నివేదికల రూపంలో ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి రానున్నాయని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. సుప్రీంకోర్టు వజ్రోత్సవ వేడుకల్లో మాట్లాడుతూ.. "ఇదొక మహత్తరమైన రోజు. రాజ్యాంగం ద్వారా ప్రజలు వారికి వారే ఏర్పాటు చేసుకున్న కోర్టు ఇది. పౌరుల పరస్పర గౌరవానికి రాజ్యాంగం పెద్దపీట వేసింది" అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. భవిష్యత్తు గురించి చెబుతూ.. దేశం మొత్తానికి సంబంధించిన రియల్ టైమ్ జ్యుడీషియల్ డేటాను పర్యవేక్షించేందుకు వీలుగా సాంకేతికతతో కూడిన 'వార్ రూమ్'ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ కీలకమైన పదవుల్లో మహిళలను నియమించినట్టు తెలిపారు.

రాజ్యాంగ నిర్మాతలకు స్ఫూర్తి

రాముడి పాలనే

ఈ ఏడాది తొలి 'మన్ కీ బాత్'లో మోదీ

న్యూఢిల్లీ, జనవరి 28: అయోధ్యలోని రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమం కోట్లాది మందిని ఏకతాటిపైకి తెచ్చిందని, ఆ సమయంలో దేశ సమష్టి శక్తి కనిపించిందని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఏడాది నిర్వహించిన తొలి మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. రాముడి పాలన రాజ్యాంగ నిర్మాతలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించారు. అందరి భావాలు, భక్తి ఒకటేనని.. అందరి మాటల్లో, అందరి హృదయాల్లో రాముడు ఉన్నాడని అన్నారు. ఈ నెల 22న చాలామంది రామ భజనలు పాడి వాటిని శ్రీరాముడికి అంకితం చేశారని, ఆ రోజు సాయంత్రం దేశమంతా రామ జ్యోతిని వెలిగించి దీపావళి జరుపుకొందని అన్నారు. ఈ సమష్టి శక్తి దేశాన్ని ప్రగతి పథంలో సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పద్మ అవార్డుల గురించి కూడా మోదీ మాట్లాడారు. ఇటీవల అవార్డులు అందుకున్న వారిలో చాలామంది క్షేత్రస్థాయిలో వెలుగులోకి రానప్పటికీ.. సమాజంలో పెను మార్పులకు కారణమైన వారేనని చెప్పారు. భారతీయ సంస్కృతిని, వారసత్వాన్ని దేశవిదేశాల్లో కొత్త పుంతలు తొక్కిస్తున్న విదేశీయుల్లో కూడా కొందరిని పద్మ అవార్డులతో సత్కరించామని వెల్లడించారు.

మహిళా శక్తి భేష్..

గణతంత్ర వేడుకల్లో మహిళా శక్తిని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న 20 బృందాల్లో 11 మహిళా బృందాలేనని కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సుమారు 1,500 మంది ఆడపడుచులు పాల్గొన్నారని ప్రధాని గుర్తుచేశారు. ఈ ఏడాది 13 మంది మహిళా క్రీడాకారులను అర్జున అవార్డుతో సత్కరించామని చెప్పారు. అవయవ దాతలను కూడా మోదీ ఈ సందర్భంగా కీర్తించారు.

కూలి చేసైనా భార్యకు భరణం ఇవ్వండి

- ఆదాయం లేదని ఎగవేత తగదు.. అలహాబాద్ హైకోర్టు ఆదేశం

లఖ్‌నవూ, జనవరి 28: ఉద్యోగం, ఆదాయం లేనందున విడాకులిచ్చిన భార్యకు మనోవర్తి చెల్లించలేనంటూ భర్త చెప్పడం తగదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. భార్యకు భరణం చెల్లించడం భర్త విధి అని తెలిపింది. కూలిపనులు చేసైనా సరే మనోవర్తి ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌కు చెందిన న్యాయమూర్తి జస్టిస్ రేణు అగర్వాల్ ఆదేశాలు ఇచ్చారు. ఆరోగ్యంగా ఉన్నందున కూలిపనులైనా చేసి రోజుకు రూ.300-400 సంపాదించవచ్చని, అందులో నెలకు రూ.2,000 భార్యకు ఇవ్వాలని ఆదేశించింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఓ జంటకు 2015లో వివాహం జరిగింది. భర్త, అత్తమామలు వరకట్నం కోసం వేధిస్తున్నారని పేర్కొంటూ ఆమె మరుసటి సంవత్సరమే పుట్టినింటికి వెళ్లిపోయింది. విడాకుల కోసం ఆమె ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేయగా ఆ న్యాయస్థానం అనుకూలంగా స్పందించింది. ప్రతి నెలా మనోవర్తి ఇవ్వాలని ఆదేశించింది. మనోవర్తి చెల్లించకపోవడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఆయన వాదనలు వినిపిస్తూ తనకు కొద్ది పాటి భూమే ఉందని, కూలి పనులు చేసుకొని బతుకుతున్నానని తెలిపాడు. తనకు ఆరోగ్యం బాగులేదని, తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్ల బాధ్యతలను చూసుకోవాల్సి ఉందని వివరించాడు. తాను అద్దె ఇంట్లో ఉంటున్నానని, ఆమె ప్రయివేటు స్కూలులో పనిచేస్తూ నెలకు రూ.10 వేలు సంపాదిస్తోందని చెప్పాడు. అయితే ఈ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించలేదు. ఆమె టీచరుగా పనిచేస్తోందనడానికి ఎలాంటి ఆధారాలు చూపలేదని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నందున రోజువారీ కూలి పనులైనా చేసి సంపాదించవచ్చని, దాని నుంచి భరణం చెల్లించాలని సూచించారు.

రిజర్వ్‌డ్ పోస్టుల డీరిజర్వ్ కుదరదు

యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలపై కేంద్ర విద్యాశాఖ వివరణ

న్యూఢిల్లీ, జనవరి 28: ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వు చేసిన పోస్టులకు తగిన అభ్యర్థులు దొరకని పక్షంలో వాటిని అన్ రిజర్వుడుగా ప్రకటించే ప్రతిపాదనతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాలపై తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో కేంద్ర విద్యాశాఖ ఆదివారం దానిపై వివరణ ఇచ్చింది. రిజర్వుడు పోస్టులను డీ-రిజర్వ్ చేయడం కుదరదని స్పష్టం చేసింది. "ద గైడ్‌లైన్స్ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద రిజర్వేషన్ పాలసీ ఆఫ్ ద గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్' పేరుతో యూజీసీ ఇటీవలే ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించింది. దానిపై భాగస్వాముల స్పందన కోరుతూ ఆ గైడ్‌లైన్స్‌ను తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్‌ను తొలగించేందుకే కేంద్రం ఈ కుట్రకు తెరతీసిందంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు సంబంధించిన సమస్యలపై మోదీ సర్కారు ప్రతీకాత్మక రాజకీయాలు చేస్తోందని మండిపడింది. కొన్నాళ్ల కిందే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్ల సమీక్షపై మాట్లాడారని.. ఆయన అన్నట్లుగానే ఇప్పుడు ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను ఎత్తేసేందుకు కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ ఆరోపించారు. 'మోహన్ భగవత్ ఉద్దేశాలకు అనుగుణంగానే యూజీసీ ప్రతిపాదనలున్నాయి. ఇది దళిత, గిరిజన, వెనకబడిన వర్గాలకు అన్యాయం చేయడమే అవుతుంది. దీనిపై పోరాడుతాం' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో.. కేంద్ర విద్యా సంస్థల (రిజర్వేషన్ ఇన్ టీచర్స్ కేడర్) చట్టం, 2019 ప్రకారం రిజర్వుడు పోస్టులను డీ-రిజర్వ్ చేసే అవకాశం లేదని.. పోస్టులన్నింటినీ ఆ చట్టం ప్రకారమే భర్తీ చేయాల్సిందిగా అన్ని కేంద్ర విద్యాసంస్థలకూ కఠిన ఆదేశాలు జారీ చేశామని కేంద్ర విద్యాశాఖ ట్విటర్‌ద్వారా వివరణ ఇచ్చింది. యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. గతంలోనూ అలా డీ-రిజర్వ్ చేయలేదని.. ఇకముందూ అలా జరగదని తేల్చిచెప్పారు.


తిరుమల ఆలయం ముందు జస్టిస్ వెంకటరమణ

శ్రీవారి సేవలో జస్టిస్ వెంకటరమణ

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

21 మంది ఐఏఎస్‌ల బదిలీ

- 3 జిల్లాల కలెక్టర్లకు స్థానచలనం
- జాబితాలో ఏడుగురు జేసీలూ...
- తిరుపతి కలెక్టర్‌గా లక్ష్మీషా
- ప్రకాశం జేసీ శ్రీనివాసులుకు నంద్యాల కలెక్టర్‌గా పోస్టింగ్
- సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి ఉత్తర్వులు ఆదివారం జారీ చేశారు. ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అధికారులను ఈ నెలాఖరులోగా బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించిన మేరకు ప్రభుత్వం 21మంది ఐఏఎస్ అధికారులకు స్థానచలనం కలిగించింది. శ్రీకాకుళం, నంద్యాల, తిరుపతి జిల్లాల కలెక్టర్లను, నెల్లూరు, ప్రకాశం, విశాఖ, విజయనగరం, కాకినాడ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల జేసీలను, నూజివీడు, విజయవాడ సబ్‌కలెక్టర్లతో పాటు పలువురు అధికారులను బదిలీ చేశారు. అన్నమయ్య కలెక్టర్‌గా ఆర్థికశాఖ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న ముట్టింబాకు అభిషిక్త్ కిశోర్‌ను నియమించారు.

బదిలీ అయిన ఐఏఎస్ అధికారుల వివరాలు....

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
లత్కర్ శ్రీకేశ్ బాలాజీరావు	శ్రీకాకుళం కలెక్టర్	మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్
డాక్టర్ మన్జీర్ జిలానీ సమూన్	నంద్యాల కలెక్టర్	శ్రీకాకుళం కలెక్టర్
కె. వెంకట రమణారెడ్డి	తిరుపతి కలెక్టర్	ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ
డాక్టర్ జి.లక్ష్మీషా	ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ	తిరుపతి కలెక్టర్
డాక్టర్ కె. శ్రీనివాసులు	ప్రకాశం జేసీ	నంద్యాల కలెక్టర్
ముట్టింబాకు అభిషిక్త్ కిశోర్	ఆర్థికశాఖ జాయింట్ సెక్రటరీ	అన్నమయ్య కలెక్టర్
ఎ.తమీమ్ అన్సారియా	వెయిటింగ్	శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్
డాక్టర్ బీఆర్ అంబేద్కర్	విపత్తుల నిర్వహణశాఖ డైరెక్టర్	పార్వతీపురం మన్యం జేసీ
రోణంకి కూర్మనాథ్	నెల్లూరు జాయింట్ కలెక్టర్	విపత్తుల నిర్వహణ శాఖ డైరెక్టర్
కె.ఎస్. విశ్వనాథన్	విశాఖ జాయింట్ కలెక్టర్	జీవీఎంసీ అడిషనల్ కమిషనర్
కత్వాటే మయూర్ అశోక్	విజయనగరం జేసీ	విశాఖపట్నం జాయింట్ కలెక్టర్
గోపాలకృష్ణ రోణంకి	ఎస్ఎస్ అండ్ ఎల్ఆర్ ఏడీ	ప్రకాశం జాయింట్ కలెక్టర్
ప్రవీణ్ ఆదిత్య	పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్	కాకినాడ జాయింట్ కలెక్టర్
ఇల్లక్కియా	కాకినాడ జాయింట్ కలెక్టర్	పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్
ఆర్. గోవిందరావు	పార్వతీపురం మన్యం జేసీ	ఎస్ఎస్ అండ్ ఎల్ఆర్ ఏడీ
కొల్లాబత్తుల కార్తీక్	అల్లూరి సీతారామరాజు జేసీ	విజయనగరం జాయింట్ కలెక్టర్
భావన	గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఏడీ	అల్లూరి సీతారామరాజు జేసీ
డి.హరిత	తిరుపతి మున్సిపల్ కమిషనర్	ఏపీయూఎఫ్ఐడీసీ ఎండీ
ఆదర్శ్ రాజేంద్రన్	నూజివీడు సబ్‌కలెక్టర్	నెల్లూరు జాయింట్ కలెక్టర్
అదితి సింగ్	విజయవాడ సబ్‌కలెక్టర్	తిరుపతి మున్సిపల్ కమిషనర్
జి.రేఖారాణి	వెయిటింగ్	పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగం కార్యదర్శి

ఎస్సీ నియోజకవర్గంలో.. పెద్దిరెడ్డి పెత్తనమేంటి?

గ్రావెల్, ఇసుక అక్రమాలు మీవి.. నిందలు మోపేది నాపైనా?

- సత్యవేడును భ్రష్టు పట్టించారు
- సీఎంకు ఫిర్యాదు చేసిన రోజు నుంచి నన్ను వేధిస్తున్నారు
- పెద్దిరెడ్డి 1989లో మోటర్ సైకిల్‌పై తిరిగేవాడు
- ఇప్పుడు ఇన్ని ఆస్తులెలా వచ్చాయ్?
- నా సెగ్మెంట్ మీటింగు మీ ఇంట్లోనా?
- జనరల్ స్థానాల్లో ఇలా చేసే దమ్ముందా?
- వైసీపీలో ఎస్సీలకు గౌరవం లేదు
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఫైర్


తన కుమారుడితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీలో ఎస్సీలకు గౌరవం లేదు.. ఎస్సీ నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పెత్తనమేమిటి? సత్యవేడు నియోజకవర్గాన్ని ఆయనా, ఆయన కొడుకు మిథున్‌రెడ్డి భ్రష్టు పట్టించారు.. గ్రావెల్, ఇసుక అక్రమాలు వారి కనుసన్నల్లోనే జరిగాయి.. కానీ నిందలు నాపై వేస్తున్నారు..' అని తిరుపతి జిల్లా సత్యవేడు (ఎస్సీ) వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మండిపడ్డారు. సత్యవేడు మీటింగు మంత్రి ఇంట్లో పెట్టి కార్యకర్తల్ని గొర్రెల్లా తరలించారని.. జనరల్ స్థానాల్లో ఇలా చేసే దమ్ముందా అని నిలదీశారు. నింద్ర మండలం కొప్పేడు వద్ద ఆదివారం తన కుమారుడు, నారాయణవనం జడ్పీటీసీ సుమన్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. తాను ఉద్యమాల నుంచి పుట్టిన నాయకుడినని, సర్పంచ్ నుంచి ఎంపీటీసీ, ఎంపీపీ, ఎమ్మెల్యే దాకా ఎదిగానన్నారు. మంత్రి పెద్దిరెడ్డి కనీసం సర్పంచ్‌గా అయినా పనిచేశారా అని ప్రశ్నించారు. '1989లో నేను మాజీమంత్రి చెంగారెడ్డి వద్ద ఉన్నపుడు పెద్దిరెడ్డి మోటర్‌సైకిల్‌పై తిరిగేవాడు. ఇప్పుడు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి? 14 ఏళ్లుగా ఎండనకా వాననకా పార్టీ జెండా పట్టుకుని కష్టపడి పనిచేశా. ఈ రోజు జిల్లాలో ఉన్న పార్టీ నాయకులందరి కంటే నేనే సీనియర్‌ను. నియోజకవర్గంలోని 650 గ్రామాల్లో ప్రతి గడపా తిరిగి పార్టీని బలోపేతం చేశా. సత్యవేడులో ఇసుక, గ్రావెల్ అక్రమ దందాలన్నీ పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే జరిగాయి. కానీ చెడ్డపేరు మాత్రం నాకు ఆపాదించారు. పెద్దిరెడ్డి సిఫారసుతోనే నియోజకవర్గంలో పదవులను రెడ్డి సామాజికవర్గానికి ఇచ్చాను. ప్రభుత్వ నియామకాల్లోనూ ఆయన సూచించిన వాళ్లకే కట్టబెట్టాను. కానీ నాకు అసెంబ్లీ టికెట్ రాకుండా ఆయన కుట్ర చేశారు. నా నియోజకవర్గంలో 33 రోడ్ల పనులను కాంట్రాక్టుకు తీసుకుని ఒక్క పని కూడా పూర్తి చేయలేదు. నాకు తెలియకుండా క్వారీలకు అనుమతులు ఇచ్చారు. చెక్‌పోస్టులు, మనుషులను పెట్టి డబ్బు సంపాదించుకున్నది వారు. నిందలు మాత్రం నాపై వేస్తున్నారు. నాకు వ్యాపారాలు లేవు. ప్రజల కోసమే పనిచేశా. రెండుసార్లు కరోనా బారినపడ్డా. కార్యకర్తలకు, ప్రజలకు అర్ధరాత్రి కూడా అందుబాటులో ఉన్నాను. అలాంటి నాకు ఇలా చేయడం పెద్దిరెడ్డికి ధర్మమేనా? నాకు ఇష్టం లేకున్నా ఎంపీగా పోటీ చేయమని పంపించారు. కారణం అడిగితే నాపై రిపోర్టు సరిగా లేదని సీఎం చెప్పారు. అప్పుడే ఆయనకు వీరి గురించి చెప్పా. ఆ రోజు నుంచే పెద్దిరెడ్డి, మిథున్ ఇద్దరూ హింస పెడుతూ వేధిస్తున్నారు. నాకు ఒక్క మాట కూడా చెప్పకుండా సత్యవేడు నియోజవకర్గ వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం తిరుపతిలో నిర్వహించారు. ఇది నా ఆత్మాభిమానాన్ని దెబ్బతీసింది. నా నియోజకవర్గంలో ఏడు మండలాలుండగా వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతిలో ఎలా నిర్వహిస్తారు? అసలు ఎస్సీ నియోజకవర్గంలో మీ పెత్తనం ఏమిటి? ఇలా శ్రీకాళహస్తి, చెవిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రోజా నియోజకవర్గాల్లో చేస్తారా? అంత దమ్ముందా? పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి సిగ్గులేని వ్యక్తులు' అంటూ విరుచుకుపడ్డారు. తనను కాదని తిరుపతి ఎంపీ గురుమూర్తి తన నియోజకవర్గంలో తిరుగుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకింకా ఎమ్మెల్యేగా 80 రోజులు గడువుందని, ఆ సమావేశానికి అధ్యక్షత వహించాల్సింది తాను కాదా అని వాపోయారు.

ఆదిమూలం తిరుగుబాటుతో దుమారం

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేసిన తిరుగుబాటు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీలో దుమారం రేపింది. ప్రత్యేకించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి వర్గంలో కలవరం రేగింది. తొలి నుంచీ ఎస్సీ, బీసీ, మైనారిటీ ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్ల కేటాయింపులో వైసీపీ అధిష్ఠానం ఇష్టానుసారం వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలను వేరే చోట్లకు బదిలీ చేయడం.. కొందరికి మొండిచేయి చూపడం.. వారిని కాదని కుటుంబసభ్యులకు ఇవ్వడం వంటివి ఆయా వర్గాల్లో ఆగ్రహానికి కారణమయ్యాయి. అయితే బాధిత ఎమ్మెల్యేలెవరూ ఆదిమూలం తరహాలో బహిరంగ విమర్శలకు దిగలేదు. ఇంతవరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డిపై వైసీపీలో ఎవరూ నోరుమెదపలేదు. ఇకపై మిగిలిన అసంతృప్త నేతలు కూడా ఆయన ఆధిపత్యాన్ని ప్రశ్నించవచ్చని.. అదే జరిగితే పార్టీ పరువు గంగపాలవుతుందని వైసీపీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

ఎక్కువ మాట్లాడితే రాళ్ల దెబ్బలే!

- చంద్రబాబుపై పెద్దిరెడ్డి వ్యాఖ్యలు

పుంగనూరు, జనవరి 28: వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే నైరాశ్యంతోనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని, ఇంకా ఎక్కువ మాట్లాడితే ఆయనకు రాళ్లదెబ్బలు తప్పవని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం చిత్తూరు జిల్లా పుంగనూరు సమీప గూడూరుపల్లె వద్ద ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కుప్పం సహా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గెలవదని జోశ్యం చెప్పారు. మళ్లీ రాబోయేది జగన్ ప్రభుత్వమేనన్నారు. టీడీపీకి ఓట్లు వేసి గెలిపిస్తే మనకాళ్లు మనమే నరికేసుకున్నట్లని, చంద్రబాబు సీఎం అయితే మళ్లీ రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళుతుందని పేర్కొన్నారు. పాపాల పెద్దిరెడ్డి అనడానికి తాను కుట్రలు, మోసాలు చేయలేదని చెప్పారు. చౌకబారుగా విమర్శలు చేసి చంద్రబాబు స్థాయి తగ్గించుకుంటున్నారని మండిపడ్డారు.

బెజవాడలోనూ అదే దుస్థితి

తాడేపల్లి టౌన్/విజయవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయంలో ఉన్నవారికి, ప్రమాదాల బారిన వారికి సహాయక చర్యలు అందించడానికి యంత్రాంగానికి 'పరిధులు' అడ్డొస్తున్నాయి. చివరకు చనిపోయిన వారి మృతదేహాలను తరలించడానికీ 'లిమిట్స్' సాకులు చెబుతున్నారు. తమ పరిధి కాకపోయినా సంబంధిత అధికారులకు సమాచారం అందించి బాధితులకు అండగా నిలవచ్చు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బాధితులు ఎంతటి బాధాకరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారో చెప్పడానికి తాజాగా విజయవాడ పక్కనే కృష్ణా నదిలో జరిగిన ప్రమాద ఘటనే ఉదాహరణ. విజయవాడ పటమట ప్రాంతానికి చెందిన నడుపల్లి నాగసాయి కార్తికేయ (13), కత్తి ప్రశాంత్ (13), గగన్ (12) స్నేహితులతో కలిసి నడుచుకుంటూ కృష్ణా నదిలోకి వెళ్లారు. అలా కొన్ని పాయలు దాటుకుంటూ వెళ్లారు. గుంటూరు జిల్లా తాడేపల్లి దగ్గర ఓ పాయలో ఈతకు దిగి మునిగిపోయారు. ఒడ్డున ఉన్న మరో స్నేహితుడు షారుఖ్ బంధువులకు సమాచారం ఇచ్చాడు. ముగ్గురు చిన్నారుల మృతదేహాలను మత్స్యకారులు గుర్తించినా, వాటిని రోడ్డు మీదకు తీసుకురావడానికి మాత్రం గంటల సమయం పట్టింది. వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు ద్విచక్ర వాహనాలపై మృతదేహాలను తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో అంబులెన్స్ వెళ్లగలిగిన ప్రాంతానికి సమీపంలోకి బైకులపై మృతదేహాలు తీసుకువచ్చారు. అయినా అధికారులు అంబులెన్స్ ఏర్పాటు చేయలేదు. ఒకటి, రెండు గంటలు గడిచినా పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో కన్నబిడ్డలు పోయిన దుఃఖంలోనూ బైకులపైనే మృతదేహాలను తీసుకుని యనమలకుదురు రోడ్డు వరకు తీసుకొచ్చారు. అయినా అంబులెన్స్‌లు రాలేదు. రాత్రి తొమ్మిది గంటల వరకు ఎదురు చూశారు. ప్రమాదం జరిగిన ప్రాంతం గుంటూరు జిల్లాకు చెందినది కావడంతో తమ పరిధి కాదని విజయవాడ పోలీసులు పట్టించుకోలేదు. మృతదేహాలను తరలించేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేయలేదు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన తల్లిదండ్రులు, బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. "చనిపోయిన ప్రాంతం నుంచి మా బిడ్డలను మేమే తెచ్చుకున్నాం. మార్చురీకి తరలించడానికి అంబులెన్స్‌లను కూడా రప్పించలేరా" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ధర్మమేనా అని నిలదీశారు. 'మీ పిల్లలకు ఇలా జరిగితే ఈ విధంగానే వ్యవహరిస్తారా' అని ధ్వజమెత్తారు. తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేసిన కాసేపటికి పోలీసులు అంబులెన్స్‌లను రప్పించి మృతదేహాలను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


నాసిన్ అకాడమీలో అగ్నిప్రమాదం కారణంగా వ్యాపించిన పొగలు

నాసిన్ అకాడమీలో అగ్నిప్రమాదం

- లైబ్రరీ భవనంలో పెద్దఎత్తున మంటలు
- వెల్డింగ్ పనులు చేస్తుండగా సిలిండర్ పేలడం వల్లే ప్రమాదం?

గోరంట్ల, జనవరి 28: శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపాన ఉన్న నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ సెంట్రల్ ఎక్సైజ్, పరోక్ష పన్నులు, నార్కోటిక్స్) నూతన భవనంలో ఆదివారం మంటలు చెలరేగాయి. 503 ఎకరాల్లో రూ.541.63 కోట్లతో నిర్మించిన నాసిన్‌ను ఈ నెల 16న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. అకాడమీలో భవన నిర్మాణ పనులు పూర్తికాకపోయినా, ప్రారంభోత్సవం నిర్వహించారన్న విమర్శలు వినిపించాయి. ఆకాడమీ పరిపాలన భవనంలోని లైబ్రరీ భవనంలో ఉదయం 11.30 గంటల సమయంలో పెద్దఎత్తున మంటలతో దట్టమైన పొగలు కమ్మేశాయి. సమీప గ్రామాల ప్రజలు గుర్తించి, ఫొటోలు తీయడంతో విషయం వెలుగుచూసింది. ఆకాడమీలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసే క్రమంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా సిలిండర్ పేలి మంటలు వ్యాపించినట్టు తెలిసింది. షార్ట్ సర్క్యూట్ కారణమనే వాదనలూ వినిపిస్తున్నాయి. మంటలు చెలరేగిన వెంటనే పెనుకొండ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. నూతన భవనం అద్దాలు, ఏసీ మిషన్లు తదితర సామగ్రి పూర్తిగా కాలిపోయి పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. ఆకాడమీలోకి ఎవ్వరినీ అనుమతించకపోవడంతో అగ్ని ప్రమాదానికి కారణాలు, ఆస్తినష్టం వివరాలు తెలియరాలేదు.

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు తహసీల్దార్లుగా రివర్షన్

- ప్రకాశంలో సదావర్తి మఠం భూ అక్రమాలపై చర్యలు
- ఇద్దరు విశ్రాంత తహసీల్దార్లకు పెన్షన్‌లో కోత విధింపు?
- ఇద్దరు వీఆర్వోలకు ఆరేళ్ల పాటు ప్రమోషన్ నిలుపుదల
- మరో రెవెన్యూ ఉద్యోగిపైనా శాఖాపరమైన చర్యలు
- ప్రస్తుతం ఈ భూమి విలువ దాదాపు రూ.300 కోట్లు

ఒంగోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట వద్ద రూ.వందల కోట్ల విలువైన సదావర్తి మఠం భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన వ్యవహారంలో పలువురు రెవెన్యూ అధికారులపై వేటు పడింది. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు కలెక్టర్ కార్యాలయానికి చేరాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను తహసీల్దార్లుగా రివర్షన్ చేశారు. ఇద్దరు విశ్రాంత తహసీల్దార్లతో పాటు మరో ముగ్గురు రెవెన్యూ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. రివర్షన్‌కు గురైన డిప్యూటీ కలెక్టర్లలో ఒకరు గతంలో ఒంగోలు ఆర్డీవోగా, డీఆర్‌డీఏ పీడీగా సుదీర్ఘకాలం పనిచేసి ప్రస్తుతం అనమయ్య జిల్లా మదనపల్లి ఆర్డీవోగా ఉన్న మురళి కాగా, మరొకరు గతంలో సంతనూతలపాడు తహసీల్దార్‌గా పనిచేసి ప్రస్తుతం గుంటూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న లలితకుమారి. ఇక రిటైర్డ్ తహసీల్దార్లు అమీర్ బాషా, గాంధీకి పెన్షన్‌లో కోత విధించినట్లు సమాచారం. ఇక అప్పట్లో పేర్నమిట్టలో పనిచేసి ప్రస్తుతం ముక్తినూతలపాడు వీఆర్వోగా ఉన్న వి.అంకిరెడ్డి, చోడవరం వీఆర్వోగా ఉన్న శ్రీదేవికి ఆరేళ్ల ఉద్యోగోన్నతుల నిలుపుదలతో పాటు 3 ఇంక్రిమెంట్లు కోత విధించారు. మరో రెవెన్యూ ఉద్యోగిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం సదరు భూమి విలువ సుమారు రూ.300 కోట్ల వరకూ ఉంటుంది.

ఆర్యవైశ్యులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి: ముక్కాల

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28: ఇంతకాలం గుప్తదానాలతో సమాజానికి ఉపయోగపడిన ఆర్యవైశ్యులంతా రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన ఏపీ ఆర్యవైశ్య మహాసభ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిస్థితులు మారిన దృష్ట్యా ఇంత కాలం ఒక లెక్క, ఇప్పటి నుంచి మరో లెక్క అని స్పష్టంచేశారు.

ఆదోనిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి అవమానం

ఆదోని, జనవరి 28: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి అవమానం జరిగింది. కర్నూలు జిల్లా ఆదోనిలో పొట్టి శ్రీరాములు విగ్రహంపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు పేడ వేశారు. దీనిపై ఆర్యవైశ్య సంఘం నాయకులు అక్కడ చేరుకొని ఆందోళనకు దిగారు. అనంతరం ఆదోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


పొట్టి శ్రీరాములు విగ్రహం

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



ఖండిత శిరస్ స్త్రీలు

చిగురుటాకుల ఎర్రటి అధరాలు లేవు
వాటి కొసన వెలిగే చిరునగవులు లేవు

సోగకళ్ళ చీకటి కాటుక నేత్రాలు లేవు
నక్షత్రాల్లా వెలిగే చూపులు లేవు

సంపెంగ కొసల నాసికలు లేవు
ఆ కొసన సూర్య కిరణమై మెరిసే పుడక లేదు

చెవులకు వేలాడే లోలాకులు లేవు
అలల రెక్కల తుమ్మెద కురులు లేవు

మాటని, శ్వాసని, జ్ఞానాన్ని,
సకల భావోద్వేగాలని, నవనాడులను
నియంత్రించి, దేహాన్ని నడిపే
కోట్లను కోట్ల న్యూరాన్ల సంగమ కూడలి
మానవ పురా రహస్య పేటికలో దాగి

ఇంకా పూర్తిగా కనుగొనని
మెలితిరిగి, ముడతలు పడిన
మెదడు అసలే లేదు
మనసు, హృదయాల ఊసన్నది
లేదు గాక లేదు

ఖండిత శిరస్ స్త్రీలకి దేహం ఉంది
రెండు చేతులున్నాయి
వాటి మధ్య రెండు రొమ్ములున్నాయి
ఆ కింద రెండు కాళ్లు, వాటి మధ్య
ఓహో! మహాద్భుత మర్మావయము ఉంది

ఏమి చేతులవి
సమస్త చాకిరీనీ ప్రతిఫలం అడగకనే
నిరంతరం చేస్తాయి

ఏమి రొమ్ములు అవి
మెత్తటి దూది తలగడల సుఖ నిద్రని
పురుషుడికి ఇస్తాయి
శిశువులకు పాలిస్తాయి
మర్మావయం అపరిమిత ఆనందాన్ని,
వాడికి సంతానాన్ని ఇస్తుంది

అనాదిగా స్త్రీల అపజయాలను
మగవాడి గెలుపు ధ్వజస్థంబాలను నాటే
పవిత్ర బలిస్థలం అది

మొండేలు, మొండేలుగా నడిచే స్త్రీలు
వట్టి దేహమై నడిచే స్త్రీలే లోకమంతటా

పని చేసేందుకు, పడుకునేందుకు
పిల్లల్ని కనేందుకు
స్త్రీలకు తలలు ఎందుకు?
మొండేలు చాలు
వారసుల్ని, సుఖాలను ఇవ్వగల అవయవాలు,
మాంసపు ముద్దలు
వట్టి శరీరాలు గల తెగిన
శిరస్సుల స్త్రీలు చాలు

ఒక తల తెగనరికిన స్త్రీని
ఇప్పుడే సమాధి చేసి వస్తున్నాను
దుఃఖ, దుఃఖంగా ఉంది లోన

నా తల నా చేతుల మధ్య నిలిచి
అడుగుతోంది నన్ను ఇప్పుడు

నువ్వు శిరస్సు తెగిన దేహానివా
లేక శిరస్సు ఇంకా దేహానికి
మిగిలి వున్న మనిషివా
లేక ప్రశ్నించగల శిరస్సువా అని

వాడు దేహాలు మాత్రమే గల స్త్రీలు జన్మనిచ్చిన కొడుకైనా
వాడు దేహాలు పరిచిన స్త్రీల సఖుడైనా
వాడు అనేకమార్లు
తల్లి తల తెగనరికిన
పరశురాముడి వారసుడిగా చివరి తేలుతాడు

తెగిన స్త్రీల శిరస్సులు నేలలో నాటిన
విత్తనాలై మొలకెత్తుతాయి
తెగిన స్త్రీల శిరస్సులు మాట్లాడతాయి
తమ బాధాకర, చిత్రహింసల జ్ఞాపకాల గురించే కాదు
నరికిన వాడి చేతులకంటిన నెత్తుటి గురించి
దేహం పై శిరస్సులు ఇంకా మిగిలిన వాళ్ల
మౌన అంగీకారాల గురించి
అవి నిలదీస్తాయి

పరశురామా!
నీ గొడ్డలి ఈ స్త్రీల చేతులకి అందితే అప్పుడేమవుతుంది?
ఆ ముగింపు కోరకనే కదా యుగాలుగా
స్త్రీలు ఖండిత శిరస్సులైంది?

నా వలే, నీ వలే
దేహాలు మాత్రమే మిగిలిన స్త్రీలు తమ
శిరస్సులు వెతుక్కుంటూ బయలుదేరారు

పరశురామా!
ఈ కథకు ఇక ముగింపు తప్పక పలుకుతారు వాళ్ళు

(హైదరాబాద్ నగరంలో 16.1.2024న ఇద్దరు పిల్లల తల్లి పుష్పలతను ఆమె భర్త తల తెగ నరికి చంపాడు. అంకురం పిల్లల హోంలో చదువుకున్న పుష్పను, ఆమె పాపని ఈ ఘటన జరగడానికి కన్నా కొన్ని రోజుల ముందే కలిసాను. పుష్ప, అలాంటి అనేక మంది స్త్రీల జీవితాలు రేపిన నా లోపలి కల్లోలమే ఈ కవిత.)

విమల

'లోయ చివరి రహస్యం' కథా సంపుటి

భగవంతం కథల సంపుటి 'లోయ చివరి రహస్యం' ఆవిష్కరణ సభ బోధి ఫౌండేషన్ & తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 సా.6గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి & ఆవిష్కర్త- కె. శ్రీనివాస్; విశిష్ట అతిథి- కిల్లాడ సత్యనారాయణ; అధ్యక్షులు- ఎస్. రఘు; తొలి ప్రతి స్వీకర్త- వి. హర్షవర్ధన్. ఆత్మీయ వాక్యం- సిద్ధార్థ, నండూరి రాజగోపాల్, ఇండ్ల చంద్రశేఖర్.

బోధి ఫౌండేషన్

'వర్తన' ప్రారంభ సమావేశం

సాహిత్యరంగంలో నవీన ధోరణులను పాదుకొల్పే లక్ష్యంతో ఏర్పాటయిన 'వర్తన' సాహిత్య సంస్థ ప్రారంభ సమావేశం ఫిబ్రవరి 4 ఉ.10.30గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 'కవిత్వం - శిల్పం' అంశంపై విమర్శకులు ఎం. నారాయణ శర్మ ప్రసంగిస్తారు. సమావేశానికి అధ్యక్షత- గుడిపాటి, సమన్వయకర్త- ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

'కొన్ని మబ్బులు' కవిత్వ సంపుటి

విలాసాగరం రవీందర్ కవితల సంపుటి 'కొన్ని మబ్బులు' ఆవిష్కరణ సభ తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4 ఉ.10గంటలకు కరీంనగర్ ఫిలిమ్ భవన్‌లో జరుగుతుంది. అతిథులుగా పొన్నం రవిచంద్ర, గంగ్ర లక్ష్మణరావు, బూర్ల వేంకటేశ్వర్లు, దామరకుంట శంకరయ్య పాల్గొంటారు.

సి.వి. కుమార్

'పుణ్యభూమి నాదేశం నమో నమామి' శతాధిక కవి సమ్మేళనం

సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా 'పుణ్యభూమి నాదేశం నమో నమామి' శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నాం. మల్లెతీగ, నవభారత నిర్మాణ సంఘం, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న రోజంతా విజయవాడలో జరిగే ఈ కవి సమ్మేళనంలో దేశభక్తి, తెలుగుభాష, పర్యావరణం, ప్రపంచశాంతి అంశాలపై కవితలు చదవాలి. పది ఉత్తమ కవితల్ని ఎంపిక చేసి ఆ రోజు సాయంత్రం ఒక్కొక్క కవితకు రూ.1116నగదు బహుమతితో పాటు ప్రసంశాపత్రం, మంచి పుస్తకం, సత్కారం అందజేస్తాం. ఆసక్తి గల కవులు 83329 03156 నెంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలి.

కలిమిశ్రీ

'లోపలి ముసురు' ఆవిష్కరణ


అరుణ నారదభట్ల కవిత్వ సంపుటి 'లోపలి ముసురు' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 4 సాయంత్రం రవీంద్రభారతి మినీహాలులో జరుగుతుంది. ముఖ్య అతిథి- ఎన్. గోపి, అధ్యక్షత- ఏనుగు నరసింహ రెడ్డి. ఆత్మీయ అతిథులు- ఎస్. రఘు, మామిడి హరికృష్ణ, యాకూబ్, మెర్సీ మార్గరేట్.

నారాయణ శర్మ

ఉగాది కథల పోటీ

తెలుగు భాషోద్యమ సమితి, తిరుపతి నిర్వహించే ఉగాది కథల పోటీకి ఐదు పేజీల నిడివి మించని కథలకు ఆహ్వానం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3 వేలు. వెయ్యి రూపాయలకు పది ప్రోత్సాహక బహుమతులు. కథలను ఐఎస్‌బిఎన్ నంబరుతో కథా సంకలనంగా ముద్రిస్తాం. అను 7.0 ఫాంట్, పేజ్‌మేకర్ ఫైల్ ద్వారా, హామీపత్రం జతచేసిన కథలను ఫిబ్రవరి 15 లోగా telugubhashodyamasamiti@gmail.com కు ఈమెయిల్ పంపాలి. వివరాలకు: 7981872655

ఆకుల మల్లేశ్వర రావు



కవిగారి జాడ

ఊరు భాషలో ఊరు యాసలో
ఊరు గురించి కవిత్వం రాసే
ఓ కవి
తన కవిత్వం వినిపించడానికి
మహానగరానికి వెళ్ళాడు

ఆ కవి తిరిగి ఊరికి
ఎప్పుడొస్తాడో తెలీదు

ఇక్కడ ఊర్లో
పరాయితనం
ముళ్ళకంపలా బ్రహ్మజెముడులా
మొలిచి విస్తరిస్తోంది
రంగులు హంగులు పొంగులు
పొర్లీ పొర్లీ
చెట్టూ చెరువూ చెలిమి
చెల్లా చెదురవుతున్నాయి

పాపం కవి
ఈ దారెంటే వెళ్ళాడు
ఎప్పుడు ఎట్లా తిరిగొస్తాడో

ఇంతలో
ఊర్లో నుంచి కవితొకటి
కవిగారి జాడలో నగరం
దారి వెతుక్కుంటూ వెళ్లింది

వారాల ఆనంద్

కథా సంపుటాలకు ఆహ్వానం

తపన సాహిత్య వేదిక 'సడ్లపల్లె కథాపురస్కారం' కోసం కథల సంపుటాలను ఆహ్వానిస్తున్నది. ఉత్తమ కథా సంపుటానికి రూ.10వేల బహుమతి. జనవరి 2022 నుంచి డిసెంబరు 2023 మధ్యలో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు ప్రతులను మార్చి 31 లోపు చిరునామా: సడ్లపల్లె చిదంబర రెడ్డి, 21-6-139, టీచర్స్ కాలనీ, హిందూపురం- 515 211కు పంపగలరు. ఫోన్: 94400 73636.

తపన సాహిత్య వేదిక

ఫేస్‌బుక్ గూటికి చేరిన తెలుగు సాహిత్యం

"మూడు పువ్వులు ఆరు కాయలన్నట్లుగా" మూడు సన్మాన సభలతోనూ, ఆరు ఆవిష్కరణ సభలతోనూ విరాజిల్లుతున్న సాహితీ కార్యక్రమాలు కరోనా విషశ్వాస తగిలి ఆర్పుకుపోయాయి. ఇంట్లోనో, పార్కులోనో, హోటల్‌లోనో, స్కూల్ కాలేజ్ ప్రాంగణాల్లోనో సాహిత్యాభిమానులు అంతా కలిసి సమూహంగా ఏర్పడి ఓ పుస్తకం గురించో, ఓ కవి, రచయిత గురించో, ఓ ట్రెండ్ గురించో, ఏదైనా ఒక సమకాలీన సమస్య గురించో ఆలోచనల్ని ఒకరికొకరు పంచుకొని మాట్లాడుకునే రోజులు కరోనా కాలంలో దూరమయ్యాయి. ఆ విషమ పరిస్థితుల్లో చాలా వరకు సామాజిక మాధ్యమాలే సాహిత్యానికి వేదికలయ్యాయి. లాక్డౌన్ వల్ల ఇళ్లకే పరిమితమైన సాహిత్యాభిమానులంతా ఇంటర్నెట్ వేదికగా అనేక కార్యక్రమాల్ని నిర్వహించారు. అలా అలవాటుపడ్డాక కరోనా తర్వాత కూడా చాలా సమావేశాల్ని కార్యక్రమాల్ని నేడు ఇంటర్నెట్ వేదికగానే నిర్వహిస్తున్నారు.

కరోనా ఎన్నో విలువైనవాటిని మన నుంచి తీసుకుపోతూ మరికొన్నింటిని మనకి పరిచయం చేసింది. వాటిల్లో అంతర్జాల సదస్సులు (ఇంటర్నెట్ కాన్ఫరెన్సులు) ముఖ్యంగా చెప్పుకోదగినవి. వాట్సాప్, ఈమెయిల్, ఫేస్బుక్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ (నేటి 'ఎక్స్').. ఇలా ఎన్నో సామాజిక మాధ్యమాల్లో రకరకాల సాహిత్య విషయాల చర్చలు, సమావేశాలు, కార్యశాలలు ముమ్మరంగా సాగుతున్నాయి. గూగుల్ మీట్, జూమ్, యూట్యూబ్, మైక్రోసాఫ్ట్ టీమ్స్ వంటి వేదికలలో నిరంతరాయంగా సదస్సుల, కార్యశాలల రూపంలో విజ్ఞానస్రవంతి సాగుతూనే ఉంది. ఈ మాధ్యమాల్లో వెల్లివిరిసే విజ్ఞానంలో భాగస్వాములు కావడానికి ప్రత్యేక అర్హతలేమీ అవసరం లేదు. సాహిత్యాసక్తి కలిగివుంటే చాలు. ఆయా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, సాహితీ సంస్థలు, వ్యక్తిగత కార్యక్రమాల నిర్వాహకులు ఇచ్చిన లింకు మీద ఒక్క మీట నొక్కడంతో నేరుగా ఆ కార్యక్రమంలోకి చేరి వీక్షించవచ్చు.

అప్పటివరకూ దిన, పక్ష, మాస పత్రికలలో వచ్చే సాహిత్య పుటల్ని, ఆదివారపు అనుబంధ సంచికలోని కథలను, వ్యాసాలను చదువుతూ ఉన్న పాఠకులు కరోనా మహమ్మారి వల్ల కొంతకాలం పత్రికలు స్తంభించిపోయినప్పుడు వెబ్-పత్రికలు చదవడం మొదలు పెట్టారు. కాలంతోపాటు వచ్చిన మార్పును గ్రహించి పత్రికా యాజమాన్యాలు కూడా పత్రికలను క్రమంగా ఇంటర్నెట్ ద్వారా ప్రజలకి చేరువ చేశాయి.

దిన, పక్ష, మాస పత్రికల్లో ప్రచురితమైతేనే గౌరవంగా భావించే కాలం నుంచి తన స్వీయ బ్లాగ్‌లోనో, ఫేస్‌బుక్‌లోనో, లేక వెబ్ మేగజైన్స్ లోనో రాసుకునే వెసులుబాటు రావడంవల్ల రచయితల సంఖ్య గణనీయంగా పెరిగింది. తద్వారా చర్చలు, సదస్సులు, ఆవిష్కరణలు కూడా ఎక్కువయ్యాయి. ముఖ్యంగా ఎక్కువమంది కవులకు, రచయితలకు చేరువగా ఉన్న మాధ్యమం ఫేస్‌బుక్. ఈమధ్య కాలంలో, ముఖ్యంగా తెలుగులో, మిగిలిన సాంకేతిక మాధ్యమాల కన్నా ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా చర్చలు, సమీక్షలు, విశ్లేషణలు, విమర్శలు విరివిగా జరుగుతున్నాయి.

ఇదివరకు కవులు, రచయితలు తమ భావాలను, ఆలోచనలను, సిద్ధాంతాలను, సూత్రాలను పుస్తక రూపంలో ముద్రించి తీసుకు రావడానికి సంవత్సరాలపాటు సమయం పట్టేది. సాంకేతిక మాధ్యమాల వాడకం నేడు విస్తృతం అవ్వడం వల్ల కవి, రచయిత తన ఆలోచనని వెంటనే ఫేస్‌బుక్, వాట్సాప్ మొదలైన మాధ్యమాల ద్వారా పాఠకలోకంతో వెంటనే పంచుకునే సౌలభ్యాన్ని ఈ మాధ్యమాలు రచయితలకి కల్పించాయి. ఎక్కడెక్కడో తెలుగు భాష కాని ప్రాంతాల్లో ఉండే తెలుగు పాఠకులు సైతం ఫేస్‌బుక్ ద్వారా తెలుగు రచనలు ప్రచురితమైన వెంటనే చదవగలుగుతున్నారు.

గతంలో ఏదైనా పుస్తకావిష్కరణ పెట్టుకొని పుస్తక సమీక్ష చేసే సదస్సుల్లో ముప్పై నుండి యాభైమంది పాల్గొనడం చాలా కష్టంగా ఉండేది. ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫేస్‌బుక్ లైవ్ కార్యక్రమంలో వంద నుండి రెండు వందల వరకు పాఠకులు చేరుతున్నారు. దానికి కారణం వ్యక్తులు భౌతికంగా ఎక్కడ ఉన్నాసరే తమ దగ్గర ఉన్న సెల్‌ఫోన్, ఐపాడ్, ల్యాప్‌టాప్, కంప్యూటర్ మొదలైన ఉపకరణాలతో కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉండటం.

> **గతంలో ఏదైనా పుస్తకావిష్కరణ పెట్టుకొని పుస్తక సమీక్ష చేసే సదస్సుల్లో ముప్పై నుండి యాభైమంది పాల్గొనడం చాలా కష్టంగా ఉండేది. ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది.**



అలాగే కొందరు సాహితీవేత్తలు నిర్వాహకులు వారంవారం ఒక ప్రముఖ కవి గురించో, రచయిత గురించో, కథల గురించో, విమర్శ గురించో లేదా ఒక వాద సాహిత్యం గురించో ఆయా రంగాల్లో కృషి చేసిన నిష్ణాతులైన వక్తల చేత ఫేస్‌బుక్‌లో ఉపన్యాసాలను ఇప్పిస్తున్నారు. అలాంటి పనిని చేబూనిన నిర్వహణ కమిటీలు కొన్ని ఉదాహరణకు: బహుజన కథా ఊట (పసునూరి రవీందర్, సంగిశెట్టి శ్రీనివాస్, చందు తులసి, జి. వెంకటకృష్ణ, మల్లిపురం జగదీశ్), సంతకం కవిత్వ పరామర్శ (ఎం.ఎం. వినోదిని), తెలంగాణ స్వేరో సర్కిల్ (పసునూరి రవీందర్), హర్యాలీ ముస్లిం వాద సాహిత్యం (స్కైబాబా, షాజహానా), హృదయగానం (కవి సమ్మేళనం), సాహితీ సౌరభం (మంచికంటి, శ్రీరామ్ పుప్పాల, శ్రీనివాసగౌడ్), రాయలసీమ సాహిత్య సభ (రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, బండి నారాయణస్వామి, జి. వెంకటకృష్ణ, దాదాహయాత్, చిలుకూరి దీవెన, సడ్లపల్లి చిదంబరరెడ్డి), రాయలసీమ సామాజిక - సాంస్కృతిక ఉపన్యాసాలు (అప్పిరెడ్డి హరినాథరెడ్డి), కథా మానసీయం (మానస ఎండ్లూరి) మొదలైనవి పేర్కొనవచ్చు. ఈ కార్యక్రమాల్ని వీక్షించే శ్రోతలు మూడు రకాలుగా కనిపిస్తారు. ఆసక్తితో విని కొత్త విషయాలను తెలుసుకోవాలనే శ్రోతలు మొదటి రకంవారు. అదేవిధంగా నిర్వాహకుల దృష్టిలో తాను కూడా కార్యక్రమంలో పాలుపంచుకున్నాను అని తెలియడంకోసం కార్యక్రమానికి హాజరయ్యే వ్యక్తులు రెండవ కోవకు చెందినవారు. మాట్లాడే వక్తను బట్టి కార్యక్రమానికి వచ్చే శ్రోతలు కూడా లేకపోలేదు. వీరు మూడవ విభాగానికి చెందినవారు. ఇలా ఫేస్‌బుక్ సాహిత్య విజ్ఞానం ఆయా రీతుల్లో శ్రోతలకి చేరుతుంది.

ఫేస్‌బుక్ ఉపన్యాసాలన్నీ ఒక ఎత్తు అయితే, ఫేస్ బుక్ సాహిత్య రాతలు మరో ఎత్తు. సాహిత్యంలో వస్తున్న కొత్త పోకడలను, ధోరణులను ఎప్పటికప్పుడు రచయితలు గమనిస్తూ ఫేస్‌బుక్ వేదికగా కవితలు, కథలూ, కొందరైతే నవలలూ విస్తృతంగా రాస్తున్నారు. అంతేగాక కొన్ని సమూహాలు ప్రత్యేకంగా శీర్షికలు నిర్వహించి ఆయా సాహిత్య ప్రక్రియల్లో కృషి చేసిన వారిచేత వారం వారం వాటిని నడిపిస్తున్నాయి. ఇలాంటి విశిష్టమైన పనిని కొందరు ఎవరికివారు చేస్తున్నారు, సమూహాలుగా కూడా జరుగుతున్నాయి. సమూహాల విషయానికి వస్తే ఉదాహరణకు: కవిసంగమం, కవి సమ్మేళనం, స్నేహకళాసాహితి, తెలుగు కవులు, పుస్తక సమీక్ష, సాహిత్యం, విశ్వసాహితి సమితి, తెలంగాణ పదాలు, ప్రతిలిపి, మన తెలుగు సాహిత్యం, దేశభక్తి సాహిత్యం, తెలుగు సందేహాలు, సమీక్షా సాగరం, ప్రేమ కవితలు, మన కవిత్వం, కవి సాయంత్రం, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, కవితా కథ సాధన, ఆంధ్ర సారస్వత పరిషత్, కొలిమి, సాహితీసేవ, వసంతమేఘం, కవిసంధ్య మొదలైన సమూహాలతో పాటు వేల సంఖ్యలో కథలకి, నవలలకి, విమర్శకి, సాహితీ విషయాలకు సంబంధించిన సమూహాలు ఫేస్‌బుక్‌లో ఉన్నాయి.

శ్రోతల్లో మూడు తరగతులకి చెందినవారు ఉన్నట్లుగానే పాఠకుల్లో కూడా మూడు విభాగాలు కనిపిస్తారు. ఫేస్‌బుక్ సమూహంలో వచ్చిన పోస్ట్‌ను క్షుణ్ణంగా చదివి కొత్త విషయాలను గ్రహించాలనే ఆరాటపడే పాఠకులు ఒకరకమైతే, గ్రూప్ నిర్వాహకుల దృష్టిలో పడాలని పోస్ట్ కింద లైక్, కామెంట్, షేర్ చేసేవారు ఇంకొందరు. మరికొందరు పాఠకులు శీర్షిక రాసే రచయితను బట్టి చదువుతారు.

ఫేస్‌బుక్ వల్ల పాఠకుల, శ్రోతల సంఖ్య తప్పకుండా పెరిగిందన్నది నిర్వివాదాంశం. కానీ ఆ పాఠకులు ఏ వర్గం నుంచి పెరిగారు అని పరిశీలించి చూస్తే, ఎగువ తరగతి ప్రజలే ఎక్కువగా ఇంటర్నెట్ వాడుతున్నారు. కొంతలో కొంత మధ్య తరగతివారిలో కూడా పాఠకులు, శ్రోతలు ఇంటర్నెట్ వాడకంలో ముందడుగు వేసారు. రోజువారి సంపాదనతో జీవనం సాగించే వారు కాని, పరిమితమైన సంపద కలిగిన వర్గాలవారుకాని ఇంటర్నెట్‌లో ఇంకా పాఠకులుగా మారలేదు. కారణం వీరికి ఇంటర్నెట్ అందుబాటులో లేదు. అందువల్ల బీదవారిలో ఇంటర్నెట్ పాఠకులు ఎవరూ పెరగలేదనే చెప్పుకోవచ్చు. అలాగే కవి, రచయిత ఫేస్‌బుక్ మాధ్యమంలో పోస్ట్ చేసిన రాతల్ని, లేదా చెప్పే విషయాన్ని ఓపికగా చదివి, విని చర్చ చేసే వాతావరణం కొంతమందిలో లేకపోవడం కనిపిస్తుంది. దానివల్ల భావోద్వేగాలు రగిలి చర్చ పక్కదారిపట్టే సందర్భాలు ఎక్కువే ఉంటున్నాయి.

ఏదిఏమైనప్పటికీ ఇప్పటి వరకు తెలుగు సాహిత్య విస్తరణలో ఫేస్‌బుక్ గణనీయమైన పాత్ర వహించిందని కచ్చితంగా చెప్పుకోవాల్సిందే. ఇక మీదట కూడా ఈ మాధ్యమం ద్వారా ఇంకా సాహిత్య విస్తరణ జరగాల్సి ఉంది.

సారిపల్లి నాగరాజు
80083 70326

చీకట్లో
నిశ్శబ్దంగా
నగ్నంగా
కలసి నృత్యం చేస్తున్నాయి కన్నీళ్ళు
చీకటికి మాత్రమే వాటి దేహాల స్పర్శ తెలుసు
తనలో కలిసే అనేక నీడల తడి తెలుసు

నీడలు
జ్ఞాపకాలు మోసే నావలు
దేహసముద్రం దాటి ఎగిరి వెళ్లే నల్లటి కొంగలు



ప్రతి నీడకీ ఒక గతం ఉంది
ప్రతి నీడకి ఆ గతం తాలుకు గాయాల
రక్తస్పర్శ ఉంది

నీడలు
చీకట్లో మాత్రమే కళ్ళు తెరిచి
పాటలు పాడతాయి,
యే నీడ పాట దానికే సొంతం
అచ్చం కన్నీళ్లకు సజాతీయత లేనట్లే

ప్రతి నీడకు
చీకటి లోతెంతో తెలుసు
చీకటి నివసించే రహస్య స్థావరం తెలుసు
అమ్మ కడుపులోని చీకటే భద్రంగా ఉంటుందని
రోజుల పసిగుడ్డు ఏడుపు

నీడలు
సంకెళ్ల విప్పి
రహస్యాలను ప్రకృతికి అప్పగిస్తున్నప్పుడు
వాటినీ అసలు చూడకు
నిప్పురవ్వల్లా తమని కాల్చుకుని
కాలంపాటలో బూడిదలా కలసిపోతాయి

కొంచం చెవిపెట్టిశ్రద్ధగా విను
నీడలు పునరుత్థానం చెందేప్పుడు
ప్రసవిస్తున్న తల్లి ఏడుపులా ఉంటాయి
రహస్యాలు నేసే చేతివేళ్లలా
కొత్త కథల కోసం ఎదురుచూసే
విశాల బాహువుల్లా ఉంటాయి
నీ కంటి చూపు స్థావరంలో నల్లగా తొణికిసలాడే
కాటుక దేహపు ఛాయలా ఉంటాయి.

మెర్సీ మార్గరెట్

మట్టిముత్యాల హారం 'దండకడియం'



ఒక మనిషి మరో మనిషితో మాట్లడుతున్నట్టు, మనసులోని ఆర్తిని అలవోకమైన పదాలతో వెల్లబోసుకొని బరువు దించుకున్నట్టు ఉంటుంది గోపాల్ కవిత్వం. 'సమాజం పరిణామ శీలమైనది ఒకే కోణంలో చూడరాదు, దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది' అంటారు. గోపాల్ దృష్టి అనుభవపూర్వమైనది, అతను జీవితానుభవాలను సాహిత్య పేటీగా మలచుకున్నాడు. తను చూసిన అనేక అంశాలను, అనుభవాలను, వాటిలోని వైరుధ్యాలను కవిత్వ వస్తువుగా తీసుకొని మట్టి పరిమళాలను అద్ది 'దండ కడియం' చేశాడు తగుళ్ళ గోపాల్.

గోపాల్ కవిత్వపు బలం పల్లీయతనంలో ఉంది. మానవ సంబంధాల మీద ఉంది. బహుజన కవిత్వపు ఊట ఈ కవిత్వంలో ఉంది. 'నాన్న గొడ్డలి' కవితలో కట్టెలు కొట్టుకునే బహుజన తండ్రి కనిపిస్తాడు, అతని గొడ్డలి కనిపిస్తుంది:

"మా ఇంట్లోని పేదరికాన్నంతా
కొంచెం కొంచెంగా నరుక్కుంటూ వచ్చింది
బాల్యంలో నాల్గు అక్షరాలను తిన్నానంటే
మా నాయనకిది నాయనలాగ
తోడు నడవడం వల్లనే"

- పేదరికంలో వృత్తిని నమ్ముకొని శ్రమైక సౌందర్యంలో జీవితాన్ని నెట్టుకొచ్చే విధానాన్ని అక్షరబద్ధం చేశాడు కవి. గోపాల్ కవిత్వాన్ని భావుకత నిలబెడుతుంది. సరళంగా చెప్పనే చివర ముగింపులో ఆ విషయాన్ని బలంగా చెప్పడం కనిపిస్తుంది.

"చీకటిని మేస్తున్న
చుక్కల మందను కాసేటందుకు
ఎల్లిపోయినవంట"

- ఇన్ని రోజులు గొర్లను కాసే తాత చివరకు చుక్కల మందను కాసేందుకు వెళ్ళిపోవడం, చుక్కలు చీకటిని మేయడం ఎంత చక్కని ఊహ! ఒకచోట ఎంతో భావుకతతో అమ్మను పచ్చనాకుల జమ్మికొమ్మతో పోలుస్తాడు. 'దండకడియం'లోని భావుకత ఎలాంటిదో ఈ కింది వాక్యాలలో స్పష్టంగా కనిపిస్తుంది.

"పొద్దు పొద్దున్నే
తామర మొగ్గలను సిగలో ముడుచుకున్న
చెరువమ్మ ముఖం చూసినంకనే
సూరీడు ఏడు గుర్రాల బండికడుతాడు."

'లేనిచోట' అనే కవితలో నాయనమ్మ చనిపోవటమే మంచిది అంటాడు. ఎందుకు మంచిదైతది? చూడండి:

"సీరియళ్ళ సోకులో పడి
పొయ్యి మీద పొంగుతున్న పాలలాగే
నిన్ను కూడా నేల పాలు చేయకముందే
సూర్యచంద్రులకు పాలియ్యడానికి
సర్ర సర్ర నడిచి పోవడమే మంచిదైంది."

సూర్యచంద్రులకు పాలియ్యడానికి! ఎంత చక్కని ఆర్ద్రతను, ఆవేశాన్ని, నాయనమ్మ పోయిన దుఃఖపు చుక్కలను ఈ అక్షరాలలో అద్దాడు! ఎంత చక్కని ఊహాత్మకంగా ఉందో, అందులోనే ఎంత ఆవేదన ఉందో, అసలు ఎంత చక్కని పదాల పొందిక కనిపిస్తుందో చూడండి. ముసలివాళ్ళు మన బ్రతుకులకు మూలవాసాలు. వారు లేకుంటే మనం లేం. కానీ ప్రపంచీకరణ నేపథ్యంలో ఎవరికివారే యమునా తీరే. ఎవరి గురించి ఎవరికీ ఆలోచించే తీరిక లేదు. అలాంటి పరిస్థితులలో నాయనమ్మను ఎవరు పట్టించుకుంటారు.

> **"ఈ ఊపిరి తాడు/ తొందరగా తెగిపోకుండా ఉండటానికి/ ఈ నడక/ ఇలా మధ్యలోనే ఆగిపోకుండా ఉండటానికి/ కొన్ని ప్రేమలు, కొంత పరిమళం కావాలి." తగుళ్ళ గోపాల్ కవిత్వ అంతరార్థం అంత ఇదే. తను కోరుకునేది ఇదే.**



ఒక కవితలో గుండె లోతుల్లో పదిల పరుచుకున్న నాన్న జ్ఞాపకాల గంపను దించుకుంటాడు. ఎదలకు అయిన మానని గాయాన్ని తలచుకొని కంటిలోని నీళ్ళతో తన గుండెలను తడుపుకుంటాడు:

"నాన్నా...
నువ్వు గుర్తొచ్చినప్పుడల్లా....
కళ్ళు మూసుకొని
నిన్ను నా కన్నుల నిండా నింపుకుంటాను
కన్నీళ్ళొస్తున్నా ఇష్టంగా తల్చుకుంటూ
వాన వెలిసిన తరువాత
తడిసిన తంగేడు మొక్కనవుతాను."

ఇలా గాయాలకు ప్రకృతి మలాము పూసుకుంటూ తనకు తానుగా మిగిలిపోతాడు.

"పది మందిల తిరిగినప్పుడు
గొల్ల పెద్దయ్య మనువడిని అని చెప్పుకోవడమంటే
నీ దండని ముద్దాడిన దండకడియాన్ని
ముద్దుపెట్టుకున్నట్టే ఉంటది"

- ఇది బహుజనుల కవిత. నాటి సంస్కృతిని అద్దం పట్టే కవిత. తాతకు వారసుడు అంటే మనవడే కదా! నేను పెద్ద గొల్ల మనువడిని అని చెప్పుకోవడం అంటే నీ దండ కడియాన్ని ముద్దుపెట్టుకోవడమే అంటాడు. తెలంగాణతనం ప్రతిబింబించే శైలి, నిర్మాణం ఉంది ఈ కవితలో.

కవిత్వం అంటే తనివితీరా అనుభవించడం. అందుకే గోపాల్ అనుభవైక జీవన కవి. లోకానుభవమే తన కవిత్వపు పట్టుగొమ్మ. చక్కని పదచిత్రాలు వేస్తాడు. అవి కళ్ళముందు కదలాడుతున్నట్లుగా ఉంటాయి.

"కమ్మలు కుడువ బెట్టి
నా నాల్కమీద అక్షరాన్ని గీసిన
మా అమ్మ ఒక సుక్కల ముగ్గు
మట్టి పూత పూసిన గోడల మీద
నిండుగ నవ్వే సున్నపు ధార"

- నాటి స్త్రీ జీవన విధానం, బండెడు చాకిరి చేస్తూ అలసిపోని ఆనాటి స్త్రీల నిత్య దైనందిన జీవనాన్ని ఈ పంక్తుల్లో ఎంతో సున్నితంగా చూపించాడు.


"ఈ ఊపిరి తాడు
తొందరగా తెగిపోకుండా ఉండటానికి
ఈ నడక
ఇలా మధ్యలోనే ఆగిపోకుండా ఉండటానికి
కొన్ని ప్రేమలు, కొంత పరిమళం కావాలి."

గోపాల్ కవిత్వ అంతరార్థం అంత ఇదే. తను కోరుకునేది ఇదే.

గోపాల్ కవిత్వంలో గ్రామీణ జీవన సంస్కృతి, మానవ సంబంధాలు, స్త్రీల ఆచార వ్యవహారాలను అక్షరబద్ధం చేశాడు. 'దండ కడియం' అంతా గోపాల్ ఆత్మకథలా కనిపిస్తుంది. కవి తన జీవితానికి ఆసరాగా నిలచిన వారిని ఎవ్వరినీ మరచిపోలేదు. "కవిత్వం అంటే అన్నం పెట్టదు నాయనా నిజమే కాని నన్ను బ్రతికిస్తుంది. అమ్మ," అంటాడు 'ఏడంత్రాల మల్లె' కవితలో. అవును, కవిత్వం గోపాల్‌ని బ్రతికిస్తుంది. ఆ బ్రతుకు నేపథ్యం అంతా 'దండ కడియం'లో కనిపిస్తుంది.

పెద్దోజు నరేష్





నాని కోవర్టులపై వేటు షురూ!

- నందిగామలో ఇద్దరిపై సౌమ్య ఫిర్యాదు
- విజయవాడ పశ్చిమలో మరో ఇద్దరిపై నాయకుల ఫిర్యాదు
- త్వరలోనే మరింత మందిపై వేటు?

- 6లో..



కేయూలో అయ్యోర్ల తిరుగుబాటు

పీహెచ్‌డీ పట్టాల పంపిణీలో తీవ్రజాప్యం

- అమిత మరణానికి ఇదే కారణమని ఆగ్రహం
- అధికారుల నిలదీత
- విచారణ చేస్తామన్న వీసీ జ్ఞానమణి

- 6లో..

ప్రాణాలు మింగినది

కృష్ణానదిలో మునిగి ముగ్గురి దుర్మరణం

- మృతులు పటమటకు చెందిన విద్యార్థులు
- ఫొటో షూట్‌కు వెళ్లి జలసమాధి

ఆ నలుగురు మంచి స్నేహితులు. ఎప్పుడూ కలిసే ఉంటారు. ఆదివారం సెలవు కావడంతో ఫొటోషూట్ చేసుకుందా మనుకున్నారు. ఎంతో ఆనందంగా ఇళ్ల నుంచి బయలుదేరారు. కృష్ణానది వైపు పరుగులు తీశారు. యనమలకుదురు సమీపంలో ఉన్న కృష్ణానది పాయలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. వీరు పటమటకు చెందినవారు. ఆ కుటుంబాల్లో అంతులేని విషాదం నెలకొంది. వారితోపాటు వెళ్లిన మరో విద్యార్థి నదిలోకి దిగకపోవడంతో మృత్యుంజయుడు అయ్యాడు. అతను పెనమలూరు మండలం సనత్‌నగర్‌కు చెందినవాడు.


ప్రశాంత్ (ఫైల్)

విజయవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పటమట హైస్కూల్ రోడ్డుకు చెందిన నవపల్లి నాగసాయి కార్తికేయ (13), కత్తి ప్రశాంత్ (13), సనత్‌నగర్‌కు చెందిన పాఠక్ హైస్కూల్ రోడ్డులో ఉన్న నారాయణ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. కామన్ ఫ్రెండ్స్ ద్వారా వారికి ఎన్టీఆర్ సర్కిల్‌కు చెందిన గగన్ (16) పరిచయమయ్యారు. అతడు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. కొన్నాళ్లుగా ఈ నలుగురు మంచి స్నేహితులు. ఎక్కడికి వెళ్లినా కలిసే ఉంటారు. వారిలో కార్తికేయ తల్లి వసుంధర నారాయణ హైస్కూల్‌కు వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రశాంత్ తండ్రి శేఖర్ ఒంగోలులో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గగన్ తండ్రి హైదరాబాద్‌లో ఇన్వెర్టర్ల కంపెనీలో ఉద్యోగి. గగన్ తల్లి, నాయనమ్మలతో కలిసి యనమలకుదురు పుట్టరోడ్డులో ఉంటున్నాడు. ఆదివారం సెలవురోజు కావడంతో ఫొటోషూట్ చేసుకోవాలనుకున్నారు. అంతా కలిసి

- మిగతా 6లో

కోట్లలో.. దుర్గగుడి షాపుల అద్దె బకాయిలు!

- దేవస్థానం అధికారుల ఉదాసీన వైఖరి
- చెల్లింపులకు వాయిదాలతో సరి..

- 6లో..

టీడీపీ నేత రంగబాబుపై దాడి కేసులో పురోగతి!

- 6లో..

సబ్ కలెక్టర్ అదితి సింగ్ బదిలీ

- తిరుపతి మునిసిపల్ కమిషనర్‌గా పోస్టింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ

టీడీపీతో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం

» జయహో బీసీ సదస్సులో కొనకళ్ల, మండలి

మోపిదేవి, జనవరి 28 : రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురానున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ ఉపసభాపతి మండలిబుద్ధప్రసాద్‌లు స్పష్టం చేశారు. ఆదివారం మోపిదేవిలోని డాక్టర్ మండవసాయి ప్రాంగణంలో జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బీసీలపై అక్రమ కేసులు బనాయించి దాడులు చేశారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీ ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ప్రతీ సామాజికవర్గానికి కార్పొరేషన్లు ఏర్పాటుచేసి వేలాది కోట్ల రూపాయల నిధులు ఇచ్చారని తెలిపారు. పేరుకు అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కనీసం కూర్చునేందుకు కుర్చీ కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితి వైసీపీ పాలనలో దాపురించిందన్నారు. రాష్ట్రంలో పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం అని సీఎం సభల్లో చెప్పుకోవటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేక విధానాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, బీసీసెల్ నాయకులు బత్తిన దాసు, కందుల బసవయ్య, మురాల సుబ్బారావు, బళ్లా సీతారామప్రసాద్ తదితరులున్నారు.

చంద్రబాబుతోనే పూర్వ వైభవం : బుచ్చి రాంప్రసాద్



మాట్లాడుతున్న బుచ్చిరాంప్రసాద్

మచిలీపట్నం టౌన్, జనవరి 28 : వైసీపీ పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యమైందని, మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తే కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తీసుకుని వస్తామని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చిరాం ప్రసాద్ అన్నారు. ఆదివారం మచిలీపట్నం సిడింబి అగ్రహారంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైందని పేద బ్రాహ్మణులు భిక్షాటన చేసే పరిస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించారని, బ్రాహ్మణ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. బ్రాహ్మణులందరూ హక్కుల కోసం సంఘటితం కావాలన్నారు. బ్రాహ్మణుల ఉసురు పోసుకున్న వారు ఎవరూ బాగుపడలేదన్నారు. మచిలీపట్నంలో బ్రాహ్మణ జాతి ముద్దుబిడ్డ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని అడ్డుపడుతున్నారన్నారు. బ్రాహ్మణులందరూ చంద్రబాబు నాయకత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకుని వచ్చేందుకు కృషి చేయాలన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ సాధికార సంస్థ జిల్లా కన్వీనర్ పీవీ ఫణి కుమార్, మోపర్తి సుబ్రహ్మణ్యం, పిఎస్ఎస్ఆర్ శర్మ తదితరులు మాట్లాడారు.

జగన్‌రెడ్డి దురాగతాలకు ప్రజా కోర్టులో శిక్ష పడేరోజు దగ్గర్లోనే.. : నెట్టెం



విద్యాధరపురం, జనవరి 28 : జగన్‌రెడ్డి దురాగతాలకు ప్రజా కోర్టులో శిక్ష పడేరోజు దగ్గరలోనే ఉందని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్‌రెడ్డికి కౌంట్ డౌన్ మొదలైందని తెలిపారు. ఇప్పటి వరకూ ప్రజల్లోకి రాని జగన్‌రెడ్డి ఎన్నికల వస్తున్నాయనగానే 'సిద్ధం' పేరిట బహిరంగ సభలు నిర్వహిస్తున్నాడన్నారు. అయితే జగన్‌ను ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. జగన్‌రెడ్డి అహంకారానికి, వైసీపీ పాలనకు బుద్ధి చెప్పేందుకు రైతులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరం వైసీపీ కనుమరుగవుతుందన్నారు. ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో టీడీపీ, జనసేనల విజయం తథ్యమని, జగన్ నుంచి రాష్ట్రాన్ని కాపాడే బాధ్యత యువతదేనని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగన్‌రెడ్డి చేసిన అరాచకాలను ఉదహరించి ప్రజా కోర్టులో అతడికి శిక్ష పడేరోజు దగ్గర్లోనే ఉందని పేర్కొన్నారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న టీడీపీ నేతలు

చంద్రబాబుకు దైవానుగ్రహం

» ముగిసిన మహా చండీయాగం.. పాల్గొన్న మాజీ మంత్రులు

మచిలీపట్నం టౌన్, జనవరి 28 : దైవానుగ్రహంతో చంద్రబాబు సునాయాసంగా అధికారంలోకి వస్తారని పలువురు వేదపండితులు పేర్కొన్నారు. మచిలీపట్నం నాగపోతరావు సెంటర్‌లో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతుల ఆధ్వర్యంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న మహా చండీయాగం ఆదివారం ముగిసింది. బాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుడివాడ ప్రణవానంద ఆశ్రమ స్థైర్యానంద సరస్వతీ స్వామి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ మహా చండీయాగంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, పామర్రు టీడీపీ నాయకులు వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్‌తో పాటు తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం అద్భుత కళాఖండం

» రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

కృష్ణలంక, జనవరి 28 : దేశ ప్రజలు గర్వించేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనాన్ని ఆవిష్కరించారని, ఇది ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన అంబేడ్కర్ విగ్రహాన్ని, స్మృతివనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రూ.2 వేలకోట్ల విలువ చేసే స్థలంలో రూ.400 కోట్లు ఖర్చుచేసి సామాజిక న్యాయ మహాశిల్పాన్ని, స్మృతివనాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఇదొక అద్భుత కళాఖండమని, రోజూ వేలాదిమంది వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత తారతమ్యం లేకుండా ప్రజలు తరలివస్తున్నారన్నారు. అనంతరం బౌద్ధ సన్యాసులతో కలిసి ప్రబుద్ధ భారత్ నిర్మాణం క్యాలెండర్లను, పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పుస్తకాలను అందజేశారు.



బౌద్ధ సన్యాసులతో కలిసి ప్రబుద్ధ భారత్ నిర్మాణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విక్టర్ ప్రసాద్

కేయూలో అయ్యోర్ల తిరుగుబాటు

కృష్ణా యూనివర్సిటీలో పనిచేసే ప్రొఫెసర్లు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేయడంలో జరిగిన జాప్యం కారణంగా ఒక విద్యార్థి బలవన్మరణం చెందడమే ఇందుకు కారణం. ఐదుగురు విద్యార్థులు పరిశోధనలు చేసి పత్రాలు సమర్పించినా ఏ కారణంతో సకాలంలో పీహెచ్‌డీ పట్టాలు ఇవ్వడం లేదని ప్రొఫెసర్లు యూనివర్సిటీ వీసీని, రిజిస్ట్రారును శనివారం నిలదీశారు.

» పీహెచ్‌డీ పట్టాల పంపిణీలో తీవ్రజాప్యం
» అమిత మరణానికి ఇదే కారణమని ఆగ్రహం
» అధికారుల నిలదీత
» విచారణ చేస్తామన్న వీసీ జ్ఞానమణి



కృష్ణా యూనివర్సిటీ

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

భీమవరానికి చెందిన పి.అమిత భీమవరంలోని ఒక కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. కృష్ణా యూనివర్సిటీలో కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. దీనికి సంబంధించి పరిశోధనా పత్రాలను 2022 నవంబరు 14వ తేదీన ఆమె సమర్పించారు. పీహెచ్‌డీ చేసినందుకుగాను యూనివర్సిటీకి రూ.1.49 లక్షలు ఫీజుగా యూనివర్సిటీకి చెల్లించారు. పరిశోధనా పత్రాలను సమర్పించి 14 నెలలు కావస్తున్నా ఆమెకు పీహెచ్‌డీని ప్రధానం చేయలేదు. దీంతో ఏడాదికాలంలో ఆమె మూడు విడతలుగా పరిశోధనా పత్రాలను సమర్పించి, తనకు పట్టాను అందజేయాలని యూనివర్సిటీ అధికారులను కోరుతూ వచ్చారు. అయినా యూనివర్సిటీ రీసెర్చ్ విభాగం అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకుండా పక్కన పెట్టేశారు.

ఉద్యోగం పోవడంతో బలవన్మరణం?

పీహెచ్‌డీ పట్టా తెచ్చుకోవాలని, పట్టా వచ్చిన తరువాత మళ్లీ ఉద్యోగం ఇస్తామని చెప్పి భీమవరంలోని కళాశాల యాజమాన్యం అధ్యాపకురాలు అమితను మర్యాదపూర్వకంగానే ఉద్యోగంలో నుంచి తొలగించారు. పీహెచ్‌డీ పట్టా లేని కారణంగా ఉద్యోగం పోవడంతోపాటు, కుటుంబంలో ఇబ్బందులు తోడవడంతో ఆమె తీవ్ర మనస్థాపానికి గురై, గతేడాది నవంబరు నెలలో బలవన్మరణానికి పాల్పడ్డారు.

అధికారులను నిలదీసిన ప్రొఫెసర్లు

అమిత చనిపోవడానికి కారణాలపై ఆరా తీసిన ఎంబీఏ విభాగం అధ్యాపకులు ముకుమ్మడిగా శనివారం వీసీ, రిజిస్ట్రార్ వద్దకు వెళ్లారు. పీహెచ్‌డీ పట్టాను అందజేయడంలో జరిగిన తీవ్ర జాప్యం కారణంగానే అమిత ఉద్యోగం పోయిందని, దీంతో కుటుంబ సమస్యలు వెంటాడి బలవన్మరణానికి పాల్పడిందని యూనివర్సిటీ రెక్టార్ డి.సూర్యచంద్రరావు, ఎంబీఏ విభాగం హెచ్‌వోడీ సీహెచ్.జయచంద్రకుమార్, ఇతర అధ్యాపకులు వీసీ, రిజిస్ట్రార్‌లకు వివరించారు. అమిత 1405పీహెచ్101002 నెంబరుతో 2022 నవంబరు 14వ తేదీనే తన పరిశోధనా పత్రాలను సమర్పించినా ఇంత కాలంగా ఏ కారణంతో ఆమెకు పీహెచ్‌డీ ప్రధానం చేయలేదని నిలదీశారు. అమితతో పాటు సాక్షి వెంకటేష్, ఎం.రమ్యశ్రీ, కె.జ్యోత్స్నప్రియదర్శిని, వై.రఘు తమ పరిశోధనా పత్రాలను సమర్పించి నెలలు గడుస్తున్నా ఇంతవరకు వైవా పరీక్ష నిర్వహించలేదని, పట్టాలను ప్రధానం చేయలేదని వారు అన్నారు.

పరిశీలన చేస్తాం.. కమిటీ వేస్తాం

అమిత చనిపోయిన విషయం నా దృష్టికి వచ్చింది. ఆమెకు పీహెచ్‌డీ ప్రధానం చేయడంలో జరిగిన ఆలస్యంపై పరిశీలన చేస్తాం. ఆమె ఏ కారణంతో చనిపోయిందో తెలుసుకునే ప్రయత్నం చేస్తా. ఈ అంశంపై ప్రత్యేక కమిటీని వేసి విచారణ చేయిస్తాం. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- జి.జ్ఞానమణి, వైస్ చాన్సలర్, కృష్ణా యూనివర్సిటీ

కోట్లలో.. దుర్గగుడి షాపుల అద్దె బకాయిలు!

» దేవస్థానం అధికారుల ఉదాసీన వైఖరి
» చెల్లింపులకు వాయిదాలతో సరి..



కనకదుర్గా నగర్‌లో రోడ్డు వెంబడి దుకాణాలు

వన్‌టౌన్, జనవరి 28: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం స్థలంలో అద్దె ప్రాతిపదికన లీజులకు తీసుకుని షాపుల నడుపుతున్న నిర్వాహకులు సుమారు రూ.1.80 కోట్లకు పైగానే అద్దె బకాయిలున్నట్టు తెలుస్తోంది. అధికారుల ఉదాసీన వైఖరితోనే నిర్వాహకులు అద్దెను వాయిదాలు వేస్తున్నట్టు సమాచారం. దేవస్థానం వేలంపాటలో కనకదుర్గానగర్‌లో రెండేళ్ల క్రితం 24 షాపులకుగాను 21 షాపులు నిర్వాహకులు లీజుకు తీసుకున్నారు. ఒక్కో షాపునకు సుమారు నెలకు అద్దె రూ 90 వేలు, జీఎస్టీ మరో 16వేలు కలిపి మొత్తంగా రూ. 1.06 లక్షల మేరకు అద్దె ఖరారుతో వేలం పాడుకున్నారు. కొన్ని నెలలు సజావుగా అద్దె చెల్లించిన నిర్వాహకులు అనంతరం వాయిదాలు వేస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు బకాయిలు సుమారు రెండు కోటకు చేరినట్టు విశ్వసనీయ సమాచారం. అద్దె వసూళ్లలో దేవస్థానం అధికారులు ఉదాసీన వైఖరి చూపుతున్నట్టు తెలుస్తోంది. మహా మండపంలో ఐదు షాపులు ఉండగా, మూడు షాపుల నిర్వాహకులు మూడు నెలలుగా అద్దె చెల్లించట్టు తెలుస్తోంది. అధికారులు నోటీసులు ఇచ్చినా నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నట్టు సమాచారం. దీనిపై సంబంధిత షాపుల విభాగ పర్యవేక్షకుడు ఏఈవో సీసీ రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చామని, బకాయిల చెల్లింపులో నిర్వాహకులు స్పందించకపోతే ఈవో, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ల దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాలు



లెనిన్ శతవర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు తదితరులు

విజయవాడ కల్చరల్, జనవరి 28 : లెనిన్ శతవర్ధంతి కార్యక్రమాలు ఘనంగా ముగిసాయి. లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద ఆదివారం ఆట, పాట, మాటలతో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, విప్లవ పోరాట యోధుడు, సోషలిస్టు వ్యవస్థాపకుడు లెనిన్ వేసిన బాట ఎంతో ఘనమైందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, 1987వ సంవత్సరంలో రష్యా దేశ ఉపప్రధానితో పాటు ఆనాటి సీపీఐ నాయకులు చండ్ర రాజేశ్వరరావు సీపీఎం నాయకులు ఎం.ఎస్.నంబూద్రిపాద్ తదితరులు రష్యా నుంచి తెచ్చిన విగ్రహానికి చుక్కపల్లి పిచ్చయ్య అధ్యక్షతన నాడు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం లెనిన్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.హరిగోపాల్, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, సాహితీ విమర్శకులు కాత్యాయని విద్మహే, సీపీఎం నాయకులు సీహెచ్.బాబురావు, ప్రోగ్రెసివ్ ఫోరం అక్కినేని చంద్రరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం నగర కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర నాయుడు, ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ లక్ష్మయ్య, ప్రముఖ కళాపోషకులు గోళ్ల నారాయణరావు, వడ్లమూడి పద్మ, ప్రజానాట్యమండలి ప్రధానకార్యదర్శి అనిల్ పర్యవేక్షణలో ఆట, పాట, కార్యక్రమాన్ని నిర్వహించారు. అభ్యుదయ గేయాలకు నృత్య ప్రదర్శన ప్రజాసమస్యలపైన స్కిట్లు, ప్రజల సమస్యలపై ప్రజా నాట్యమండలి కళాకారులు తమ అభినయంతో విప్లవ గేయాలు ఆలపించారు.

షర్మిలను నమ్మి మోసపోయాం

» వైఎస్సార్ సీపీ తెలంగాణ నేతలు

ధర్నాచౌక్, జనవరి 28 : వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై అభిమానంతో ఆయన కుమార్తె షర్మిల పెట్టిన పార్టీలో చేరామని, ఆమె తన సొంత ప్రయోజనాల కోసం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి తమను తీవ్రంగా మోసం చేసిందని తెలంగాణకు చెందిన పలువురు నేతలు మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ కొడంగల్ ఇన్‌చార్జి తమ్మలి బాలరాజు, ఉమ్మడి వికరాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పి.సుధారాణి గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఏపీలో షర్మిల మాటలు విని తమలా ఎవరు మోస పోవద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో షర్మిల ఎక్కడ పోటీ చేసినా ఆమె ఓటమికి కృషి చేస్తామన్నారు.

ప్రాణాలు మింగినది!

(5వ పేజీ తరువాయి)

ఆటోలో యనమలకుదురు శివాలయం వద్ద ఉన్న పెట్రోలు బంకు పక్క నుంచి కృష్ణా నదిలోకి నడుచుకుంటూ వెళ్లారు. వారిలో షారూక్ మాత్రం ఫొటోలు దిగడానికి నీటిలోకి వెళ్లలేదు. కార్తికేయ, ప్రశాంత్, గగన్‌లు నది మధ్యలోకి వెళ్లి ఫొటోలు తీయించుకోవాలనుకున్నారు. ఇలా ఫొటోల కోసం దిగిన ముగ్గురు ఒక్కసారిగా నీటిలో మునిగిపోయారు. ఒడ్డున ఉన్న షారూక్ సమాచారంతో మత్స్యకారుల ద్వారా పోలీసులు మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు. సరదాగా ఫొటోషూట్ కోసం వెళ్లిన వారిలో ముగ్గురు విద్యార్థులు జలసమాధి కావడంతో ఆ కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. ఉన్నత విద్యావంతులను చేసి అత్యున్నత శిఖరాల్లో నిలబెట్టాలని భావించిన తల్లిదండ్రుల ఆశలు నీళ్లలో కలిసిపోయాయి. కుమారుల మృతదేహాలను చూసి నది వద్ద తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. గుండెలు పగిలేలా రోదించారు. చనిపోయిన ముగ్గురు విద్యార్థులు చదువులో టాప్‌లో ఉంటారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



కలెక్టరేట్‌లో జిల్లా అర్థగణాంకాధికారి కార్యాలయం, ఫెసిలిటేషన్ సెంటర్‌లను ప్రారంభించిన ఎంపీలు కనకమేడల రవీంద్ర కుమార్, కేశినేని నాని

జిల్లా అభివృద్ధికి పూర్తి సహకారం

» ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, కేశినేని నాని వెల్లడి

కృష్ణలంక, జనవరి 28 : ఎన్టీఆర్ జిల్లాలో అన్ని విధాలా అభివృద్ధికి అవసరమైన సహాయసహకారాలను అందిస్తామని రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, లోక్‌సభ సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఎంపీ నిధుల రూ.5 లక్షలతో ఆధునీకరించిన జిల్లా అర్థగణాంకాధికారి కార్యాలయం, ఎంపీ కేశినేని నాని ఎంపీ నిధులు రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన ఎంపీల్యాండ్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం కనకమేడల, కేశినేనిలు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ కనకమేడల మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి కార్యకలాపాలు, ఎంపీల్యాడ్స్‌కు సంబంధించి అర్థగణాంకాధికారి కార్యాలయం కీలకపాత్ర పోషిస్తోందని, ఈ కార్యాలయం క్రియాశీలకంగా వ్యవహరిస్తూ నిరాంటంకంగా కార్యకలాపాలు నిర్వర్తించేందుకు వీలుగా జిల్లా అర్థగణాంకాధికారి కార్యాలయం ఆధునీకరణకు అవసరమైన నిధులు అందించడం జరిగిందన్నారు. కలెక్టరేట్‌లో మరిన్ని అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలని ఎంపీ కనకమేడల సూచించారు. ఎంపీ కేశినేని శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ దిల్లీరావు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరిస్తూ జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని, క్షేత్రస్థాయిలో సమస్యలను క్షుణంగా అర్థం చేసుకొని ఆయా సమస్యల పరిష్కారానికి తమదైన శైలిలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తాగునీటి సమస్య వున్న ప్రాంతాల్లో దాదాపు 275 గ్రామాలకు మంచినీటి ట్యాంకుల ఏర్పాటుకు కలెక్టర్ చొరవే కారణమన్నారు. అందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో కలెక్టర్ చేసిన విజ్ఞప్తి మేరకు మంచి నీటి ట్యాంకులను ఎంపీ ల్యాండ్స్ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పార్టీలు, కులాలు, మతాలు, ఇలా దేనితో సంబంధం లేకుండా గ్రామాల నుంచి తీర్మానాలు తీసుకొని ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్, ఎంపీల్యాడ్స్ తదితర నిధులతో జిల్లా అభివృద్ధికి కలెక్టర్ చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సీపీఓ వై.శ్రీలత, పంచాయితీ రాజ్ ఎస్ఈ ఎ.వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో ఇంతియాజ్ పాషా, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సీహెచ్.దుర్గాప్రసాద్, స్టాటిస్టికల్ ఆఫీసర్ డీవీఆర్ ప్రసాద్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ సీహెచ్.సత్యనారాయణ, ఏడీ ఎం.లలితా దేవి, సీపీవో కార్యాలయ సిబ్బంది కె.సాంబశివరావు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాని కోవర్టులపై వేటు షురూ!

» నందిగామలో ఇద్దరిపై సౌమ్య ఫిర్యాదు
» విజయవాడ పశ్చిమలో మరో ఇద్దరిపై ..
» త్వరలోనే మరింత మందిపై వేటు?



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ ఎంపీ కేశినేని నాని టీడీపీని వీడి వైసీపీలో చేరిన నేపథ్యంలో ఆయన కోవర్టులుగా టీడీపీలో పనిచేస్తున్న వారిపై అధిష్ఠానం దృష్టి సారించింది. నందిగామ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని నాని కోవర్టులుగా ఉంటూ ఆయన పుట్టిన రోజు వేడుకలను నిర్వహించిన విజయవాడ పార్లమెంటు మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, చందాపురం పోలింగ్ బూత్ కన్వీనర్ హనుమంతరావును సస్పెండ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఇటీవల అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై టీడీపీ అధిష్ఠానం చర్యలు తీసుకుంది. అదే తరహాలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఇద్దరు నాయకులపై పశ్చిమ టీడీపీ నాయకులు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై నిగ్గు తేల్చాల్సిందిగా పార్టీ సీనియర్ నాయకుడు బుద్దా వెంకన్న, కేశినేని చిన్నిని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది.

విజయవాడ పశ్చిమలో పనిచేస్తున్న ఓ మైనారిటీ నాయకుడితోపాటు జిల్లా పార్టీ కార్యాలయంలో కీలకంగా ఉన్న ఓ నాయకుడు కేశినేని నానికి అనుకూలంగా పనిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ఈ మైనారిటీ నాయకుడు నిర్వహించిన ఓ సమావేశంలో బ్యానర్‌పై నాని ఫొటో ఉండటంపై స్థానిక టీడీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక జిల్లా పార్టీ కార్యాలయంలో కీలకంగా ఉండే నాయకుడి ఎదుగుదలకు నానియే కారణంగా చెబుతారు. ఈ కృతజ్ఞతతో ఆయన ఇప్పటికీ నాని సేవలో తరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వారు విజయవాడ పార్లమెంటులో చాలా మందే ఉన్నారని, ఎన్నికలలోపు వీరిని ప్రక్షాళన చేయకపోతే కష్టమని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

నోటిఫికేషన్ నాటికి కమిటీల ప్రక్షాళన

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని కీలక నేతలుగా ఉన్న బుద్దా వెంకన్న, నాగుల్ మీరా వంటి వారిని టార్గెట్ చేయాలన్న ఉద్దేశంతో టీడీపీలో ఉన్న సమయంలో కేశినేని నాని విజయవాడ పశ్చిమ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్నారు. సమన్వయకర్త హోదాలో పశ్చిమ నియోజకవర్గంలోని 22 డివిజన్లలో డివిజన్ కమిటీలను నియమించారు. ఈ కమిటీలన్నింటినీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి ప్రక్షాళన చేయాలని పార్టీ అధిష్ఠానం యోచిస్తోంది.



మంత్రి జోగికి ఫ్లెక్సీల బెడద!

కంకిపాడు : ఫ్లెక్సీల బెడద మంత్రి జోగి రమేశ్‌ను వెంటాడుతోంది. కంకిపాడులో జోగికి వ్యతిరేకంగా వారానికో ఫ్లెక్సీ వెలుస్తోంది. పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి జోగి రమేశ్‌ను వైసీపీ అధిష్టానం నియమించింది. నాటినుంచి జోగికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. కంకిపాడు గన్నవరం రోడ్డులో ఫ్లై ఓవర్‌పై ఆదివారం ఓ ఫ్లెక్సీ వెలిసింది. 'జోగి రమేశ్ అన్నా.. నీ మిత్రుడిగా, నీ కులస్తుడిగా కొన్ని సంవత్సరాలుగా నీతో కలిసి పయనిస్తున్నా.. నీ కుటుంబసభ్యుడిగా విశ్వాసంతో నా అభ్యర్థన.. మనకొద్దు ఈ పెనమలూరు.. కావాలి మన మైలవరం.. ఇట్లు నీ శ్రేయోభిలాషి అంటూ..' భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం కంకిపాడులో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఫ్లెక్సీని జోగి రమేశ్‌కు వ్యతిరేకంగానా.. అనుకూలంగా ఏర్పాటు చేశారా.. ఎవరు చేశారన్న దానిపై గ్రామంలో విస్తృత చర్చ జరుగుతోంది.

సబ్ కలెక్టర్ అదితి సింగ్ బదిలీ

» తిరుపతి మునిసిపల్ కమిషనర్‌గా పోస్టింగ్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సబ్ కలెక్టర్ అదితిసింగ్ బదిలీ అయ్యారు. ఆమెను తిరుపతి మునిసిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ సబ్ కలెక్టర్‌గా 2022వ సంవత్సరం అక్టోబరు నెలలో వచ్చిన అదితిసింగ్ ఏడాదిన్నర పాటు విధులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా విడివడిన నేపథ్యంలో, నూతన ఎన్టీఆర్ జిల్లాకు అదితిసింగ్‌ను ప్రభుత్వం సబ్ కలెక్టర్‌గా నియమించింది. సౌమ్యంగా ఉండే ఆమె విజయవాడలో కొత్తూరు తాడేపల్లిలో మైనింగ్ మాఫియాపై ఒత్తిళ్లు వచ్చినప్పటికీ నిర్భయంగా రిపోర్టును రాసి పంపారు. విద్యాసంబంధ వివాదాస్పద వ్యవహారాలలో లోతైన విచారణ నిర్వహించారు. బెంజిసర్కిల్ సర్వీసురోడ్ల విస్తరణకు సంబంధించి అపరిష్కృత అంశాన్ని ఆమె పరిష్కరించారు. సామాన్యులకు దగ్గరగా ఉంటూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేవారు. విజయవాడ సబ్‌కలెక్టర్‌గా ఇంకా ఎవరినీ ప్రభుత్వం నియమించలేదు.

టీడీపీ నేత రంగబాబుపై దాడి కేసులో పురోగతి!

గన్నవరం, జనవరి 28 : గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసన్నేని రంగబాబుపై దాడి ఘటనలో మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకోగా తాజాగా ముగ్గురిని తీసుకున్నట్టు ఎస్సై ఒకరు తెలిపారు. ఇటీవల 'పొలం కావాలి చూపించండి.. అంటూ పిలిచి టీడీపీ నేతను చితకబాదిన సంఘటన తెలిసిందే. దీనిపై గన్నవరం పోలీసులు దర్యాప్తు ప్రారంభించి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే నిందితులు హైదరాబాద్ నుంచి వచ్చినట్టు పోలీసులు గుర్తించి రెండు బృందాలుగా వెళ్లి విచారణకు ప్రయత్నించగా అక్కడి స్థానికులు, కుటుంబసభ్యులు అడ్డుకున్నట్టు తెలిసింది. హైదరాబాద్ పోలీసుల సహకారంతో శనివారం ఇద్దరిని అరెస్టు చేయగా తాజాగా మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. రంగబాబుపై దాడిని ఎవరు.. ఎందుకు చేయమన్నారని విచారించగా తమకేమీ తెలియదని, డబ్బులిస్తే కొట్టినట్టు వారు చెబుతున్నట్టు సమాచారం. రంగబాబుపై దాడిచేసిన వారిలో సీసీ ఫుటేజ్ ఆధారంగా ఆరుగురు ఉంటే పోలీసులు ఐదుగురేనని చెప్పటం పలు అనుమానాలకు తావిస్తోంది. నిందితులను త్వరలో మీడియా ముందు ఉంచుతామని ఎస్సై తెలిపారు.

నేటి నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

విజయవాడ కల్చరల్, జనవరి 28: సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సోమవారం నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ తెలిపారు. ఇంటెలిజెన్స్ డీజీపీ సీతారామాంజనేయులు కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు.

సినీ రచయిత బుర్రా సాయిమాధవ్‌కు సత్కారం

డాక్టర్ వేటూరి సుందరరామమూర్తి 89వ జయంతిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ రచయిత బుర్రా సాయిమాధవ్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తామని నిర్వాహకుడు జయంతి చక్రవర్తి పేర్కొన్నారు.



రజకులకు ఇస్త్రీ పెట్టెలు అందజేస్తున్న గద్దె రామ్మోహన్

ఎన్నికల తర్వాత
వైసీపీ కనుమరుగు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 28: "వైసీపీ దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్షపడే సమయం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొద లైంది. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల యుద్ధం మొదలైంది..టీడీపీ అం దుకు సిద్ధమైంది. ఎన్నికల్లో వైసీపీ బంగాళాఖాతంలో కలవడం ఖాయం. టీడీపీ గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యం. ఎన్నికల తర్వాత వైసీపీ జెండా కనుమరుగవుతుంది." అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆది వారం ఆరుగురు రజకులకు ఆయన ఇస్త్రీపెట్టెలను అందజేశాక మాట్లాడారు. జగన్ అహంకారానికి, వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రైతులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు అంతా సిద్ధమ య్యారన్నారు. పంట నష్టపోయిన రైతులు, ఉద్యోగాలు రాని యువత, దగాపడిన మహిళలు టీడీపీకి స్టార్ క్యాంపెయినర్లు అని గద్దె పేర్కొన్నారు. వేముల దుర్గారావు, చెన్నుపాటి గాంధీ, మొకర వెంకట రమణ, పలిశెట్టి అన్నారావు, బిప్పాడ నాగేశ్వరరావు, గద్దె రమేష్, అం బడిపూడి కాశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతస్థితికి



విద్యార్థులకు అభయ హ్యూమన్ సర్వీస్ సొసైటీ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 28: ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి చేరొచ్చని విద్యార్థులకు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. సత్యనారాయణపురంలో అభయ హ్యూమ న్ సర్వీస్ సొసైటీ (మానవ సేవా సంఘం) ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ విచ్చేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల చెక్కులను కలెక్టర్ అందజే శారు. సంస్థ అధ్యక్షుడు బడేటి ధర్మారావు, నంద్యాల కృష్ణమూర్తి, డాక్టర్ ఎన్.వి.హరికుమార్, డాక్టర్ గాజుల రమేష్, కె.వై.కొండలరావు, బొమ్మదేవర సుబ్బారావు, జగన్మోహనరావు, సీతయ్య, ఉప్పు రంగ ప్రసాద్, సింగలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సుప్రీం కోర్టు వజ్రోత్సవాల సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్‌లో వేడుక చేస్తున్న న్యాయవాదులు

పౌరహక్కుల పరిరక్షణలో
సుప్రీంకోర్టుది కీలకపాత్ర

వన్‌టౌన్, జనవరి 28: దేశంలో పౌరుల హక్కులను కాపాడ డంలో సుప్రీం కోర్టుది కీలక పాత్ర అని బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు వ జ్రోత్సవాల సందర్భంగా ఆదివారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. సుప్రీం కోర్టు 75వ వసంతంలోకి అడుగు పెట్టడం ఆనందదాయకమని న్యాయవాదులు పుప్పాల శ్రీనివాసరావు, కేబీ సుం దర్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు నివేదికలు, తీర్పులు 519 వాల్యూ ములు, 36,308 కేసుల్లో తీర్పులు డిజిటల్ ఫార్మాట్‌లో ఉచితంగా అం దుబాటులోకి రానున్నాయన్నారు. న్యాయవాదులు సోము కృష్ణమూర్తి, నరహరశెట్టి జ్యోతి, బత్తుల వెంకటేశ్వర్లు, ఆకుల పాండురంగ విఠల్, పగడాల ఆంజనేయులు, సుంకర కృష్ణమూర్తి చౌదరి, బత్తుల సాయి, వలిశెట్టి కిరణ్, సాయిరాం, రైసా, అరుణ, తగరం కిరణ్, మెట్టిగుంట గోపీకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలపై దాడులు

● బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం
● జయహో బీసీ సదస్సులో బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 28: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై దాడులు పెరిగిపోయాయని, బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 58వ డివిజన్ వడ్డెర కాలనీలో ఆదివారం నిర్వహించిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీలకు అన్నివిధాలా టీడీపీ అండగా నిలిచిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు పలు సంక్షేమ పథకాలను అమలు చేశామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో బీసీలపై 26 వేల కేసులు నమోదు చేశారని, 13 బీసీ భవనాలు, 1180 బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు నిలిపివేశారని ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు సంక్షేమం అందాలంటే చంద్ర బాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, పిరియా సోమేశ్వరరావు, ఎరుబోతు రమణ, దాసరి కనకారావు, కంచి ధనశేఖర్, లబ్బా వైకుంఠం పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొండా ఉమా

50 మంది టీడీపీలో చేరిక

అజిత్‌సింగ్‌నగర్: 30వ డివిజన్‌కు చెందిన 50 మంది అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరోసభ్యుడు బొండా ఉమా సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి బొండా ఉమా పార్టీ కండువా కప్పి టీడీపీలోకి వారిని ఆహ్వానించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ కేజీవీ సరిత, కుందా సీతారామశాస్త్రి, వరప్రసాద్

ఘనంగా శారదా కాలేజీ వార్షికోత్సవం

సత్యనారాయణపురం, జనవరి 28: విద్యార్థులు లక్ష్యాన్ని పెట్టుకుని అది సాధించేంత వరకూ పట్టుదలతో కృషిచేయాలని సీఐడీ ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత అన్నారు. సత్యనారాయణపురం శారదా కాలేజీ 50వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనందన్నారు. విద్యార్థి దశలో తీసుకున్న సరైన నిర్ణయాలే భవిష్యత్‌ను ఉన్నత స్థానాలకు చేరుస్తాయన్నారు. ప్రతీ విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు సరిత బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. డీవైఈవో సి.సత్యనారాయణరెడ్డి, శారదా కాలేజీ సెక్రటరీ కుందా సీతారామశాస్త్రి, కరస్పాండెంట్ ఎస్ఎన్ వరప్రసాద్, శారదా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఝాన్సీ, శారదా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..




లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కొంపెల్లి శ్రీనివాస్

చిట్టినగర్, జనవరి 28: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఆదివారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కొంపెల్లి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. లోకేశ్‌ను కలిసిన వారిలో పలువురు వాణిజ్యవిభాగం నాయకులు ఉన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మానవత సాయం

గవర్నర్‌పేట, జనవరి 28: దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు చెందిన ఇద్దరికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం అందించింది. కండరాల సమస్యలతో నడవలేని స్థితిలో ఉన్న జి.రాధమ్మ, ఊపిరితిత్తులు, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న అప్పలాచారికి ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున సంస్థ నిర్వాహకులు సాయం అందించారు. బందరు లాకుల సెంటర్‌లోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం మానవత సంస్థ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంస్థ అధ్యక్షురాలు నాదెళ్ల సుమతీదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఐఐటీ మాజీ ప్రొఫెసర్ వి.వాసుదేవరావు, సంస్థ కార్యదర్శి దావులూరి సాంబశివరావు, ఉపాధ్యాయులు ఎంవీ కృష్ణారెడ్డి, సంస్థ ప్రతినిదులు పి.రాము, యశోద పాల్గొన్నారు



జాబితా నుంచి తొలగించిన రాధ గుంటూరు(ఊర్మిళానగర్) ఓటు



తన ఐడీ ప్రూఫ్‌లతో ఇంటి వద్ద రాధ గుంటూరు

ఓటర్ల జాబితాలో సిత్రాలు

● ఓట్లు తొలగించారని కొందరు..తప్పుల తడకగా రూపొందించారని మరికొందరు ఓటర్ల ఆందోళన



పుట్టినతేదీ లేకుండా ముద్రించిన భాస్కర్ ఓటరు కార్డు

భవానీపురం, జనవరి 28: నెలల తరబడి ఓటర్ల జాబితాలపై ఎన్నికల సంఘం అధికారులు కసరత్తు చేసినా అంతిమంగా చాలా మంది ఓటర్లు తమ ఓటును కోల్పోయామని ఆందోళన చెందుతున్నారు. ఎందుకు తొలగించారో తెలియదని కొందరు, డోర్ నెంబర్లు, ఇతర తప్పుల తడకలు జాబితాలో ఉన్నాయని మరికొందరు చెబుతున్నారు. 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి ఇంటికి కూతవేటు దూరంలోనే 30 ఏళ్ల నుంచి ఊర్మిళానగర్‌లో 76-17-198 డోర్ నెంబర్‌లో నివాసముంటున్న గుంటూరు రాధ పేరును ఓటర్ల జాబితాల్లోంచి తొలగించారు. ఐదేళ్ల క్రితం ఎమ్మెల్యే ఎన్నికల్లోను యెందూరి రామలింగేశ్వరరావు హైస్కూల్‌లో మూడేళ్ల క్రితం కార్పొరేషన్ ఎన్నికల్లో సిద్ధం కృష్ణారెడ్డి ఎలిమెంటరీ పాఠశాలలో ఓటేశానని, ఇప్పుడు తన ఓటును ఎందుకు తొలగించారో తెలియదని చెబుతున్నారు. తాను ప్రజా సమస్యలపై గట్టిగా ప్రశ్నిస్తున్నానని తొలగించారేమోనని అంటున్నారు. 118వ పోలింగ్ బూత్ పరిధిలో ఆమె ఓటు తొలగించిన జాబితాలో ఉంది. 76-17-199 డోర్ నెంబర్‌లో నివాసముంటున్న వెంకటనాని భాస్కర్ సముద్రాల జిల్లా పేరు మారడంతో తాజాగా ఓటర్ల జాబితాలో చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్డుపై అతని పుట్టిన తేదీ లేకుండా 32 ఏళ్ల వయస్సు అని ముద్రించారు. ఆమె తల్లి సుబ్బరత్నం డోర్ నెంబర్ వేరేదిగా ముద్రించారు. ఎన్నికల సంఘం ముద్రించిన ఓటర్ ఐడీ కార్డుల్లో తప్పులు దొర్లడంపై ఈ కార్డులను ఓటింగ్ సమయంలో అనుమ తిస్తారో లేదోనని వారు ఆందోళన చెందుతున్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు
చంద్ర వెంకటరత్నం కన్నుమూత

విద్యాధరపురం, జనవరి 28: టీడీపీ 40వ డివిజన్ సీనియర్ నాయకుడు చంద్ర వెంకటరత్నం ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల పార్టీ నేతలు సంతాపం ప్రకటించి, పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. వెంకటరత్నం మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, కాంగ్రెస్ రవీంద్ర, పీవీ చినసుబ్బయ్య, ప్రభాకర్, నారాయణ నివాళులర్పించారు.

నేతాజీ హైస్కూల్ రోడ్డు మూసివేత

● రోడ్డుపై బైఠాయించి స్థానికుల ఆందోళన

విద్యాధరపురం, జనవరి 28: క్రాంబ్వేరోడ్డుకు అనుసంధానంగా ఉన్న నేతాజీహైస్కూల్ రోడ్డులో ఓ వ్యక్తి అడ్డంగా రేకుల పెట్టి రాకపోకలను నియంత్రించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద కుటుంబాల వారు మహిళలతో సహా క్రాంబ్వేరోడ్డుకు అడ్డంగా బైఠాయించి నినాదాలు చేశారు. యాభై ఏళ్లుగా ఇదే రోడ్డులో ఉంటూ రాకపోకలు సాగిస్తున్నామని, తాజాగా ఒక వ్యక్తి రేకులు పాతి రాకపోకలను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, 42వ డివిజన్ కార్పొరేటర్ పి.చైతన్యరెడ్డి, 42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష అక్కడకు చేరుకుని ఆందోళనకు మద్దతు పలికారు. రోడ్డును ఇష్టానుసారం మూసివేయడం సరికాదని, సమస్యకు పరిష్కారం చూపుతామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని మునిసిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకువెళతామని, రోడ్డును యథాతథస్థితికి తెచ్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు. నగర పాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది అక్కడకు వచ్చి రేకులను తొలగించారు.



నేతాజీ స్కూల్ రోడ్డును తెరవాలని ఆందోళన చేస్తున్న స్థానికులు

అపరిశుభ్రతతో చర్మవ్యాధులు

పటమట, జనవరి 28: అపరిశుభ్రతతో చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చర్మ వ్యాధుల పట్ల అజాగ్రత్తవద్దని చర్మ వ్యాధుల నిపుణుడు డాక్టర్ నీలకంఠ రాశినేని తెలిపారు. సమభావనా మిత్రమండలి 96వ సమావేశం అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఆదివారం బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ నీలకంఠ రాశినేని విచ్చేశారు. యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఆచార్య పీఆర్కే ప్రసాద్, డాక్టర్ ఎంవీ రావు పాల్గొన్నారు. డాక్టర్ నీలకంఠ రాశినేనిని మిత్రమండలి సభ్యులు ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, జనవరి 28: న్యూబ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి ఉపకేంద్రం, 11 కేవీ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. సత్యనారాయణనగర్ పోలీస్‌కాలనీ, హెడ్ పోస్టాఫీస్, ఎస్‌బీఐ బాలాజీనగర్, ఉదగిరి గంగయ్య రోడ్డు, కోర వారివీధి, కొత్త ఆంజనేయస్వామిగుడి, జీఎల్‌రావు ప్లాట్స్, మహితా పబ్లిక్ స్కూల్ బాలాజీనగర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

విద్యాధరపురం: భవానీపురం పరిధిలో 11 కేవీ ఐరన్ యార్డ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ ఆఫీసు ఎదురు పాత ఎంఐజీ బ్లాకులు, ఎల్ఐజీ బ్లాకులు, ఐరన్ యార్డ్, రిలయన్స్ పక్కన పడమటవారి వీధి వరకు సరఫరా ఉండదని తెలిపారు.







ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

కృష్ణలంక, జనవరి 28: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పొట్టి శ్రీరాములు హైస్కూల్ ఆవరణలో సెంటినీ హాస్పిటల్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును ఆదివారం ఆమె ప్రారంభించారు. గుండె, ఆర్థో, బీపీ, మధుమేహం, స్త్రీల సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులు, కిడ్నీ, నరములు, జీర్ణకోశ వ్యాధులకు ఉచిత సేవలు అందించడం ముదావహమన్నారు. సిద్ధార్థ, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కార్పొరేటర్ పుప్పాల కుమారి, నిమ్మల జ్యోతిక, పి.రవి, సురేష్ వర్మ, సెంటినీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎన్.అనిల్, డాక్టర్ దోనె ఇందిర, డాక్టర్ కె.హరీష్ పాల్గొన్నారు.



కృష్ణలంకలో ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

మితిమీరి ప్రవర్తిస్తే ఊరుకోం

● రౌడీషీటర్లకు పోలీసుల హెచ్చరిక

వన్‌టౌన్, జనవరి 28: మితిమీరి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని, నిత్యం పోలీసుల నిఘా ఉంటుందని సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లను కృష్ణలంక సీఐ ఆకుల మురళీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆయన పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు జరిగితే వెంటనే స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మంచి నడవడికతో కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని సూచించారు. గవర్నరుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సీఐ డీవీ రమణ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనవసరపు గొడవలకు దిగి జీవితాలను పాడు చేసుకోవద్దని హెచ్చరించారు. నేర ప్రవృత్తిని వీడాలని సూచించారు.



నాటక ప్రదర్శనలో
చైతన్య విద్యార్థినికి బంగారు నంది



కె. ఆకాంక్షను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కె. సునీత

చిట్టినగర్, జనవరి 28: గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డిసెంబరు 23 నుంచి 29 వరకు చలన చిత్ర, టి.వి, నాటరంగ అభివృద్ధి రాష్ట్ర సంస్థ నిర్వహించిన సాంఘిక నాటకంలో తమ పాఠశాల విద్యార్థిని కె.ఆకాంక్ష బంగారు నంది గెలుచుకుందని చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కె.సునీత తెలిపారు. ఆకాంక్షను చిట్టినగర్‌లోని స్కూల్ ఆవరణంలో ఆమె అభినందించారు.

అలరించిన సంగీత విభావరి

విజయవాడ కల్చరల్, జనవరి 28: స్వరఝరి సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళాశాలలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. 'నా పాట పంచామృతం' పేరిట అలనాటి మధుర గానలహరి కార్యక్రమాన్ని ఒంగోలుకు చెందిన స్వరఝరి సంస్థ నిర్వహించింది. గాయనీ గాయకులు తాళ్లూరి శ్రీదేవి, అంజు స్వామి, స్వర్ణలత, అశోక్ కుమార్, మిలటరీ కోటేశ్వరరావు, రంగనాథ రావు, సాంబశివ రావులు మధురగానం చేశారు. తెలుగు కళా వాహిని అధ్యక్షులు చింతకాయల చిట్టిబాబు, నిర్వాహకులు రవికుమార్ గాయకులను సత్కరించారు.

వైసీపీ నేతల మదాన్ని
అణగతొక్కే మహాశక్తి షర్మిల

● ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్

గవర్నర్‌పేట, జనవరి 28: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రతిపక్షాల తొత్తుకాదని, వైసీపీ నేతల మదాన్ని అణగతొక్కే మహాశక్తి అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షర్మిలపై ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి చేసిన వ్యాఖ్యల్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేద, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అని, వైఎస్ఆర్ పేరు పెట్టుకున్న జగన్ పార్టీ దాని అర్థాన్ని పూర్తిగా మార్చివేసిందని అన్నారు. వైసీపీలో రాష్ట్ర అధ్యక్షుడి దగ్గర నుంచి రీజినల్ కో-ఆర్డినేటర్లు, పార్టీలోని వివిధ విభాగాల రాష్ట్ర చైర్మన్లుగా రెడ్లను నియమించి అంతా రెడ్డిమయం చేశారని విమర్శించారు. బడుగుల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు.



దిక్సూచి DIKSUCHI



అసమానతలకు అద్దం పట్టిన ఆక్స్‌ఫామ్ నివేదిక

ఒకప్పుడు రాజు-పేద తదుపరి భూస్వామి-పేద రైతు, మరి కొంత కాలానికి యజమాని-కార్మికుడు ఇలా ఆర్థిక అంతరాలు అనాదిగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రజలంతా త్రాసుకు ఒకవైపు ఉంటారు. రెండో వైపు ఉండే కొద్దిమంది నిరంతరం సంపన్నులవుతూనే ఉంటున్నారు. గతంలో నెమ్మదిగా పెరిగిన ఆర్థిక అంతరాలు ఇప్పుడు రోజూ కొన్ని రెట్ల వేగంతో దూసుకుపోతున్నాయి. పేదలు మరింత పేదరికంలోకి జారిపోతుండగా వారివద్ద నుంచి కార్పొరేట్‌లు దోచుకొంటున్న సంపద వారిని మరింత సంపన్నులుగా చేస్తోంది. ఈ అంతరాల ధోరణులను అలాగే దేశాల మధ్య, దేశాలవారీ, వర్గాల వారీ ఏర్పడుతున్న ఆర్థిక అంతరాలను విపులీకరిస్తూ దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సు తొలి రోజున ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్ సంస్థ 'ఇనీక్వాలిటీ ఇంక్: హౌ కార్పొరేట్ పవర్ డివైడ్స్ అవర్ వరల్డ్ అండ్ ద నీడ్ ఫర్ ఏ న్యూ ఎరా ఆఫ్ పబ్లిక్ యాక్షన్' పేరిట ఒక నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక అంతరాలు, దానికి గల కారణాలు, పరిష్కార మార్గాలు చర్చించారు. అంతేకాక భారతదేశ పరిస్థితులకు అద్దంపడుతూ 'సర్వైవల్ ఆఫ్ ద రిచ్చెస్ట్‌:ద ఇండియా స్టోరీ' పేరుతో ప్రత్యేక నివేదికను సైతం ఆక్స్‌ఫామ్ ఇండియా సంస్థ విడుదల చేసింది.

ఆక్స్‌ఫామ్ ప్రపంచ ఆర్థిక అంతరాల నివేదిక

ప్రపంచం-ఆర్థిక అంతరాల ధోరణులు

- 2020 నుంచి అంటే గడచిన మూడేళ్లలో ప్రపంచంలోనే అత్యంత ధనవంతులైన తొలి అయిదుగురి సంపద రెండింతలైంది. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా 500 కోట్లమంది అంటే ప్రపంచ జనాభాలో 60 శాతం మంది మరింత పేదరికంలోకి కూరుకుపోయారు.
- ప్రస్తుత ధరల్లో చూస్తే ప్రపంచంలోని పేదరికం అంతం కావడానికి 230 ఏళ్లు పట్టగా మరో పదేళ్లలో తొలి ట్రిలియనీర్ ఆవిర్భవించనున్నారు.
- గ్లోబల్ కార్పొరేట్‌లు ఏకస్వామ్య శక్తులుగా అవతరించి భారీ స్థాయిలో సంపదను పోగుచేయడం అనేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అధిక అసమానతలకు కారణమైంది.
- ప్రపంచంలో పది అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఏడింటి సీఈఓలు/ప్రధాన షేర్‌హోల్డర్లు బిలియనీర్లుగా ఉన్నారు.
- ప్రపంచంలోని 96 ప్రధాన కంపెనీలు ఆర్జిస్తున్న ప్రతి వంద డాలర్ల లాభంలో 82 డాలర్లు యాజమాన్యానికే(సంపన్న షేర్ హోల్డర్స్‌కే) దక్కుతోంది.
- ప్రపంచంలోని బిలియనీర్లు 2020తో పోలిస్తే 3.3 ట్రిలియన్ డాలర్ల అదనపు సంపద పోగేసుకున్నారు. ఈ మూడేళ్లలో 34 శాతం మంది మరింత సంపన్నులుగా ఆవిర్భవించారు. ప్రపంచ తొలి అయిదుగురు సంపన్నులైన ఎలాన్‌మస్క్, బెర్నార్డ్ ఆర్నాల్డ్, జెఫ్‌బెజోస్, లారీ ఎలిసన్, మార్క్‌జుకర్‌బర్గ్‌ల సంపద గడచిన మూడేళ్లలో 464 బిలియన్ డాలర్లు పెరిగింది. ఇదే సమయంలో కరోనా, ఆర్థిక మాంద్య పరిస్థితుల పేరిట వీరి సంస్థలైన అమెజాన్, ఫేస్‌బుక్ వంటివాటిలో భారీగా ఉద్యోగులను తొలగించారు. గడచిన మూడేళ్లలో కరోనా, యుద్ధాలు, జీవన వ్యయాల సంక్షోభం, పర్యావరణ విఘాతం వంటి ఒడుదొడుకులకు సామాన్యులను గురిచేస్తూ 'డికేడ్ ఆఫ్ డివిజన్(అంతరాల దశాబ్దం)'కు నాంది పడింది. ఈ కాలంలో సంభవించిన ప్రతి సంక్షోభం జనాభాలో అధికంగా ఉన్న పేద వర్గాలను మరింత పేదరికంలోకి నెట్టి కొద్ది మంది చేతుల్లో ఉన్న సంపదను మరింత పెంచింది.
- ఈ ఆర్థిక అంతరాలు ప్రపంచ జనాభాలోనే కాదు ప్రపంచ దేశాల మధ్య కూడా విస్తరించాయి. గ్లోబల్ నార్త్ అంటే సంపన్న దేశాలుగా పిలిచే ఉత్తరార్థ గోళ పాశ్చాత్య దేశాల్లో సంపద మొత్తం కేంద్రీకృతమయింది. ప్రపంచ జనాభాలో కేవలం 21 శాతం మంది నివశించే ఈ ప్రాంతంలో 69 శాతం వ్యక్తిగత సంపద, 74 శాతం ప్రపంచ బిలియనీర్ల సంపద వచ్చి చేరింది. గడచిన 25 ఏళ్లలో తొలిసారి గ్లోబల్ నార్త్-గ్లోబల్ సౌత్ మధ్య అంతరాలు భారీగా పెరిగాయి.
- తక్కువ ఆదాయ, దిగువ మధ్య ఆదాయ దేశాలు ఎదుర్కొంటున్న ఇంధన, ఔషధ, ఆహార దిగుమతుల వ్యయాల కోసం చేస్తున్న రుణాలకు రాబోయే 2029 నాటికి రోజూ 50 కోట్ల డాలర్ల మేర వడ్డీ చెల్లింపులు చేయాల్సి ఉంటుందని అంచనా. ఇది ఆయా దేశాల బలహీన వర్గాలు, మహిళా సంక్షేమంపై మరింత ప్రతికూల ప్రభావం చూపనుందని అంచనా!
- ప్రపంచవ్యాప్తంగా మహిళల కంటే పురుషులు 105 ట్రిలియన్ డాలర్ల ఎక్కువ సంపదతో ఉన్నారు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు నాలుగింతలు ఎక్కువ. ఆరోగ్య, సామాజిక రంగాల్లో పనిచేసే ఒక మహిళ మొత్తం సంపాదన, ఒక ఫార్చ్యూన్ 100 కంపెనీలోని సీఈఓ వార్షిక వేతనంతో సరితూగాలంటే 1200 ఏళ్లు పడుతుంది. వివిధ వర్గాల పరంగా తీసుకుంటే అమెరికాలో నివసించే సాధారణ నల్ల జాతి కుటుంబం సంపద, సాధారణ శ్వేత జాతి కుటుంబ సంపదలో 15.8 శాతం మాత్రమే ఉంటుంది. బ్రెజిల్‌లో నల్లజాతి ప్రజలతో పోలిస్తే శ్వేతజాతీయుల సంపాదన 70 శాతం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్త ఆస్తుల్లో 43 శాతం వరకు కేవలం ఒక శాతం సంపన్నుల చేతిలో ఉంది. అదేవిధంగా మధ్య ప్రాచ్యంలో ఒకశాతం మంది సంపన్నులకు 48 శాతం ఆర్థిక సంపద ఉండగా ఆసియాలో ఒకశాతం మంది సంపన్నులకు 50 శాతం సంపద, యూరప్‌లో ఒక శాతం మంది సంపన్నులకు 47 శాతం సంపద ఉంది.

ఏకస్వామ్యాల యుగం-కార్పొరేట్ శక్తుల విజృంభణ

- సంపద కేంద్రీకరణ-కార్పొరేట్ సామ్రాజ్యాలు-ఏకస్వామ్య ధోరణులు పరస్పర పూరకాలుగా పనిచేస్తూ ఒక వలయంగా ఏర్పడి ఆర్థిక అంతరాలు మరింత పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలు తమ ఆర్థిక విధానాలతో చిన్న సంస్థలను అణచివేస్తూ ఏకస్వామ్యాలను స్థాపిస్తున్నాయి. ప్రభుత్వ పాలసీలు సైతం సరళీకరించడంతో అన్ని రంగాల్లో ఏకీకృత ధోరణులు పెరిగి లాభాల ఆర్జనే పరమావధిగా మారింది. ఆ లాభాల్లో ఉద్యోగులకు, పన్నుల రూపంలో ప్రభుత్వాలకు అతి తక్కువ వాటా చేరుతోంది. అత్యధిక భాగం కార్పొరేట్ యాజమాన్యాలకు దక్కుతూ ఏకీకృత ధోరణులు బలపడడానికి దోహదమవుతోంది. పోటీ పెద్దగా లేకపోవడం, ప్రభుత్వపర నియంత్రణ లేకపోవడం వల్ల ధరల నియంత్రణ, మార్కెట్ నియంత్రణ లేక ఉత్పత్తి వ్యయం కన్నా అనేక రెట్లు ఎక్కువ ధర నిర్ణయమవుతోంది. సంపద మొత్తం కొందరి చేతుల్లోకే తరలిపోతుంది. ఉదాహరణకు 1995-2015 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా 60 ఫార్మాస్యూటికల్ కంపెనీలు విలీనమై పది అతిపెద్ద ఫార్మా ఫర్మ్‌గా అవతరించాయి. ప్రపంచ విత్తన మార్కెట్‌లో 40 శాతం పైనే రెండు కంపెనీలకు ఉంది. నాలుగింట మూడొంతుల ఆన్‌లైన్ ప్రకటనల ఆదాయం అంతా మెటా, అమెజాన్, ఆల్ఫాబెట్‌లకే చేరుతోంది. 90 శాతం ఆన్‌లైన్ సెర్చ్ గూగుల్ ద్వారానే సాగుతోంది. ఈ విధంగా భారీ టెక్ కంపెనీలు టెక్నాలజీ రంగంలో ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి.
- వ్యవసాయ రంగంలో అధిక భాగం బహుళజాతి ఆహార ప్రాసెసింగ్ కంపెనీల చేతుల్లో; భారత పారిశ్రామిక రంగం అంతా అయిదు అతి పెద్ద సంస్థల చేతుల్లో కేంద్రీకృతమైంది. ఈ ధోరణి వల్ల శక్తి, ఆహారం, ఔషధ రంగాల్లో తీవ్రంగా ధరల దోపిడీ కొనసాగుతోంది. ఇతర చిన్నపాటి సంస్థలు ఎదిగి పోటీ ఇచ్చేందుకు అవకాశం లేకుండా ఆర్థిక నిధులు, రుణ వసతులను సైతం బడా కంపెనీలే చేజిక్కించుకుంటున్నాయి.

అసమానతలకు కారణమయ్యే కార్పొరేట్ ధోరణులు

శ్రామికులకు దక్కని ప్రతిఫలం

- బడా కార్పొరేటర్లు శ్రామికులకు/ఉద్యోగులకు కనీసం జీవన వ్యయాలను సైతం చెల్లించకుండా శ్రమదోపిడీ చేస్తూ లాభాలను అల్ట్రారిచ్ వ్యాపార భాగస్వాముల మధ్య పంచుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 1600 అతిపెద్ద కంపెనీల్లో కేవలం 0.4 శాతం మాత్రమే తమ ఉద్యోగులకు కనీసం జీవన వ్యయానికి అవసరమైన వేతనాలు అందిస్తున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా 80 కోట్లమంది శ్రామికులు ద్రవ్యోల్బణాన్ని అధిగమించే స్థాయి వేతనాన్ని పొందలేకపోతున్నారు. ఈ వేతన వ్యత్యాసం అనేది లింగ, జాతిపరంగా ఎక్కువగా ఉంది. 2019లో పురుష కార్మికులతో పోలిస్తే వారి ప్రతి డాలర్ ఆదాయానికి మహిళ కార్మికులు కేవలం 51 సెంట్లు మాత్రమే పొందారు. వ్యవసాయ రంగం, సప్లయ్ చెయిన్లలో ఈ వివక్ష మరీ ఎక్కువగా ఉంది. ప్రమాదకర పని పరిస్థితుల కారణంగా ఏటా 2.3 మిలియన్‌ల మంది కార్మికులు పని సంబంధిత వ్యాధులు, ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారు.
- లేబర్ యూనియన్‌లను కార్పొరేట్ సంస్థలు ఉక్కుపాదంతో అణచి వేయడం; కార్మిక చట్టాలు, బాల కార్మిక చట్టాలను సరళం చేస్తూ ప్రభుత్వాలు సవరణలు తీసుకురావడం వల్ల కూడా ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి.

మిగతా రేపటి పేజీలో..


ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

బడ్జెట్ తయారీ ఇలా

ఇండియన్ ఎకానమీ

ప్రభుత్వం ప్రకటించే వార్షిక ఆర్థిక ప్రకటనను బడ్జెట్ అంటారు. కేంద్రప్రభుత్వం భారత రాజ్యాంగంలోని 112వ ఆర్టికల్ ప్రకారం తన వార్షిక, ఆర్థిక ప్రకటన(బడ్జెట్)ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి.

బడ్జెట్‌లో ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ వసూళ్లు, రుణాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. రాబోయే సంవత్సరానికి ప్రకటించే బడ్జెట్‌లో ఆ ఏడాదికి సంబంధించిన అంచనాలు, గత సంవత్సరానికి సవరించిన మొత్తాలు, అంతకు ముందు ఏడాదికి చెందిన అంతిమ సమాచారం ఉంటుంది. ఉదాహరణకు 2023-24 సంవత్సరం ముగుస్తున్నప్పుడు 2024-25 సంవత్సరం కోసం బడ్జెట్ ప్రకటిస్తే 2024-25 సంవత్సరానికి సంబంధించిన అంచనాలు ఉంటాయి. 2023-24 సంవత్సరానికి సంబంధించిన సవరించిన అంచనాలు ఉంటాయి. 2022-23 సంవత్సరానికి సంబంధించిన చివరి అంచనాలు ఉంటాయి.

బడ్జెట్ రకాలు

1) సంతులిత బడ్జెట్ 2) లోటు బడ్జెట్ 3) మిగులు బడ్జెట్

1) సంతులిత బడ్జెట్: ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఆదాయం సమానంగా ఉన్నప్పుడు సంతులిత బడ్జెట్ అంటారు.

2) లోటు బడ్జెట్: ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఆదాయాన్ని మించినప్పుడు లోటు బడ్జెట్ అంటారు.

లోటు బడ్జెట్ భావనలు: ఎ) బడ్జెట్ లోటు(ద్రవ్యలోటు) బి) రెవెన్యూ లోటు సి) విత్తలోటు డి) ప్రాథమిక లోటు ఇ) ప్రభావిత రెవెన్యూ లోటు

ఎ) బడ్జెట్ లోటు: మొత్తం ప్రభుత్వ వసూళ్ల కంటే ప్రభుత్వ వ్యయం ఎక్కువగా ఉండటం. దీనినే ద్రవ్యలోటు అంటారు. ఎందుకంటే కేంద్రబ్యాంకు ముద్రించి ఇచ్చే ద్రవ్యంతో ఈ లోటును ప్రభుత్వం పూరించుకుంటుంది.

బి) రెవెన్యూ లోటు: మొత్తం రెవెన్యూ వసూళ్లు మొత్తం రెవెన్యూ వ్యయం కంటే తక్కువగా ఉండటం.

సి) విత్తలోలోటు: ప్రభుత్వ మొత్తం, ప్రభుత్వ రుణేతర వసూళ్లను మించిపోవడాన్ని విత్తలోటు అంటారు. బడ్జెట్ లోటుకు మార్కెట్ రుణాలను, ఇతర అప్పులను(ప్రావిడెంట్ ఫండ్, చిన్న పొదుపు మొత్తాలు)ను కలిపితే కూడా విత్తలోటు తెలుస్తుంది. ప్రభుత్వ వ్యయం నుంచి రెవెన్యూ వసూళ్లు, రుణాల వసూళ్లు, ఇతర వసూళ్లు(పెట్టుబడుల ఉపసంహరణ నిధులు) తీసివేస్తే వచ్చేది విత్తలోటు.

డి) ప్రాథమిక లోటు: విత్తలోటు నుంచి వడ్డీ చెల్లింపులను తీసివేయగా వచ్చేది ప్రాథమిక లోటు.

ఇ) ప్రభావిత రెవెన్యూ లోటు: రెవెన్యూ లోటు నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు మూలధన ఆస్తుల నిర్మాణం కోసం ఇచ్చిన నిధుల(గ్రాంట్స్)ను తీసివేస్తే వచ్చేది ప్రభావిత రెవెన్యూ లోటు.

మిగులు బడ్జెట్

ప్రభుత్వ వ్యయం కంటే ప్రభుత్వ ఆదాయం ఎక్కువగా ఉండటాన్ని మిగులు బడ్జెట్ అంటారు. మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం దాదాపు జరగదు. సాధారణంగా లోటు బడ్జెట్‌నే ప్రభుత్వాలు ప్రవేశపెడుతుంటాయి.

బడ్జెట్ రూపకల్పన

బడ్జెట్‌లో రెండు స్థూల అంశాలుంటాయి.

1) ప్రభుత్వ వ్యయం 2) ప్రభుత్వ వసూళ్లు

1. ప్రభుత్వ వ్యయం: ప్రభుత్వ వ్యయాన్ని తిరిగి రెండు రకాలుగా వర్గీకరిస్తారు.

ఎ) రెవెన్యూ వ్యయం బి) మూలధన వ్యయం

ఎ) రెవెన్యూ వ్యయం: రెవెన్యూ వ్యయంలో వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, రక్షణ వ్యయం, పాలన వ్యయం, రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర గ్రాంటులు ఉంటాయి.

బి) మూలధన వ్యయం: అభివృద్ధి సంబంధిత వ్యయం, రక్షణకు సంబంధించిన మూలధన వ్యయం, రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం ఇచ్చే రుణాలను మూలధన వ్యయంగా పరిగణిస్తారు.

2. ప్రభుత్వ వసూళ్లు: ప్రభుత్వ వసూళ్లను స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరిస్తారు. 1. రెవెన్యూ వసూళ్లు 2. మూలధన వసూళ్లు

1. రెవెన్యూ వసూళ్లు: ఇవి రెండు రకాలు

ఎ) పన్నుయేతర వసూళ్లు బి) పన్నుల వసూళ్లు

ఎ) పన్నుయేతర వసూళ్లు: ప్రభుత్వం ఇచ్చిన రుణాలపై వసూలు చేసుకొనే వడ్డీ, ప్రభుత్వరంగ సంస్థలు ఆర్జించిన లాభాల నుంచి ప్రభుత్వానికి వచ్చే డివిడెండ్లను పన్నుయేతర రెవెన్యూ వసూళ్లుగా పరిగణిస్తారు.

బి) పన్ను వసూళ్లు: పన్నులు స్థూలంగా రెండు రకాలు

1) ప్రత్యక్ష పన్నులు 2) పరోక్ష పన్నులు

ప్రత్యక్ష పన్నులు: ఆరంభ భారం, అంతిమ భారం ఒకరిపైనే ఉంటే వాటిని ప్రత్యక్ష పన్నులు అంటారు. ఆదాయపన్ను, కార్పొరేట్ పన్ను, వృత్తిపన్ను, సంపదపై పన్ను, వ్యయ పన్ను, బహుమతిపై పన్ను, భూమిశిస్తు మొదలైనవి ప్రత్యక్ష పన్నులు. ఈ పన్నులను ఎవరిపై విధిస్తారో వారే చెల్లించాలి. పన్నుభారాన్ని బదిలీ చేయడం వీలుకాదు. ఎవరిపైన పన్ను విధించారో దానిని ఆరంభ భారం అంటారు. ఎవరు పన్ను చెల్లించారో దానిని అంతిమభారం అంటారు. అంటే ఆరంభ భారం, అంతిమ భారం ఒకరిపైనే పడినట్లు లెక్క.

పరోక్ష పన్నులు: ఆరంభ భారం ఒకరిపై అంతిమ భారం మరొకరిపై పడితే అలాంటి పన్నులను పరోక్ష పన్నులు అంటారు. వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ), వ్యాట్, కస్టమ్స్ సుంకాలు, ఎక్సైజ్ సుంకాలు, అమ్మకం పన్ను, సేవల పన్ను మొదలైనవి పరోక్ష పన్నులు. ఈ పన్నుల భారాన్ని బదిలీ చేయడానికి అవకాశం ఉంటుంది. అంటే ఆరంభ భారం ఒకరిపై అంతిమభారం మరొకరిపై పడే అవకాశం ఉంది. ఉదాహరణకు జీఎస్‌టీని ఉత్పత్తి విలువపై లేదా అమ్మకపు విలువపై లేదా సేవా విలువపై విధిస్తారు. అంటే ఉత్పత్తిదారునిపై లేదా అమ్మకందారునిపై లేదా సేవలు ఇచ్చిన వ్యక్తిపై పన్ను ఆరంభ భారం పడింది. కానీ ఆ పన్ను భారాన్ని ఉత్పత్తిదారుడు హోల్‌సేల్ వ్యాపారికి, హోల్‌సేల్ వ్యాపారి రిటైల్ వ్యాపారికి, రిటైల్ వ్యాపారి వినియోగదారునికి బదిలీ చేస్తారు. అంటే పన్ను అంతిమభారం వినియోగదారునిపై పడిందన్నమాట. వీటినే పరోక్షపన్నులు అంటారు.

మూలధన వసూళ్లు

రుణాల వసూళ్లు, మార్కెట్ రుణాలు, ఇతర అప్పులు(ప్రావిడెంట్ ఫండ్, చిన్న పొదుపు మొత్తాలు), ఇతర వసూళ్లు(పెట్టుబడి ఉపసంహరణ నిధులు) మూలధన వసూళ్లలో ఉంటాయి.


డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.

విదర్భ, ఉత్తరాఖండ్ జయభేరి

విజయవాడ స్పోర్ట్స్: ఏసీఏ పర్యవేక్షణలో మూలపాడులోని ట్విన్ స్టేడియం గ్రౌండ్స్‌లో జరుగుతున్న బీసీసీఐ అండర్-23 గ్రూప్-డీ వన్డే టోర్నీలో విదర్భ, ఉత్తరాఖండ్ జట్లు ఆదివారం జయభేరి మోగించాయి. జార్ఖండ్-విదర్భ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ టీమ్ 34.4 ఓవర్లలో 71 పరుగులకు ఆలౌట్ కాగా, విదర్భ జట్టు 2 వికెట్లను కోల్పోయి 21.2 ఓవర్లలో 73 పరుగులతో విజయడంకా మోగించింది. హైదరాబాద్-ఉత్తరాఖండ్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ దిగిన హైదరాబాదీ అమ్మాయిలు 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేయగా, లక్ష్య సాధనలో ఉత్తరాఖండ్ ఉత్కంఠ భరిత విజయాన్ని అందుకుంది. 49.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 251 పరుగులతో మన విజయం సాధించింది.

3, 4న జిల్లా క్యారమ్స్ ఎంపికలు

జిల్లా క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3,4న నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలోని దఫేదార్ హాల్లో సీనియర్ పురుషుల, మహిళల క్యారమ్స్ ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా సంఘం సెక్రటరీ జె.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని మార్చిలో గుంటూరులో జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఫిబ్రవరి 2న ఉదయం 11 గంటకల్లా నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు బి.వెంకటేష్ 9491575055, ఎస్‌కే అజ్మతుల్లా 9491122634 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

31న 'యుద్ధభేరి మహాసభ'ను జయప్రదం చేయండి: పేరుపోగు

ధర్నాచౌక్: ప్రతి ఎన్నికల్లో మాదిగలకు అన్ని రాజకీయ పార్టీలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 31న స్థానిక జింఖానా గ్రౌండ్‌లో మాదిగ, రెల్లి, డక్కలి ఉపకులాల 'యుద్ధ భేరి మహాసభ' నిర్వహిస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో మాదిగలు, మాదిగ ఉపకులాలకు 21 అసెంబ్లీ, 4 పార్లమెంట్ సీట్లు ఇవ్వాలని, లేకుంటే ఓడిస్తామని సభలో రాష్ట్రంలోని అన్ని పార్టీలను హెచ్చరిస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి వర్గీకరణపై బీజేపీ తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. లేదంటే 'చలో ఢిల్లీ' చేపడతామన్నారు. ఎన్నికలు వస్తున్నందున మంద కృష్ణమాదిగకు ప్యాకేజీలిచ్చి బీజేపీ వాడుకుంటోందన్నారు.

వచ్చే ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వండి: స్వామి

ధర్నాచౌక్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో అఖిల భారత పద్మశాలి సంఘం, చేనేత సంఘానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్ని పార్టీలను డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 5 ఎమ్మెల్యే, 2 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలన్నారు. లేదంటే అన్ని నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులు పోటీచేసి సత్తా చాటుతామన్నారు. సంఘం నేత వైకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గద్దం జగన్నాథం, శివ, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, చిరంజీవి, కస్తూరి వెంకటేశ్వరరావు, లక్ష్మీ కోటేశ్వరరావు, కాంతారావు, లక్ష్మీ భీమేష్, కుబేర స్వామి, అమలా పాల్గొన్నారు.



దుర్గమ్మ అలంకరణకు 23.5 గ్రాముల కాసులపేరును కానుకగా ఇచ్చిన హైమవతి, ప్రభాకరరావు

దుర్గమ్మకు కానుకగా కాసుల పేరు

వన్‌టౌన్, జనవరి 28: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు రాజమహేంద్రవరానికి చెందిన జే హైమవతి, జేవీకేటీ ప్రభాకరరావు కుటుంబ సభ్యులు ఆదివారం ఆలయానికి విచ్చేసి 23.5 గ్రాముల బంగారు కాసుల పేరును కానుకగా ఇచ్చారు. ఏఈవో రమేష్ కు ఈ కానుకను దేవస్థానానికి అందజేశారు. అమ్మనానంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు. మరోవైపు ఆదివారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. చండీహోమం, లక్షకుంకుమార్చన తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. లోక కల్యాణార్థం అర్చకులు సూర్యారాధన, అరుణ పారాయణ నిర్వహించారు.

రేపు హుండీల్లోని కానుకల లెక్కింపు

ఈనెల 30న మహామండపంలోని ఆరో అంతస్తులో హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్టు ఈవో రామారావు ఆదివారం తెలిపారు

నేడు ట్రస్ట్‌బోర్డు సమావేశం

దుర్గగుడి పాలక మండలి సమావేశం సోమవారం జరగనుంది. పలు తీర్మానాలను ఆమోదానికి ఎజెండాలో పొందుపరిచినట్టు సమాచారం. ప్రధానంగా దేవస్థానానికి అవసరమైన సరుకుల కొనుగోలుకు సంబంధించి గతంలో దేవదాయ శాఖ మంత్రి సూచనల మేరకు రూ.కోటి, రూ.2కోట్లు, రూ.3కోట్లు టర్నోవర్ చేసిన కాంట్రాక్టర్లను పిలవాల్సి ఉంది. తాజా సమావేశంలో రూ.5కోట్లు టర్నోవర్ ఉండే కాంట్రాక్టర్లను ఆహ్వానించేందుకు ఒకే టెండర్‌ను పిలవాలని యోచించి తీర్మానం చేయనున్నట్టు చెబుతున్నారు. రూ.5కోట్ల టర్నోవర్ ఉన్న ఓ కాంట్రాక్టర్‌పై గతంలోనూ ఆరోపణలు వచ్చాయి, మళ్లీ అదే కాంట్రాక్టర్‌కు టెండర్ వచ్చేటట్టు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొత్తగా పునర్నిర్మాణంలోని మల్లేశ్వరాలయంలో విద్యుత్ దీపాలు, ఏసీలకు రూ.40 లక్షల అంచనాలతో టెండర్లు పిలవనున్నారు. వచ్చేనెల 18న మల్లేశ్వరాలయం ప్రారంభాన్ని పురస్కరించుకుని కావాల్సిన ఏర్పాట్లను ఎజెండాలో పెట్టి ఆమోదించేందుకు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

రోయింగ్ చాంప్‌కు రాణి సహస్ర, హేమంత్



విజయవాడ స్పోర్ట్స్, జనరి 28: పూణేలోని ఆర్మీ రోయింగ్ నోడ్‌లో జరగనున్న 41వ సీనియర్, 25వ ఓపెన్ స్ప్రింట్ నేషనల్ రోయింగ్ చాంపియన్‌షిప్‌కు రాష్ట్రం నుంచి రాణి సహస్ర, సాయి హేమంత్ ఎంపికయ్యారు. కృష్ణానది సమీపంలోని బబ్బూరి మైదానంలో ఏబీసీ అమరావతి బోటింగ్ క్లబ్ వాటర్ స్పోర్ట్స్ శిక్షణ అకాడమీలో ట్రయల్స్‌లో వీరిద్దరూ ఎంపికయ్యారని రాష్ట్ర స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని తెలిపారు. గుజరాత్ నేషనల్ గేమ్స్‌లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించి క్వార్టర్ ఫైనల్స్‌కు వెళ్లిన సాయి హేమంత్‌తో పాటు సహస్ర మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో పాల్గొంటుందన్నారు.

స్విమ్మింగ్‌లో తీర్థసామ్‌దేవ్ సత్తా

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 28: చెన్నైలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ స్విమ్మింగ్‌లో జిల్లా స్విమ్మర్ ఎం.తీర్థసామ్‌దేవ్ స్వర్ణ, రజతాలతో ఆదివారం సత్తా చాటాడు. సామ్‌దేవ్ 1500 మీటర్ల ఫ్రీ స్టయిల్ స్విమ్మింగ్‌లో 16:18:73 సెకన్లతో అధిగమించి స్వర్ణం వశం చేసుకోగా 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీలో రజతం తన ఖాతాలో వేసుకున్నాడు. తీర్థ సామ్‌దేవ్ 2 పతకాలతో సత్తా చాటడంతో ఏపీఏ కార్యదర్శి మోహన్ వెంకటరామ్, సెక్రటరీ ఐ.రమేష్ అభినందించారు.



స్వర్ణ, రజతాలను సాధించిన సామ్‌దేవ్‌తో వెంకటరామ్

భవానీపురంలో ఫ్లెక్సీల వివాదం

విద్యాధరపురం, జనవరి 28: భవానీపురంలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీల వివాదం ముదురుతోంది. ఒక పార్టీ బ్యానర్లు, ఫ్లెక్సీలపై మరో పార్టీ బ్యానర్లు వేయడంపై ఆగ్రహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రచారానికి వైసీపీ నేతలు ఇష్టానుసారం బ్యానర్లు ఏర్పాట్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 42వ డివిజన్ జనసేన నేత తిరుపతి అనూష మాట్లాడుతూ శివాలయం సెంటర్‌ను కార్పొరేటర్ చైతన్య రెడ్డి వైఎస్ఆర్ సెంటర్‌గా మార్చేశారని విమర్శించారు. ఇటీవల శ్రీరాముడి పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించకుండానే వైసీపీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారన్నారు. చైతన్యరెడ్డికి అహంకారం పనికిరాదని, గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. మరోవైపు డివిజన్‌లో పలు ప్రాంతాల్లో జనసేన. టీడీపీ నేతల బ్యానర్లను కావాలని పోలీసుల చేత తొలగింపజేస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాగా శివాలయం సెంటర్‌లో బ్యానర్లు, ఫ్లెక్సీల వివాదం జరుగుతుండగా భవానీపురం పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.



జై శ్రీరామ్ ఫ్లెక్సీలను తొలగించకుండానే వైసీపీ నేతల బోర్డులు



వివాదం ముదరడంతో సర్దిచెబుతున్న పోలీసులు

రైల్వే పోర్టర్‌గా వచ్చి లగేజీ దొంగతనం

● నిందితుడి అరెస్టు ● మరో ఇద్దరి కోసం గాలింపు



నిందితుడు రాజశేఖర్

విజయవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆమెకు వృద్ధాప్యం. చేతిలో భారీ లగేజీ. దాన్ని ఈడ్చుకుంటూ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోకి అడుగుపెట్టింది. ఆమెను చూసిన ఓ వ్యక్తి అప్పటికప్పుడు రైల్వేపోర్టర్ అవతారం ఎత్తి ప్లాట్‌ఫాం వరకు లగేజీని తీసుకొస్తానని బేరం మాట్లాడుకున్నాడు. ఆ కూలీ మనస్సులోని మరో కోణాన్ని గ్రహించలేకపోయింది. దీంతో ఆ వ్యక్తి లగేజీతో పరారయ్యాడు. చివరకు సీసీ కెమెరాల్లో చిక్కి, పోలీసులకు దొరికిపోయాడు.

హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన కొడాలి వెంకటలక్ష్మి అన్నపూర్ణ ఈనెల 8న నగరానికి వచ్చింది. తిరిగి 13న హైదరాబాద్‌కు వెళ్లేందుకు స్టేషన్‌కు వచ్చింది. పార్శిల్ కార్యాలయం నుంచి 6వ నంబరు ప్లాట్‌ఫారం పైకి లగేజీని తీసుకెళ్లాల్సి ఉంది. బరువుగా ఉండడంతో నెమ్మదిగా లాక్కుంటూ వెళ్తోంది. అక్కడే ఉన్న విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌కు చెందిన ఇసుకపట్ల రాజశేఖర్ అలియాస్ గాబ్రియల్ అలియాస్ శేఖర్ తాను లగేజీని మోస్తానని కూలీ కుదుర్చుకుని లగేజీ మోసుకుంటూ ముందు వెళ్తున్నాడు.. వెనుక ఆమె నెమ్మదిగా నడుస్తోంది. ఇంతలో ఆ వ్యక్తి లగేజీతో మాయమయ్యాడు. దీంతో ఆమె 6వ నంబర్ ప్లాట్‌ఫాం మీద ఉన్న రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేసింది. నేరం పార్శిల్ కార్యాలయం వద్ద జరగడంతో పోలీసులు దీన్ని సత్యనారాయణపురం పోలీసులకు బదిలీ చేశారు. సీపీ టి.కాంతిరాణా 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీఎస్ డీసీపీ ఎం.కృష్ణమూర్తి, ఏసీపీ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.స్రవంతిరాయ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ, ఎం.వెంకటనారాయణ, ఎస్‌ఐ మహ్మద్ షరీఫ్, జీఆర్పీ ఎస్‌ఐ ఎం.మక్తాలాల్ నేరం జరిగిన ప్రాంతాన్ని, సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఈ నేరం చేసిన వ్యక్తి రాజశేఖర్‌గా గుర్తించారు. అతడి సొంత గ్రామం కోనసీమ జిల్లా కాట్రేనికోన. కొన్నాళ్ల క్రితం నగరానికి వచ్చి ఫుట్‌పాత్‌లు, ఆలయాలు, పీఎన్‌బీఎస్ వద్ద తిరుగుతూ అక్కడే నిద్రపోతుండేవాడు. లగేజీతో పరారైన తర్వాత మరో ఇద్దరి కలిసి బంగారు వస్తువులను మాయం చేశాడని తేల్చారు. ప్రస్తుతం రాజశేఖర్‌ను అరెస్టు చేసిన పోలీసులు మిగిలిన ఇద్దరి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడి నుంచి 103 గ్రాముల బంగారం బ్రాస్‌లెట్, 26.65 గ్రాముల గాజు, రూ.40వేలు, హ్యాంగ్‌బ్యాగ్‌లు, వ్యాలెట్, దుస్తులు రికవరీ చేశారు.



కానూరి ఆనందకుమారి ట్రస్ట్ ద్వారా చెక్కుల పంపిణీ దృశ్యం

పేదల కోసమే కానూరి ఆనందకుమారి ట్రస్ట్

» 100 మందికి కృత్రిమ అవయవాలు..

» 30 మంది రైతులకు రూ.25వేల చొప్పున ఆర్థిక సాయం అందజేత

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని పేదలను ఆదుకుని వారికి తోడుగా నిలిచేందుకే కానూరి ఆనందకుమారి మెమోరియల్, చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీరామచంద్రరావు యలమంచిలి అన్నారు. విద్యార్థులు, రైతులకు నిరంతరాయంగా సేవలందిస్తామని పేర్కొన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అమీర్‌పేట్ ధరంకరణ్ రోడ్డులోని మునిసిపల్ గ్రౌండ్‌లో ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన 30 మంది నిరుపేద రైతులకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున చెక్కులు అందజేశారు. శ్రీభగవాన్ మహవీర్ వికలాంగ్ సహాయత సమితి సహకారంతో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది దివ్యాంగులకు ట్రస్టు తరఫున కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. శ్రీరామచంద్రరావు మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో భాగస్వాములమయ్యేందుకే ట్రస్టును ఏర్పాటు చేశామని చెప్పారు. ట్రస్టీ డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ.. తాను లండన్‌లో వైద్యురాలిగా, హైదరాబాద్‌లో చెల్లి రాగిణి ఐటీ సెక్టార్‌లో పనిచేస్తున్నామని.. తాము సంపాదించిన దానిలో 90% పేదలకు సాయం చేసేందుకు వెచ్చిస్తున్నామన్నారు. తెలంగాణ, ఏపీలో ఆత్మహత్యలు చేసుకున్న 89 మంది రైతుల కుటుంబాలకు, నిరుపేద అన్నదాతలకు 2016లో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం చేసి, అండగా నిలిచామన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 174 మంది పిల్లలను చదివిస్తున్నామని, భవిష్యత్‌లోనూ ట్రస్టు తరఫున మరింత మందికి సాయం చేస్తామని పేర్కొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

తమ సమితి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోని 60 వేల మంది వికలాంగులకు జైపూర్ కృత్రిమ అవయవాలను అందజేశామని శ్రీభగవాన్ మహవీర్ వికలాంగ్ సహాయత సమితి ప్రెసిడెంట్ శర్మ అన్నారు. 2004లో కింగ్ కోఠి ఆస్పత్రిలో సంస్థను ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ 10-12 మందికి ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కానూరి ఆనంద కుమారి ట్రస్టు తరఫున ఆదివారం 100 మందికి కృత్రిమ అవయవాలను అందజేశామన్నారు.



ఎగ్జిబిషన్‌లో సందర్శకుల సందడి

వెడ్డింగ్ పాపప్ షాప్ ఎగ్జిబిషన్‌కు భారీ స్పందన

వన్‌టౌన్, జనవరి 28: బందరు రోడ్డులోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వెడ్డింగ్ పాపప్ షాప్ ఎగ్జిబిషన్‌కు భారీ స్పందన వస్తోంది. రానున్న వివాహాలు, శుభకార్యాల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ బ్రైడల్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం ప్రారంభించారు. 75కు పైగా లగ్జరీ బ్రాండ్ల స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. గోల్డ్, డైమండ్ ఆభరణాలు, చీరలు, డ్రెస్సులు, డిజైన్ వేర్, క్లాతింగ్ మెటీరియల్, ఫ్యాషన్ వస్తువులు, గ్రాము జ్యూయలరీ అందుబాటులో ఉన్నట్టు నిర్వాహకులు అంజలి, భవ్య తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు.



తెలుగు రాష్ట్రాల నుంచి ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన ఏకైక మహిళ దాలిపర్తి ఉమామహేశ్వరి. అంతేకాదు, ఆమె ఒకే ఒక్క సంస్కృత భాగవతారిణి కూడా. మన సంప్రదాయ కళారూపమైన హరికథను హార్వర్డ్ యూనివర్సిటీ వరకు తీసుకెళ్లారు. ఆమె కథాగానానికి దేశదేశాలలో అభిమానులున్నారు. ఇప్పుడు అయోధ్య రామాలయ ట్రస్ట్ నుంచి ఆహ్వానాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి 'నవ్య'తో ముచ్చటించారు.

ఏకైక సంస్కృత భాగవతారిణి

పద్మశ్రీ పురస్కారం నన్ను వరించిందనే ఆనందం కంటే హరికథా ప్రక్రియకు సముచిత గౌరవం దక్కిందనే సంతోషమే నాకు ఎక్కువగా ఉంది. నేను పుట్టి, పెరిగిందంతా కృష్ణా జిల్లా మచిలీపట్నంలో అయినా, నా పేరును పద్మ పురస్కారానికి ప్రతిపాదించింది మాత్రం తెలంగాణ ప్రభుత్వమే.! మాది సంగీత విద్వాంసుల కుటుంబం. మా చిన్నతాతయ్య దాలిపర్తి పిచ్చాహరి శాస్త్రీయ సంగీత విద్వాంసుడు. ఆయన గాన ప్రతిభకు మెచ్చిన చల్లపల్లి రాజా గండపెండేరంతో సత్కరించి, అంబారీ ఉత్సవం చేయించారు. మా నాన్న లాలాజీరావు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ఆస్థాన నాదస్వర విద్వాంసుడిగా ముప్పై ఏళ్లు సేవలందించారు. మా అమ్మ సరోజనీ కూడా సంగీతాభిమాని కావడంతో నాకు చిన్నతనం నుంచి కర్ణాటక సంగీతంలో శిక్షణ ఇప్పించారు. ఒకవైపు స్కూలుకెళుతూనే మరోవైపు సందర్భానుసారం కొన్ని వేదికల మీద పాటలు పాడుతుండేదాన్ని. అలా ఓసారి కపిలేశ్వరపురం జమీందారు ఎస్బీకే సత్యనారాయణ సతీమణి రాజరాజేశ్వరీదేవి మచిలీపట్నంలోని తన పుట్టింటికి వచ్చినప్పుడు నా గాత్రం విన్నారు. మరుసటి రోజు నన్ను ఇంటికి పిలిపించి 'చక్కగా పాడుతున్నావు. హరికథ నేర్చుకో! ఏడాది కిందట కపిలేశ్వరపురంలో మా మామగారిపేరుతో హరికథా పాఠశాల ప్రారంభించాం. ఆడపిల్లలకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నాం. మంచి అవకాశం, కాదనకు' అన్నారు. అమ్మానాన్నను వదిలి వెళ్లడం ఇష్టంలేక మౌనంగా ఉన్నాను. కొద్దిరోజులకు రాణీగారి నుంచి మళ్లీ కబురు రావడంతో... చదువుకన్నా సంగీతంపట్ల నాకున్న శ్రద్ధను గమనించిన మా నాన్న నన్ను కపిలేశ్వరపురం తీసుకెళ్లి సర్వారాయ హరికథా పాఠశాలలో చేర్పించారు. అలా నా 14వ ఏట అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు సంప్రదాయంలో విద్వాంసుల బోధనలతో హరికథ నేర్చుకోవడం ప్రారంభించాను.

విశ్వవిద్యాలయాల్లో ప్రదర్శనలు

ఉజ్జయినిలోని మహాకవి కాళిదాసు అకాడమీ సంగీత, సాహిత్య, కళా ప్రదర్శనకు కపిలేశ్వరపురం రాజా ఎస్బీకే సత్యనారాయణ మా పాఠశాల నుంచి నన్ను ఎంపిక చేశారు. అదీ నటరాజ రామకృష్ణ సలహా మేరకు. తెలుగు కన్నా సంస్కృతంలో హరికథాగానం ద్వారా మరింత ఎక్కువ మందికి ఈ కళ చేరువవుతుందని రాజాగారు సూచించారు. ఆయన విజ్ఞాపన మేరకు నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు 'కుమార సంభవం' సంస్కృత కావ్యాన్ని హరికథా ప్రక్రియలోకి మార్చారు. అది సాధన చేస్తున్న సమయంలోనే హైదరాబాద్‌లోని ప్రఖ్యాత నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణ దగ్గర కొన్ని శ్లోకాలకు, కీర్తనలకు అభినయం నేర్చుకున్నాను. అనంతరం సర్వారాయ వేద పాఠశాల ప్రిన్సిపాల్ బాలగంగాధర శర్మ, దివాకర్ల వేంకటావధాని తదితర పెద్దల ముందు వేర్వేరుగా ప్రదర్శనలిచ్చాను. వారంతా ఆమోదించిన తర్వాతనే కాళిదాస సమారోహంలో ప్రపంచ ప్రఖ్యాత సంస్కృత పండితుల సమక్షంలో సంస్కృత హరికథాగానం చేశాను. అది చూసి ముగ్ధులైన నిర్వాహకులు ప్రతి ఏటా ఉజ్జయినిలో ఒక ప్రదర్శన ఇవ్వాలి అని నన్ను కోరారు. తర్వాత దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి ఆహ్వానాలు వచ్చాయి. అలా అన్ని యూనివర్సిటీలలో హరికథా ప్రదర్శనలిచ్చాను. వాల్మీకి 'రామాయణం', 'మాళవికాగ్నిమిత్రం' 'అభిజ్ఞాన శాకుంతలం', 'మేఘసందేశం', 'రఘువంశం', 'భక్త జయదేవ' ఇలా పది సంస్కృత గాథలను నేర్చుకొని నలభై ఏళ్లుగా హరికథాగానం చేస్తున్నాను. హరికథా పాఠశాలలో మాకు తెలుగు, సంగీతంతో పాటు సంస్కృతంలోని పంచకావ్యాలు, హితోపదేశ శ్లోకాలు బోధిస్తారు. మా గురువుల బోధనే సంస్కృత హరికథాగానంలో నన్ను మేటిగా నిలిపింది.

కులాంతర వివాహం...

కేవలం ప్రవచనంతో కథాగానం రక్తికట్టదు కనుక ఆంధ్ర నాట్యం కూడా నేర్చుకోవాలి అని నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణ ఆదేశించడంతో మళ్లీ హైదరాబాద్ వచ్చాను. ఆయన దగ్గర శిక్షణ పొందుతున్న సమయంలోనే కళా కృష్ణతో పరిచయం ఏర్పడింది. ఒకరోజు ఆయన నా ముందు పెళ్లి ప్రతిపాదన పెట్టారు. మా ఇంట్లో వాళ్లతోనూ కృష్ణ మాట్లాడారు. కళాకారుడితో జీవితం పంచుకుంటే నీ విద్యకూడా శాశ్వతంగా నిలుస్తోంది అని రాజరాజేశ్వరమ్మ దీవించారు. మా పెద్దలు కూడా అంగీకరించడంతో వివాహం చేసుకున్నాం. ఆయనది కరీంనగర్ జిల్లా బెజ్జంకి. మాది కులాంతర వివాహం. మాకు ఇద్దరు పిల్లలు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉద్యోగం వచ్చినా, నన్ను ఇంతలా తీర్చిదిద్దిన నా మాతృసంస్థకు సేవ చేయాలి అనే ఉద్దేశంతో ఆ అవకాశాన్ని వదిలేశాను. రెండు నెలలకు ఒకసారి సర్వారాయ పాఠశాలలో పదిరోజుల పాటు తరగతులు తీసుకుంటాను. కపిలేశ్వరపురం జమీందారీ దంపతులు నన్ను సొంత బిడ్డలా ఆదరించారు. నన్ను కూడా దివాణంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిగా చూసుకున్నారు. అలాంటి మహానుభావుల ఆర్థిక తోడ్పాటు వల్లే ఇంకా కళలు వర్ధిల్లుతున్నాయి.

అదీ హరికథకున్న జనాదరణ...

మచిలీపట్నం కళలకు నిలయం. నా చిన్నతనంలో అమ్మతో కలిసి ఎన్నోసార్లు హరికథా కాలక్షేపానికి వెళ్లాను. హరికథకులుగా ప్రఖ్యాతిగాంచిన కోట సచ్చిదానంద శాస్త్రి 'మహాభారతం', అమ్ముల విశ్వనాథం 'రామాయణం', పొడుగు పాండురంగదాసు 'బ్రహ్మంగారి జీవిత చరిత్ర'... ఇలా ఒక్కొక్క విద్వాంసుడు ఒక్కో వీధిలో నలభై రోజుల పాటు ఆనాడు హరికథలు చెబుతుంటే, సభా ప్రాంగణాలన్నీ వందలమంది జనంతో కిటకిటలాడేవి. సచ్చిదానంద శాస్త్రి హరికథ చెబుతున్నన్ని రోజులు బందరులోని సినిమా థియేటర్లు జనంలేక వెలవెలబోయేవి. దాంతో యాజమాన్యం షో సమయం మార్చిన రోజులున్నాయి. అదీ ఆనాడు హరికథకున్న జనాదరణ. అలాంటిది ఇప్పుడు టెలివిజన్, యూట్యూబ్ మాధ్యమాలు వచ్చిన తర్వాత జనం సంప్రదాయ కళలపట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయితే, కొందరు వ్యక్తిగత చొరవతో పండుగలు, ప్రత్యేక సందర్భాలలో హరికథా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. మాలాంటి కళాకారులను ఆహ్వానిస్తున్నారు. అంతవరకు సంతోషం.

విదేశాల్లో హరికథా ప్రదర్శన

హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మైఖేల్ విజెల్ 1993 నాటి ఇంటర్నేషనల్ వేదిక్ కాన్ఫరెన్స్‌కు ముందు సర్వారాయ వేద పాఠశాల ప్రిన్సిపాల్ బాలగంగాధరశర్మను కలవడానికి కపిలేశ్వరపురం వచ్చారు. అప్పుడు ఆయన నా హరికథా ప్రదర్శన చూసి మెచ్చుకున్నారు. ఈ ప్రక్రియను తన దేశవాసులకు చూపించాలి అని నన్ను అమెరికాకు ఆహ్వానించారు. అలా న్యూయార్క్ లోని అంతర్జాతీయ వేదిక్ సదస్సులో 'అభిజ్ఞాన శాకుంతలం' ప్రదర్శించాను. అదే సమాయంలో హార్వర్డ్ యూనివర్సిటీలో 'కుమార సంభవం', తర్వాత లండన్‌లో 'సీతాకల్యాణం' హరికథాగానం చేశాను. దేశదేశాలలో ఇప్పటివరకు 600కుపైగా సంస్కృత హరికథలు, 800కుపైగా తెలుగు హరికథలు ప్రదర్శించాను.

అయోధ్య నుంచి ఆహ్వానం

చేత చిరతలు పట్టి, కాలికి గజ్జెలు కట్టి... నోటితో వాచికం చెబుతూ, మృదుమధురమైన గానమాలపిస్తూ, ముఖంలో సాత్వికం, చేతులతో అభినయం పలికిస్తూ... లయబద్ధంగా కాలితో నాట్యమాడుతూ జనరంజకంగా కథాగానం చేయడం తెలుగువారి సంప్రదాయ హరికథా ప్రదర్శనలోని ప్రత్యేకత. ఇది సంగీత, సాహిత్య, అభినయాల మేలు కలయిక. వయొలిన్, మృదంగం తోడు వాయిద్యాలుంటాయి. అదే తమిళుల కథాకాలక్షేపం సంగీత ప్రధానంగా సాగితే, కన్నడ హరికథ ప్రవచనానికి, మరాఠికథాగానం కీర్తనలు ప్రధానంగా ఉంటాయి. ఉత్తరాదివారు సైతం మన హరికథాగానాన్ని అమితంగా ఇష్టపడతారు. అయోధ్య రామాలయం ట్రస్ట్ నుంచి నాకు ఆహ్వానం వచ్చింది. త్వరలో బాలక్‌రామ్ సన్నిధిలో హరికథాప్రదర్శన ఇవ్వబోతున్నందుకు ఆనందంగా ఉంది. నా జీవితకథ హరికథ వేర్వేరు కాదు. నా జీవితమంతా కళాసేవ చేస్తూ గడిపేయాలని కోరిక. కళారాధకులు ముందుకొస్తే కొత్తతరం హరికథకులను తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

• సాంత్వన్, ఫొటోలు: జ్వాలా కోటేశ్

అభినవ మాతంగి

ఒక ఆధ్యాత్మిక సదస్సులో నా హరికథాగానం విన్న కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి నాకు 'అభినవ మాతంగి' బిరుదును ప్రదానం చేశారు. పదేళ్ల తర్వాత స్వామివారి దర్శనార్థం మళ్లీ కంచికి వెళ్లినప్పుడు పవిత్ర రాగి ఫలకాన్ని నా చేతుల్లో పెట్టి 'జీవితమంతా భక్తిమార్గంలో నడువు' అంటూ ఆశీర్వదించారు. మహాస్వామి దీవెనలు అందుకోవడం నా జీవితంలో మరిచిపోలేని ఒక మధురానుభూతి. నీలం సంజీవరెడ్డి, జ్ఞానిజైల్ సింగ్, శంకర్ దయాళ్ శర్మ... రాష్ట్రపతిగా సేవలందించిన ఈ ముగ్గురు మహనీయుల సమక్షంలో హరికథ చెప్పడం నాకు లభించిన అరుదైన అవకాశం. వారి ప్రశంసలు అందుకోవడం నా అదృష్టం. 'ఏకైక సంస్కృత హరికథా కళాకారిణి' అవార్డుతో జ్ఞానిజైల్ సింగ్ నన్ను సత్కరించారు. బద్రీనాథ్‌లో 'ఆదిశంకరాచార్య జీవితం' హరికథను విన్న ఆనాటి ప్రధాని రాజీవ్‌గాంధీ 'అద్భుతం' అంటూ నన్ను ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును గతేడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా అందుకోవడం నాకు దక్కిన మరొక గౌరవం. రామకృష్ణ పరమహంస, పొట్టిశ్రీరాములు, రమణమహర్షి లాంటి వైతాళికుల జీవిత చరిత్రలను హరికథగా కంపోజ్ చేసి ప్రదర్శించాను.

హరికథాకారిణులు...



సినీనటుడు రావుగోపాలరావు గారి సతీమణి రావు కమలకుమారి తెలుగులో చాలా మధురంగా హరికథ చెప్పేవారు. ఆమెను ఒడిశా కథారాణి అనేవారంతా.! ఇందిరా బాల, శార్వాణి భాగవతారిణి లాంటి కొందరు అద్భుతంగా హరికథాగానం చేసి ప్రేక్షకుల అభిమానం పొందారు. నా సమకాలీనుల్లోనూ ఆడవాళ్లు చాలామంది హరికథాగానం చేస్తున్నారు. అయితే, ఈ మధ్యకాలంలో ఈ విద్య నేర్చుకోవడానికి ఎక్కువమంది మక్కువ చూపడం లేదు. కరోనా తర్వాత కొత్తగా వస్తున్నవాళ్ల సంఖ్య మరీ తగ్గింది. శాస్త్రీయ నృత్యం, సంగీతం నేర్చుకోడానికి ఆసక్తి చూపినంతగా హరికథలాంటి సంప్రదాయ కళమీద పెద్దగా ఎవరూ శ్రద్ధ పెట్టడం లేదు.

నవతరానికి స్ఫూర్తిమంత్రం

పదిహేనేళ్ల వయసులోనే పెళ్లి... భర్త... అత్తింటి బాధ్యతలు. ఇవేవీ ఆమె ఎదుగుదలకు అడ్డు కాలేదు. ఆత్మవిశ్వాసం అండగా... పట్టుదలే పెట్టుబడిగా... ఉన్నత ఆశయంతో అడుగులు వేసిన ఆమె... నేడు వేలమందికి ఉద్యోగాలిస్తున్నారు. మహిళల్లో చైతన్యం రగిలించి... వారిని ఉన్నత శిఖరాల వైపు నడిపిస్తున్నారు. వాణిజ్యం, పరిశ్రమల రంగాల్లో అలుపెరుగని కృషికి గుర్తింపుగా కేంద్రం ఆమెకు 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త... సామాజిక కార్యకర్త... శశి సోనీ కథ ఇది...

స్ఫూర్తి



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' పురస్కారాల్లో నలుగురు పారిశ్రామికవేత్తలు ఉన్నారు. వారిలో ఒకరు శశి సోనీ. బెంగళూరులోని ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ కంపెనీ 'ఐజ్మో' వ్యవస్థాపకురాలు ఆమె. 1996లో నెలకొల్పిన ఈ కంపెనీకి అన్నీ తానై నడిపిస్తున్నారు శశి. నేడు ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఆటోమొబైల్ సొల్యూషన్ ప్రొవైడర్‌గా దాన్ని తీర్చిదిద్దారు. వాణిజ్య, పారిశ్రామిక రంగాలను ప్రభావితం చేసిన మహిళగా ఆమె పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. 1971లో కేవలం పది వేల రూపాయలతో ముంబయిలో 'డీప్ ట్రాన్స్‌పోర్ట్' పేరిట వ్యాపార రంగంలోకి ప్రవేశించిన శశి... ఆ తరువాత అంచెలంచెలుగా ఎదిగారు. ఆ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఒకే ఒక్క కారుతో మొదలై... నాలుగేళ్లలో 10 కార్లు, 7 టెంపోలకు విస్తరించింది. పాకిస్తాన్‌లోని లాహోర్‌లో పుట్టిన శశి... కెరీర్ ఆరంభంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. అయితే



ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ వదిలేసి 1981లో మైసూరులో 'డీప్ ఆక్సిజన్ ప్రైవేట్ లిమిటెడ్' స్థాపించారు. ఇక అక్కడి నుంచి ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. కెరీర్ రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోయింది.

పెళ్లయినా...

సంప్రదాయ కుటుంబంలో పుట్టిన శశికి చిన్న వయసులోనే ఇంట్లోవాళ్లు పెళ్లి చేశారు. 'అప్పుడు నాకు పదిహేనేళ్లు. ఢిల్లీ స్కూల్లో చదువుకొంటున్నా. ఆ సమయంలో మా అమ్మ నాకు పెళ్లి చేసింది. కానీ పెళ్లి తరువాత నేను చదువు ఆపదలుచుకోలేదు. మా అత్తమామలది సంప్రదాయ కుటుంబం. ఇంట్లో ఎడతెరిపి లేని పని. అత్తమామల బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత నాదే. దేశం విడిపోయాక పాకిస్తాన్‌లోని వారి ఆస్తులన్నీ పోయాయి. దీంతో మావారి సంపాదన మీద కుటుంబమంతా ఆధారపడాల్సి వచ్చింది. ఆయన స్టీల్ ప్లాంట్‌లో పని చేసేవారు. వీటన్నిటి నేపథ్యంలో నాకంటూ ఒక లక్ష్యం లేకపోతే భవిష్యత్తులో ఒడుదొడుకులు తప్పవనిపించింది. ఏంచేయాలని ఆలోచిస్తుంటే... మా సోదరుడు గుర్తుకువచ్చాడు. తను ముంబయిలో వ్యాపారవేత్త. మమ్మల్ని అక్కడకు రమ్మన్నాడు. అయితే మావారిని ఉద్యోగం మాన్పించి, తీసుకువెళ్లాలని నేను అనుకోలేదు. ఆయన్ను ఒప్పించి, నా పిల్లల్ని తీసుకుని ముంబయికి వెళ్లాను. మా సోదరుడికి పెట్రోలు బంకు, చిన్న గ్యారేజీ ఉండేవి. మా మామయ్య ఒకరు ఆ పెట్రోలు బంకు నిర్వహించేవారు. అందులో లెక్కలు చూడమని ఆయన నన్ను అడిగారు. నేను రాసిన అక్కౌంట్ బుక్స్ చూసిన సీనియర్ అక్కౌంటెంట్... నా వర్క్ సీఏలా ఉందన్నారు. ఇలా అందరి ప్రోత్సాహంతో వర్క్‌షాప్ పర్యవేక్షణ కూడా మొదలుపెట్టాను. అక్కడ అనుభవం, పరిచయాలు ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ పెట్టడానికి ప్రేరణనిచ్చాయి. అలా ముప్పై ఏళ్ల వయసులో బిజినెస్ మొదలుపెట్టాను. తరువాత కొన్నేళ్లకు మావారు కూడా ముంబయిలోని ముకుంద్ స్టీల్‌కు మారారు' అంటూ నాటి రోజులు గుర్తు చేసుకున్నారు శశి.

లిస్టెడ్ కంపెనీగా...

భారత పారిశ్రామిక రంగానికి చేస్తున్న కృషికి గానూ 1990లో ప్రతిష్ఠాత్మక 'మహిళా గౌరవ్ పురస్కార్' అందుకున్నారు శశి. 'డీప్ ఆక్సిజన్' కంపెనీ విజయవంతం కావడంతో శశి మరింత దూకుడు పెంచారు. 1995 వరకు ఆ కంపెనీ చైర్‌పర్సన్‌గా ఉన్న ఆమె... ఆ మరుసటి ఏడాదే 'ఐజ్మో'కు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆసియా, అమెరికా, ఐరోపా ఖండాల్లో ఈ కంపెనీ విస్తరించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టెడ్ కంపెనీగా అవతరించింది. దీని ద్వారా వేల మందికి ఆమె ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

మహిళా సాధికారతకు...

వ్యాపార కార్యకలాపాల్లో క్షణం తీరిక లేకుండా గడిపే శశి సోనీ... సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలని తపించారు. అందులో భాగంగానే మహిళా సాధికారత దిశగా అడుగులు వేశారు. వికలాంగులకు అండగా నిలబడ్డారు. 'డీప్ పబ్లిక్ సర్వీస్ కమిటీ' సభ్యురాలిగా మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి పూనుకున్నారు. వారి కోసం పింఛను పథకాలు తీసుకువచ్చారు. నిధులు సేకరించి, వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిరంతర కృషి చేస్తున్నారు. 'ఆలిండియా ఇండస్ట్రియల్ గ్యాస్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్', 'డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ డెవలప్‌మెంట్ మేనేజింగ్ కమిటీ'ల్లో సభ్యురాలిగా ఉన్నారు. తన సంస్థలో ఉద్యోగులను కుటుంబ సభ్యుల్లా భావించే శశి... వారి సంక్షేమం కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.

ప్రతిష్ఠాత్మక పురస్కారం...

పారిశ్రామిక రంగంలో శశి సోనీ చేస్తున్న విశేష కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమెకు 'పద్మశ్రీ' పురస్కారాన్ని ప్రకటించింది. 'ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది. స్వయంశక్తితో ఎదిగిన ఒక మహిళగా ఎంతో గర్వంగా భావిస్తున్నా. నా ఈ సుదీర్ఘ ప్రయాణం కొందరికైనా ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నా' అంటున్న శశి సోనీ వయసు ఎనభై ఐదు. కానీ ఇప్పటికీ ఆమెలో అదే ఉత్సాహం... పని పట్ల అంకితభావం. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని ఆమె ఎదిగిన క్రమం... నవతరానికి స్ఫూర్తిమంత్రం.

నవ్య | చిత్రజ్యోతి

మానవస్పర్శ భరించలేని అఘోరాగా..

విశ్వక్‌సేన్ కథానాయకునిగా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'గామి'. కార్తీక్ శబరీశ్ నిర్మిస్తున్న ఈ అడ్వంచరస్ డ్రామాకు చెందిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. అఘోరాలా ఉన్న విశ్వక్‌సేన్‌ని చుట్టూ ఉన్న చాలామంది అఘోరాలు తాకటానికి ప్రయత్నిస్తున్నట్టు ఈ పోస్టర్ ఉంది. పోస్టర్ లాగే పాత్ర కూడా కొత్తగా ఉంటుందని మేకర్స్ చెబు



తున్నారు. ఇందులో విశ్వక్‌సేన్ శంకర్ అనే అఘోరాగా కనిపించనున్నారని, మానవస్పర్శను భరించలేని రేర్ కండీషన్ ఆ పాత్రకు ఉంటుందని, సంఘర్షణలతో కూడుకున్న పాత్ర ఇదని మేకర్స్ పేర్కొన్నారు. ఇంకా ఎన్నో ప్రత్యేకతలతో రూపొందుతోన్న చిత్రమిదని, ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలో రివీల్ చేస్తామని మేకర్స్ తెలిపారు. చాందిని చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎం.జి.అభినయ, హారిక, మహ్మద్ సమద్ ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి కెమెరా విశ్వనాథరెడ్డి, రాంపీ నందిగాం, సంగీతం: నరేశ్ కుమరన్.



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ నిర్మాతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను కలిసిన వారిలో దిల్‌రాజు, స్రవంతి రవికిశోర్, సునీల్ నారంగ్, యార్లగడ్డ సుప్రియ, వి.దామోదరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది

కౌశిక్ భీమిడి



'ఒకరోజు మహాభారతం చదువుతుంటే అందులో ఉన్న చాలా శాపాల గురించి తెలిసింది. అటువంటి శాపాన్ని ఇప్పటి జనరేషన్ కుర్రాడు ఎదుర్కొంటే ఎలా ఉంటుందన్న కాన్సెప్ట్‌తో 'హ్యాపీ ఎండింగ్' కథ మొదలైంది' అన్నారు దర్శకుడు కౌశిక్ భీమిడి. యశ్ పూరి హీరోగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. యోగేశ్ కుమార్, సంజయ్‌రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. విడుదల సందర్భంగా దర్శకుడు మీడియాతో ముచ్చటిస్తూ 'పురాణాల నుంచి తీసుకున్న అంశం కనుక ట్రీట్‌మెంట్ మోడరన్‌గా ఉండాలనుకున్నా. 'వికీ డోనర్' వంటి చిత్రాలు ఐడియా పరంగా అడల్ట్ ఓరియంటెడ్‌గా ఉన్నా, మా మూవీ ట్రీట్‌మెంట్ మాత్రం అందరూ చూసేలా కన్విన్సింగ్‌గా ఉంటుంది.' అని కౌశిక్ చెప్పారు. 'హ్యాపీ ఎండింగ్' స్క్రిప్ట్‌కు యశ్, అపూర్వ చక్కగా సూట్ అయ్యారు. వాళ్ల నటన కూడా ఫ్రెష్‌గా ఉంటుంది. దర్శకుడిగా నాకు ఇది తొలి సినిమా కనుక టెక్నీషియన్లు కూడా కొత్త వాళ్లు ఉంటే నాకు కంఫర్ట్‌గా ఉంటుందనుకున్నాను. మంచి టీమ్ సెట్ అయింది. సినిమా బిగినింగ్‌లోనే హీరోకు ఉన్న శాపం గురించి రివీల్ చేస్తాం. పతాక సన్నివేశాల్లో శాపవిముక్తితో హ్యాపీగా కథ ముగుస్తుంది. అసలు అతనికి శాపం ఉందా లేదా అన్నది చిన్న రీకాలింగ్ సీన్స్‌తో సైకలాజికల్ డ్రైవ్‌తో చూపించాం. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కనుక థియేటర్లలోనే చూడాలని నా మనవి' అన్నారాయన.

ఈ అద్భుత విజయం ప్రేక్షకులందరిదీ

తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ రూపొందించిన 'హను-మాన్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా ఇటీవల నిర్మాత కె.నిరంజన్‌రెడ్డి గ్రాటిట్యూట్ మీట్ నిర్వహించారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ 'అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాను తీసుకెళ్లడానికి సహకరించిన నిర్మాత నిరంజన్‌రెడ్డిగారికి కృతజ్ఞతలు. తేజ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. ఈ సినిమాతో అతను సూపర్ హీరో అయ్యాడు. అలాగే అమృత చక్కని నటన ప్రదర్శించింది. ఇక వరలక్ష్మిగారు సంక్రాంతికి లక్కీ-ఛార్మ్. ఆమెతో వర్క్ చేయడం మంచి అనుభూతి. అలాగే రవితేజగారు మా సినిమాలో భాగం అవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. కోటి పాత్రకు ఆయన ఇచ్చిన వాయిస్‌నే ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు. రవితేజగారు ఒప్పుకొంటే ఈ యూనివర్స్‌లో ఒక సినిమా చేయాలనుకుంటున్నాను' అంటూ



చిత్రానికి పని చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా అభినందనలు తెలిపారు. 'జై హనుమాన్' చిత్రం 'హను-మాన్'కి వంద రెట్లు ఉండబోతుందని చెప్పారు. 'ప్రేక్షకులు మా వెనుక నిలబడ్డారు కనుకే మేం ఈ రోజున ఈ వేదికపై ఉన్నాం. మమ్మల్ని బలంగా నమ్మి అండగా నిలిచిన నిర్మాత నిరంజన్‌రెడ్డిగారికి ధన్యవాదాలు. ఇకపై చేసే చిత్రాలు కూడా ఇంతే కష్టపడి ప్రేక్షకులకు నచ్చేలా చేస్తాం.' అన్నారు హీరో తేజ. 'హను-మాన్'లో హనుమాన్, మ్యాన్ ఎలా ఉన్నారో ఇక్కడ తేజ, ప్రశాంత్ ఉన్నారని అభినందిచారు వరలక్ష్మి శరత్‌కుమార్. ఇంత గొప్ప విజయం అందించిన ప్రేక్షకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. నిర్మాత నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ 'నేను, దర్శకుడు ప్రశాంత్ ఏదైతే నమ్మి మూడేళ్లు హార్డ్ వర్క్ చేశామో ప్రేక్షకుల ఆదరణతో అది సాధించాం. ఈ విజయం వారందరిది. తేజ లేకపోతే ఈ సినిమా లేదు. అలాగే ప్రశాంత్‌కు తన బలం తెలీదు. 'హను-మాన్'లో చూసింది కేవలం ఒక్క శాతమే.. ఇంకా 99 శాతం బయటకు రావాలి' అన్నారు.

గేమ్ ఆన్ రియలిస్టిక్‌గా ఉంటుంది

దయానంద్



'చనిపోదాం అనుకొనే వ్యక్తి జీవితంలోకి ఒక గేమ్ ప్రవేశించడం వల్ల అతడి జీవితంలో వచ్చిన మార్పు ఏంటి? అనే పాయింట్‌తో 'గేమ్ ఆన్' చిత్రాన్ని రూపొందించాం. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలా కాకుండా డిఫరెంట్‌గా ప్రయత్నించాం. యూత్‌ను ఎట్రాక్ట్ చేస్తూనే ఫ్యామిలీ ఎమోషన్స్ కలిగి ఉంటుందీ చిత్రం' అన్నారు దర్శకుడు దయానంద్. గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. రవి కస్తూరి నిర్మాత. సినిమా చాలా రియలిస్టిక్‌గా సాగుతుందనీ, ప్రతి ఒక్కరూ చూడాలనీ దయానంద్ కోరారు.

'అంబాజీ..'లో కొత్తదనం ఆకట్టుకుంటుంది

-ధీరజ్ మొగిలినేని



సుహాస్ హీరోగా నటించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మించారు. ఆయన మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడిస్తూ 'ఈ సినిమా అనౌన్స్ చేసినప్పుడు అంతా కామెడీ మూవీ అనుకున్నారు. పాటలు విడుదలయ్యాక లవ్ స్టోరీ కావొచ్చు అనుకున్నారు. కానీ ట్రైలర్ చూశాక సీరియస్ సబ్జెక్ట్ అని అందరికీ అర్థమైంది. సినిమాలో కొత్తదనం ఆకట్టుకుంటుంది. అలాగే సుహాస్ పెర్ఫార్మెన్స్ ఎంత బాగుంటుందో ఈ సినిమాలో చూస్తారు' అని తెలిపారు. 'ఒక ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనను అలాగే తెరకెక్కించాం. ఇందులో ప్రేమ ఒక అంశం మాత్రమే' అన్నారాయన. 'ప్రస్తుతం రష్మిక హీరోయిన్‌గా 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం చేస్తున్నాం. అది 40 శాతం పూర్తయింది. ఈ ఏడాదే విడుదల చేస్తాం. మరో మూడు ప్రాజెక్టులు సిద్ధం చేస్తున్నాం' అని ధీరజ్ వెల్లడించారు.

బిజినెస్

ఇల్లు పెద్దగా..



11 శాతం పెరిగిన సగటు ఫ్లాట్ విస్తీర్ణం

కస్టమర్ల అభిరుచికే బిల్డర్ల ప్రాధాన్యం

న్యూఢిల్లీ: మారిన కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా దేశంలోని ప్రధాన నగరాల్లో బిల్డర్లు పెద్ద ఇళ్ల నిర్మాణానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కారణంగా దేశంలోని ఏడు అగ్రశ్రేణి నగరాల్లో నిర్మాణం అయిన, నిర్మాణంలో ఉన్న ఫ్లాట్ల సగటు విస్తీర్ణం 2023 సంవత్సరంలో 11 శాతం పెరిగిందని అనరాక్ అధ్యయనంలో తేలింది. ఏడు నగరాల్లోని ప్రాథమిక రెసిడెన్షియల్ మార్కెట్లలో ఇళ్ల సరఫరా గురించి రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ అనరాక్ అధ్యయనం చేసింది. గత ఏడాది లగ్జరీ ఇళ్ల సరఫరా గణనీయంగా పెరిగిందని ఆ అధ్యయనంలో తేలింది. కొత్త ప్రాజెక్టుల్లో 23 శాతం లగ్జరీ శ్రేణిలోనే ఉన్నాయి. ఏడు ప్రధాన నరాల్లో ఫ్లాట్ సగటు విస్తీర్ణం 2022తో పోలిస్తే 1175 చదరపు అడుగుల నుంచి 1300 చదరపు అడుగులకు (ఎస్ఎఫ్టీ) పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. అయితే ముంబై మెట్రోపాలిటన్ రీజిన్ (ఎంఎంఆర్), కోల్కతా మాత్రం ఈ విషయంలో వెనుకబడి ఉన్నాయి. ఆ నగరాల్లో సగటు విస్తీర్ణం తగ్గింది. మిగతా నగరాలు ఢిల్లీ ఎన్సీఆర్, బెంగళూరు, హైదరాబాద్, పూణె, చెన్నైలలో మాత్రం విస్తీర్ణం పెరిగింది. అన్ని నగరాల్లోనూ ఫ్లాట్ల సగటు విస్తీర్ణం గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతూ వస్తోంది. ఇది 2019లో 1050 ఎస్ఎఫ్టీ ఉండగా 2020లో 1167 ఎస్ఎఫ్టీ, 2021లో 1170 ఎస్ఎఫ్టీకి చేరింది. ఈ 7 నగరాల్లోనూ పెరిగిన ఇళ్ల ధరల ప్రభావం డిమాండుపై ఏ మాత్రం లేదని అనరాక్ ఛైర్మన్ అనుజ్ పురి అన్నారు. వాస్తవానికి మహమ్మారి కాలంలో సువిశాలమైన ఫ్లాట్లకు డిమాండు పెరగడం మొదలయింది. ఆ తర్వాత గత మూడు సంవత్సరాల కాలంలో డిమాండు ఏ మాత్రం తగ్గకపోగా పెద్ద ఫ్లాట్ల కొనుగోలు ఒక అలవాటుగా మారిందని చెప్పారు.

హైదరాబాద్‌లోనే వైశాల్యం అధికం

ఫ్లాట్ల వైశాల్యం విషయంలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ 2022లో ఫ్లాట్ల సగటు వైశాల్యం 1775 ఎస్ఎఫ్టీ ఉండగా 2023లో అది 2300 ఎస్ఎఫ్టీకి పెరిగింది. అంటే వైశాల్యంలో వృద్ధి 30 శాతం ఉంది. దేశం మొత్తం మీద ఇంత విశాలమైన ఫ్లాట్లను కోరుకుంటున్నది హైదరాబాద్ వాసులే. అయితే ఫ్లాట్ల సగటు విస్తీర్ణం వృద్ధిలో మాత్రం ఢిల్లీ ఎన్సీఆర్ ప్రథమ స్థానంలో ఉంది. అక్కడ సగటు విస్తీర్ణం 2022తో పోల్చితే 37 శాతం పెరిగి 1375 ఎస్ఎఫ్టీ నుంచి 2023లో 1890 ఎస్ఎఫ్టీకి చేరింది.

25 రోజులు, రూ.24,734 కోట్లు

జనవరిలో ఎఫ్‌పీఐల అమ్మకాల హోరు

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో ఎఫ్‌పీఐలు మళ్లీ అమ్మకాల జోరు పెంచారు. డిసెంబరు నెలలో వారు భారత మార్కెట్లో రూ.66,134 కోట్ల నికర పెట్టుబడులు పెట్టగా ఈ నెల 25 నాటికి రూ.24,734 కోట్ల విలువైన షేర్లను తెగనమ్మేశారు. వీరితో పాటు రిటైల్, హైనెట్‌వర్త్ మదుపరులూ మిడ్ అండ్ స్మాల్ క్యాప్ స్టాక్స్‌ను అమ్మేస్తూ, మార్కెట్‌ను మరింత అనిశ్చితిలోకి నెట్టేస్తున్నారు. దీంతో గత రెండు వారాలుగా దేశీయ స్టాక్ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. ఎఫ్‌పీఐలు ఈ వారంలోనూ అమ్మకాల హోరు కొనసాగించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

ఎందుకంటే...: పదేళ్ల కాల పరిమితి ఉండే అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీరేట్లు తగ్గినట్టే తగ్గి, మళ్లీ 4.18 శాతానికి చేరాయి. దీంతో ఈ ఏడాది జూలై తర్వాత గానీ అమెరికా కేంద్రబ్యాంకు వడ్డీరేట్లు తగ్గించదని స్పష్టమవుతోంది. భారత్ వంటి వర్ధమాన దేశాల ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే, ఎఫ్‌పీఐలకు ప్రస్తుతం అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలు సురక్షితంగా, ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. దీంతో వారు ఇక్కడ ఈక్విటీ షేర్లను అమ్మి, ఆ మొత్తాన్ని అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో మదుపు చేస్తున్నారు. ఒకవేళ మన దేశంలో మదుపు చేయాల్సి వచ్చినా, కేంద్ర ప్రభుత్వ రుణ పత్రాల్లో మాత్రమే మదుపు చేస్తున్నారు. జనవరిలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరడంతో లాభాలస్వీకరణ అమ్మకాలూ ఇందుకు తోడయ్యాయి.

కస్టమర్ రేటింగ్‌లో లవ జోరు

న్యూఢిల్లీ: కస్టమర్ రేటింగ్‌లో దేశీయ స్మార్ట్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు లవ, క్యూబో అంతర్జాతీయ బ్రాండ్లతో పోటీ పడుతున్నాయి. మార్కెట్ అనాల్సిస్ కంపెనీ టెక్‌ఆర్క్ బ్రాండ్ ఆమోదనీయత నివేదికను విడుదల చేసింది. ఇ-కామర్స్ వేదికలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లపై 25 బ్రాండ్లకు చెందిన 35 విభిన్న ఉత్పత్తులపై డిసెంబరులో కస్టమర్లు ఇచ్చిన రేటింగ్ తీరుతెన్నులను ఈ సంస్థ అధ్యయనం చేసింది. అంతర్జాతీయ బ్రాండ్లయిన రియల్ మీ, రెడ్ మీ వంటివి పొందిన సగటు వెయిటెజ్ రేటింగ్ 4.3 ఉండగా లవ 4.2 రేటింగ్ సాధించింది. అంటే ఆ బ్రాండ్లకు గట్టి పోటీదారుగా మారింది. లవకు అత్యున్నత రేటింగ్ (4, 5) 90.2 శాతం ఉండగా గ్లోబల్ బ్రాండ్లకు అది 75.8 శాతం ఉంది. ఇక ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగంలో హీరో గ్రూప్ కంపెనీ క్యూబోను పరిగణనలోకి తీసుకుంది. పరిశ్రమ సగటు రేటింగ్ 4 ఉండగా క్యూబో 4.1 రేటింగ్ పొందింది.

ప్రముఖ బ్యాంకర్ రాణా తల్వార్ కన్నుమూత



న్యూఢిల్లీ: ప్రముఖ బ్యాంర్ రాణా తల్వార్ కన్ను మూశారు. ఆయన వయసు 76 సంవత్సరాలు. ఆయన స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌కు సారథ్యం వహించడం ద్వారా ఒక అంతర్జాతీయ బ్యాంకుకు సారథ్యం వహించిన తొలి భారతీయుడుగా గుర్తింపు పొందారు. ఆయన డీఎల్ఎఫ్ గ్రూప్ ఛైర్మన్ కేపీ సింగ్ అల్లుడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. డీఎల్ఎఫ్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న తల్వార్ శనివారం మరణించారని కంపెనీ ఒక రెగ్యులేటరీ ప్రకటనలో తెలిపింది.

21660 పైన బుల్లిష్

(జనవరి 29-ఫిబ్రవరి 2 తేదీల మధ్య వారానికి)

టెక్ వ్యూ



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 21353 (-224)

నిఫ్టీ గత వారం 21750-21137 పాయింట్ల మధ్యన కదలాడి 224 పాయింట్ల నష్టంతో 21353 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 21660 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21545, 21010, 19997, 19555 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 21750 **బ్రేక్‌డౌన్ స్థాయి**: 21050

నిరోధ స్థాయిలు: 21555, 21655, 21755 (21455 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 21155, 21055, 20955 (21255 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	540	విశాఖపట్నం	565
29 జనవరి		వరంగల్	542
చిత్తూరు	573		
గోదావరి	530	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	గోదావరి	111
వరంగల్	107	విజయవాడ	111
కరీంనగర్	107	గుంటూరు	112
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	112
కర్నూలు	107	చిత్తూరు	120
విశాఖపట్నం	108		

ఈ వారంలోనూ ఆటుపోట్లే

దేశీయ స్టాక్ మార్కెట్ గత రెండు వారాలుగా నష్టాల బాట పట్టింది. ఈ వారంలో కూడా సూచీలు తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మార్కెట్‌లో కొనసాగుతున్న బేరిష్‌నెస్, దిద్దుబాటు ఇందుకు కారణాలుగా చెప్పవచ్చు. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీకి ఈ వారం 21,000 పాయింట్ల వద్ద గట్టి మద్దతు కనిపిస్తోంది. మదుపరులు ఆకర్షణీయ ధరలో దొరుకుతున్న బ్యాంకింగ్, ఫార్మా, ఐటీ కంపెనీల షేర్లపై దృష్టి పెట్టడం మంచిది.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు

అంబుజా సిమెంట్స్: మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుంటాయన్న అంచనాతో ఈ కౌంటర్లో మూమెంటమ్ పెరుగుతోంది. గత వారం ఈ షేరు ధర ఏకంగా 6.2 శాతం పెరిగి రూ.560 వద్ద క్లోజైంది. రూ.625/660 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.550 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.530ని కచ్చితంగా స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సంవర్థన్ మదర్సన్ లిమిటెడ్ : ఈ కౌంటర్లో గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన అప్‌ట్రెండ్‌కు ఈ ఏడాది జూలైలో తెర పడింది. ఆ తర్వాత ఈ కౌంటర్లో మంచి కన్సాలిడేషన్ జరిగింది. మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుంటాయనే అంచనాతో ఈ కౌంటర్లో మళ్లీ అప్‌ట్రెండ్ కనిపిస్తోంది. గత వారం చివరి రెండు సెషన్స్‌లోనే ఈ కంపెనీ షేర్లు 12 శాతం పెరిగాయి. మదుపరులు రూ.140/165 టార్గెట్‌తో రూ.113-110 శ్రేణిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.104ని గట్టి స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

బజాజ్ ఆటో: దిద్దుబాటుకు తావు లేకుండా ఈ కౌంటర్‌లో సుదీర్ఘ అప్‌ట్రెండ్ కొనసాగుతోంది. దీంతో మదుపరులు ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకునేందుకు ఎగబడుతున్నారు. గురువారం ఏకంగా 5.33 శాతం లాభంతో రూ.7,210 వద్ద క్లోజైంది. రూ.7,850/7,950 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.7,400/7,509 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.7,250ని స్ట్రిక్ట్ స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా పవర్: సుదీర్ఘ కాలం దిద్దుబాటు తర్వాత టాటా పవర్ కౌంటర్లో స్థిరత్వం కనిపిస్తోంది. నిరుడు జూన్‌లో ప్రారంభమైన అప్‌ట్రెండ్ ఇంకా కొనసాగుతోంది. బడ్జెట్‌లో పునరుత్పాదక ఇంధనానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందనే అంచనాలూ ఇందుకు తోడయ్యాయి. శుక్రవారం రూ.365 వద్ద క్లోజైన ఈ కౌంటర్లో మదుపరులు రూ.390/410 టార్గెట్‌తో రూ.360 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.345ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పీఎన్‌బీ: ప్రస్తుతం ఈ బ్యాంకు షేర్లు పరుగులు పెడుతున్నాయి. జెఫరీస్ సంస్థ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేయడం, మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడం ఇందుకు ప్రధాన కారణాలు. గత వారం రూ.104 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.115/135 టార్గెట్‌తో రూ.103 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.95ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పాటించాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మద్దతు స్థాయిలకు చేరువలో...

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం బలమైన కరెక్షన్‌లో ప్రారంభమై కనిష్ఠ స్థాయిలకు చేరువలో బలహీనంగా ముగిసింది. కేవలం మూడు రోజులే జరిగిన ట్రేడింగ్‌లో సుమారు 220 పాయింట్ల మేరకు నష్టపోయింది. అయితే 21150 వద్ద మైనర్ రికవరీ కనిపించింది. గత నాలుగు వారాల్లో కరెక్షన్ ట్రెండ్‌లో కదలాడిన మార్కెట్ టెక్నికల్ ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకుంటోంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 21000 కన్నా పైనే ఉన్నందు వల్ల స్థూల ట్రెండ్ మాత్రం ఇప్పటికీ సానుకూలంగానే ఉంది. టెక్నికల్‌గా సాధారణ స్వల్పకాలిక కరెక్షన్ పూర్తయినట్టు కనిపిస్తోంది. మరోసారి స్వల్పకాలిక అప్‌ట్రెండ్ సంకేతాలు ఇవ్వాలంటే రాబోయే కొద్ది రోజుల్లో ప్రస్తుత స్థాయిల్లో బలం ప్రదర్శించాల్సి ఉంది. ప్రస్తుతం మైనర్ రికవరీని మరింతగా కొనసాగిస్తూ స్వల్పకాలిక నిరోధం 21500 వద్ద పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం 21500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన ప్రధాన స్వల్పకాలిక నిరోధం 21800. ఆ పైన నిలదొక్కుకుంటే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తుంది. మరో ప్రధాన నిరోధం 22100.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించి 21200 వద్ద విఫలమైతే మైనర్ అప్రమత్తతను సూచిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 20900. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింత కొనసాగవచ్చు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ ముందు వారంతో పోల్చితే గత వారం 1200 పాయింట్ల మేరకు, గత కొద్ది వారాల్లో 3800 పాయింట్ల మేరకు నష్టపోయింది. పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 45500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో నిరోధం 46200. బలహీనతలో పడి మద్దతు స్థాయి 44500 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా ఉంటుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 25 డిఎంఎ కన్నా స్వల్పంగా దిగువన ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ పునరుజ్జీవం సాధించాలి. అలాగే 50 డిఎంఎ కన్నా స్వల్పంగా పైన ఉంది. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ఇక్కడ కన్సాలిడేట్ కావాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	21440, 21500
మద్దతు	21340, 21270

www.sundartrends.in

స్పోర్ట్స్

అర్షిన్ అదిరే శతకం

అండర్ -19 వరల్డ్‌కప్

- నమన్‌కు 4 వికెట్లు
- యూఎస్‌పై భారత్ ఘన విజయం




బ్లూమ్‌ఫోంటీన్: అర్షిన్ కులకర్ణి (108) శతకంతోపాటు నమన్ తివారి (4/20) నాలుగు వికెట్లతో విజృంభించడంతో.. అండర్-19 వరల్డ్‌కప్ లీగ్ దశను భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. తొలి రెండు వన్డేల్లో నెగ్గి ఈపాటికే సూపర్-6 బెర్త్‌ను ఖరారు చేసుకొన్న భారత్.. వరుసగా మూడో విజయంతో గ్రూప్-ఎ టాపర్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మూడో, ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 201 పరుగుల తేడాతో అమెరికాను చిత్తు చేసింది. తొలుత భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 326 పరుగుల భారీస్కోరు చేసింది. కులకర్ణి, ముషీర్ (73) రెండో వికెట్‌కు 155 పరుగులు జోడించారు. కెప్టెన్ ఉదయ్ సహరన్ (35), ప్రియాన్షు (27), సచిన్ దాస్ (20) దూకుడుగా ఆడారు. ఛేదనలో యూఎస్ ఓవర్లన్నీ ఆడి 125/8 స్కోరు మాత్రమే చేసింది. ఇదే గ్రూప్ నుంచి బంగ్లాదేశ్, ఐర్లాండ్ సూపర్-6కు అర్హత సాధించాయి.

ఛత్తీస్‌గఢ్ లక్ష్యం 320

ఆంధ్రతో రంజీ

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర పట్టు బిగించింది. 169 పరుగుల ఆధిక్యంతో ఆటకు మూడో రోజు రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆంధ్ర 150/2 వద్ద డిక్లేర్ చేసింది. మొత్తం 320 పరుగుల భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది. కరణ్ షిండే (45), అశ్విన్ హెబ్బర్ (33 నాటౌట్), ప్రశాంత్ (32) వేగంగా ఆడారు. అనంతరం ఛేదనలో ఆదివారం ఆట ముగిసేసరికి ఛత్తీస్‌గఢ్ రెండో ఇన్నింగ్స్‌లో 20/0 స్కోరు చేసింది. విజయానికి ఇంకా 300 పరుగుల దూరంలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 118/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఛత్తీస్‌గఢ్ 262 రన్స్‌కు ఆలౌటైంది. పృథ్వీరాజ్ 3, గిరినాథ్, శశికాంత్, హెబ్బార్ తలో 2 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 431 పరుగులు చేసింది.

తీర్థు, రాముకు స్వర్ణాలు



తీర్థు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో విజయవాడ స్విమ్మర్ తీర్థు సామదేవ్ స్వర్ణం గెలిచాడు. ఆదివారం చెన్నైలో జరిగిన 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ కేటగిరీలో స్వర్ణం అందుకున్నాడు. బాలుర వాలీబాల్‌లో ఆంధ్రప్రదేశ్ కాంస్యం గెలిచింది. ఇక, ఆంధ్ర వెయిట్‌లిఫ్టర్లు రాము (89 కిలోలు) స్వర్ణం, ప్రేమ్‌సాగర్ (81 కిలోలు) కాంస్యం కొల్లగొట్టారు.

దివ్యాన్ష్ రికార్డు పసిడి

కైరో (ఈజిప్టు): భారత షూటర్ దివ్యాన్ష్‌సింగ్ పవార్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో ప్రపంచ రికార్డు ప్రదర్శనతో స్వర్ణం కొల్లగొట్టాడు. ఆదివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో దివ్యాన్ష్ 253.7 పాయింట్లు స్కోరు చేసి.. గతేడాది ఆసియా క్రీడల్లో షెంగ్ లియావో (చైనా) 253.3 స్కోరుతో నమోదుచేసిన వరల్డ్ రికార్డును బద్దలుకొట్టాడు.

‘హార్ట్’ చేశాడు

ఏడు వికెట్లతో భారత్‌ను దెబ్బకొట్టిన హార్ట్‌లీ

ఉప్పల్ టెస్టులో 28 పరుగులతో ఇంగ్లండ్ విజయం



టామ్ హార్ట్‌లీ (7/62)





గిల్ (0)


భారత అభిమానులకిది ఊహించని షాకే.. తొలి రెండు రోజులు అటు బంతి, ఇటు బ్యాటుతో మనోళ్లదే పూర్తి స్థాయిలో ఆధిపత్యం. దీనికితోడు 190 పరుగుల ఆధిక్యం. కానీ తర్వాత రెండు రోజుల్లో అంతా తారుమారు. ఒల్లీ పోప్ అసమాన బ్యాటింగ్‌తో 231 పరుగుల లక్ష్యం ఎదురైనా.. పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ కలిగిన టీమిండియాపై అంచనాలేమీ తగ్గలేదు. అయితే అరంగేట్ర లెఫ్టామ్ స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ ఏడు వికెట్ల మాయాజాలానికి జట్టులో ఒక్క బ్యాటర్ కూడా ఆకట్టుకోకపోవడంతో ఉప్పల్‌లో తొలిసారి భారత్ ఓడక తప్పలేదు. చివర్లో అశ్విన్, భరత్ పోరాడినా అది సరిపోలేదు.

హైదరాబాద్: ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్‌ను భారత్ ఓటమితో ఆరంభించింది. ఉప్పల్‌లో నాలుగో రోజైన ఆదివారమే ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ 28 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో 1-0తో సిరీస్‌లో ముందుకెళ్లింది. కెరీర్‌లో తొలి టెస్టు ఆడిన స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ (7/62) భారత్ విజయానికి అడ్డుగోడలా నిలిచాడు. ఆరంభంలోనే టాపార్డర్‌ను కుదురుకోనీయకుండా దెబ్బతీశాడు. అయితే చివర్లో టెయిలెండర్లు పోరాటం చూపారు. కానీ కీలక సమయంలో వారిని సైతం పెవిలియన్‌కు చేర్చిన హార్ట్‌లీ జట్టుకు అద్భుత విజయాన్నందించాడు. ఫలితంగా 231 రన్స్ ఛేదన కోసం బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 69.2 ఓవర్లలో 202 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ (39), భరత్ (28), అశ్విన్ (28), రాహుల్ (22) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. అంతకుముందు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 420 రన్స్ చేసింది. ఒల్లీ పోప్ (196) తృటిలో డబుల్ సెంచరీ కోల్పోయాడు. హార్ట్‌లీ (34), రెహాన్ (28) రాణించారు. బుమ్రాకు 4, అశ్విన్‌కు 3, జడేజాకు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 246, భారత్ 436 పరుగులు చేశాయి. పోప్‌నకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. రెండో టెస్టు వచ్చేనెల 2న విశాఖపట్నంలో మొదలవనుంది.

‘డబుల్’ మిస్: ఓవర్‌నైట్ స్కోరు 316/6తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌కు పోప్ చివరికంటా అండగా నిలిచాడు. అదేపనిగా రివర్స్ స్వీప్‌లతో స్పిన్నర్లు అశ్విన్, జడేజాలపై ఒత్తిడి పెంచిన అతడు.. ఏడో వికెట్‌కు రెహాన్‌తో కలిసి 64, ఎనిమిదో వికెట్‌కు హార్ట్‌లీతో కలిసి 80 పరుగులు జోడించాడు. 180 రన్స్ వద్ద పోప్ క్యాచ్‌ను రాహుల్ వదిలేశాడు. అయితే డబుల్ సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో బుమ్రా అద్భుత బంతికి పోప్ ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. కానీ అప్పటికే జట్టు స్కోరు 420 పరుగులకు.. ఆధిక్యం 230కి చేరింది.

హార్ట్‌లీ దెబ్బకు..: స్పిన్‌ను చక్కగా ఎదుర్కొనే భారత బ్యాటర్లు అరంగేట్ర స్పిన్నర్ హార్ట్‌లీకి దాసోహం కావాల్సి వచ్చింది. టాపార్డర్‌ను అతడు కుదురుకోనీయలేదు. యశస్వీ (15), గిల్ (0)లను ఒకే ఓవర్‌లో అవుట్ చేసిన అతడు.. ఆత్మవిశ్వాసంతో ఉన్న రోహిత్‌ను ఎల్బీగా పంపాడు. ఐదో నెంబర్‌లో ఆడిన అక్షర్ (17), రాహుల్ కలిసి నాలుగో వికెట్‌కు 32 రన్స్ జోడించారు. టీ బ్రేక్ తర్వాత అక్షర్‌ను కూడా హార్ట్‌లీ అవుట్ చేసి తొలి నాలుగు వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. ఈ దశలో రాహుల్, శ్రేయాస్ (13)పై ఆశలు పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. అటు జడేజా (2) అనవసర పరుగుకోసం వెళ్లి స్టోక్స్ సూపర్‌త్రోతో రనౌటయ్యాడు.

ఆ ఇద్దరు పోరాడినా..: 119/7 స్కోరుతో జట్టు కష్టాల్లో పడిన వేళ 150 రన్స్ కూడా కష్టమే అనిపించింది. కానీ భరత్, అశ్విన్ గెలుపుపై ఆశలు రేకెత్తించారు. ఈ ఇద్దరూ ఎనిమిదో వికెట్‌కు 57 పరుగులు జోడించారు. రిస్కీ షాట్లకు వెళ్లకుండా స్పిన్నర్లను 21 ఓవర్లపాటు ఎదుర్కొన్నారు. ఆటను చివరిరోజు వరకు తీసుకెళతారని అనుకున్నా.. మరో రెండు ఓవర్లలో ఆట ముగుస్తుందనగా హార్ట్‌లీ కళ్లుచెదిరే బంతితో భరత్‌ను బౌల్డ్ చేశాడు. అలాగే ఆటను మరో అరగంట పొడిగించగా.. హార్ట్‌లీ తర్వాతి ఓవర్‌లో అశ్విన్ ముందుకు వచ్చి ఆడాలని చూసి స్టంప్ కావడంతో భారత్ ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో సిరాజ్ (12), బుమ్రా (6) పదో వికెట్‌కు 25 రన్స్ జోడించి ఓటమి తేడాను తగ్గించారు.



పోప్ (196)కు రోహిత్ అభినందన

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246;
భారత్ తొలి ఇన్నింగ్స్: 436;

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి) రోహిత్ (బి) అశ్విన్ 31; డకెట్ (బి) బుమ్రా 47; పోప్ (బి) బుమ్రా 196; రూట్ (ఎల్బీ) బుమ్రా 2; బెయిర్‌స్టో (బి) జడేజా 10; స్టోక్స్ (బి) అశ్విన్ 6; ఫోక్స్ (బి) అక్షర్ 34; రెహాన్ (సి) బుమ్రా 28; హార్ట్‌లీ (బి) అశ్విన్ 34; ఉడ్ (సి) భరత్ (బి) జడేజా 0; లీచ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 32; మొత్తం: 420 ఆలౌట్. వికెట్ల పతనం**: 1-45, 2-113, 3-117, 4-140, 5-163, 6-275, 7-339, 8-419, 9-420, 10-420. **బౌలింగ్**: బుమ్రా 16.1-4-41-4; అశ్విన్ 29-4-126-3; అక్షర్ 16-2-74-1; జడేజా 34-1-131-2; సిరాజ్ 7-1-22-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) హార్ట్‌లీ 39; జైస్వాల్ (సి) పోప్ (బి) హార్ట్‌లీ 15; గిల్ (సి) పోప్ (బి) హార్ట్‌లీ 0; రాహుల్ (ఎల్బీ) రూట్ 22; అక్షర్ (సి అండ్ బి) హార్ట్‌లీ 17; శ్రేయాస్ (సి) రూట్ (బి) లీచ్ 13; జడేజా (రనౌట్) 2; భరత్ (బి) హార్ట్‌లీ 28; అశ్విన్ (స్టంప్) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 28; బుమ్రా (నాటౌట్) 6; సిరాజ్ (స్టంప్) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 12; **ఎక్స్‌ట్రాలు: 20; మొత్తం: 202 ఆలౌట్. వికెట్ల పతనం**: 1-42, 2-42, 3-63, 4-95, 5-107, 6-119, 7-119, 8-176, 9-177, 10-202. **బౌలింగ్**: రూట్ 19-3-41-1; ఉడ్ 8-1-15-0; హార్ట్‌లీ 26.2-5-62-7; లీచ్ 10-1-33-1; రెహాన్ 6-0-33-0.

2 తొలి ఇన్నింగ్స్‌లో 190+ ఆధిక్యం సాధించినా భారత్ ఓడడం ఇది రెండోసారి.

4 2013 నుంచి స్వదేశంలో భారత్ ఆడిన 47 టెస్టుల్లో ఇది నాలుగో ఓటమి.

విండీస్ వండర్



షమార్ జోసెఫ్ (7/68)

27 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్టు విజయం

షమార్ జోసెఫ్‌కు ఏడు వికెట్లు

- ఆసీస్ గడ్డపై 1997 తర్వాత విండీస్ ఓ టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించింది.
- 2003 తర్వాత ఏ వేదికపై అయినా ఆసీస్‌పై నెగ్గడం విండీస్‌కిదే తొలిసారి.
- డే/నైట్ టెస్టులో ఆసీస్ ఓడడం ఇదే తొలిసారి. గతంలో 11 మ్యాచ్‌లను గెలిచింది.

బ్రిస్బేన్: ప్రతిష్ఠాత్మక గాబా మైదానంలో వెస్టిండీస్ చరిత్రాత్మక విజయాన్నందుకుంది. ఏకంగా 27 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్టు గెలుపుతో సంబరాలు చేసుకుంది. 216 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టును యువ పేసర్ షమార్ జోసెఫ్ ఏడు వికెట్లతో వణికించాడు. దీంతో 207 రన్స్‌కే ఆసీస్ ఆలౌట్ కాగా.. మరో రోజు ఉండగానే కరీబియన్లు 8 పరుగుల తేడాతో నెగ్గి అద్భుతం చేశారు. అలాగే రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేశారు. స్మిత్ (91 నాటౌట్), గ్రీన్ (42) రాణించారు. వాస్తవానికి శనివారం బ్యాటింగ్‌లో పేసర్ స్టార్క్ యార్కర్ నేరుగా జోసెఫ్ కాలి వేలుకు బలంగా తాకింది. వెంటనే మైదానం వీడిన అతను ఆదివారం బౌలింగ్‌కు దిగుతాడని ఎవరూ భావించలేదు. కానీ నొప్పిని భరిస్తూనే ప్రత్యర్థి స్వల్ప ఛేదనను సైతం కట్టడి చేశాడు. **గతేడాది వరకు సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన 24 ఏళ్ల జోసెఫ్‌కిది రెండో టెస్టు మాత్రమే.** అలాగే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ కూడా అతడికే దక్కింది. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 311, రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులు చేసింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో అతి విశ్వాసానికి వెళ్లి 289/9 రన్స్ వద్ద డిక్లేర్ చేసింది. ఆ సమయంలో కమిన్స్ చక్కగా ఆడుతుండడంతో మరిన్ని పరుగులైనా జత చేరేవి.

లారా కంటతడి..: సుదీర్ఘకాలం తర్వాత ఆసీస్ గడ్డపై తమ జట్టు గెలవడంతో విండీస్ దిగ్గజం బ్రయాన్ లారా తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. ఇదే సిరీస్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న లారా విండీస్ గెలిచిన వెంటనే కంటతడి పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న ఆసీస్ దిగ్గజం గిల్‌క్రిస్ట్.. లారాను ఆలింగనం చేసుకున్నాడు.

ఇటలీ కుర్రాడు ఇరగదీశాడు



సిన్నర్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్

ఫైనల్లో మెద్వెదెవ్ పరాజయం

మెల్‌బోర్న్: తొలి రెండు సెట్లు చేజారాయి. మరో యువ ఆటగాడైతే ఇక చేతులెత్తేసేవాడేమో. కానీ ఇటలీకి చెందిన 22 ఏళ్ల జానిక్ సిన్నర్ అద్భుతంగా పోరాడాడు. మిగిలిన మూడు సెట్లు గెలిచి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను అందుకున్నాడు. తద్వారా తన కెరీర్‌లో మొదటిసారి గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని ముద్దాడాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో నాలుగో సీడ్ సిన్నర్ 3-6, 3-6, 6-4, 6-4, 6-3తో మూడో సీడ్ రష్యన్ డానిల్ మెద్వెదెవ్‌కు షాకిచ్చాడు. దాదాపు మూడున్నర గంటల పాటు సాగిన సమరంలో సిన్నర్ 14 ఏస్‌లు సంధిస్తే మెద్వెదెవ్ 11 కొట్టాడు. విన్నర్లలోనూ ఇటలీ ఆటగాడిదే పైచేయి. అతడు 50 కొడితే..మెద్వెదెవ్ 44 సంధించాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో మూడుసార్లు టైటిల్ ఫైట్‌కు వచ్చినా..అన్నిసార్లూ మెద్వెదెవ్‌కు నిరాశే మిగలడం గమనార్హం.

38 ఏళ్ల వయస్సులో టైటిల్: తైవాన్‌కు చెందిన 38 ఏళ్ల హీ సూ వీ అత్యధిక వయస్సులో గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్ గెలిచిన రెండో క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. ఎలైస్ మెర్టిన్స్ (బెల్జియం) జతగా బరిలో దిగిన వీ ఫైనల్లో 6-1, 7-5తో ఒస్తాపెంకో (లాత్వియా)/కిచెనోక్ (ఉక్రెయిన్) జోడీపై నెగ్గింది. 2011లో లిసా రేమండ్(అమెరికా) 38 ఏళ్ల వయసులో యూఎస్ ఓపెన్ డబుల్స్ టైటిల్ గెలిచింది.



మెర్టిన్స్ హీ సూ వీ



రాజమహేంద్రవరం దరి కాతేరులో రా కదలిరా సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు

నేడు రాజమండ్రిలో 'రా కదలిరా!

» 2 లక్షల మంది వస్తారని అంచనా... దానికి తగ్గట్లు భారీ ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 'రా కదలిరా'లో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధి కాతేరులో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సభ నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను గోదావరి ఫోర్త్ బ్రిడ్జి సమీప కాతేరులోని తిరుమల విద్యాసంస్థల సమీపాన 23 ఎకరాల విశాలమైన మల్లు లేఅవుట్‌లో బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 30 వేల మంది వచ్చేలా ఆయా నేతలు బాధ్యతలు తీసుకుని ప్రచారం చేశారు. మొత్తం 2లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నారు. సభ ఏర్పాట్లను మూడు రోజుల నుంచి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసనమండలి విపక్షనేత యనమల రామకృష్ణుడు, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాజీ మంత్రులు కెఎస్ జవహర్, ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు పరిశీలించారు. ఆదివారం కూడా వారు ఇక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జగన్ నీవు దేనికి సిద్ధం?

» నీ ఓటమి తథ్యం: యనమల

» సిలువ మీద నడిచిన పాపం జగన్‌కు శాపమే: జవహర్

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 'జగన్ సిద్ధం సిద్ధం అంటున్నాడు. దేనికో అర్థం కావడంలేదు. ఓటమికి సిద్ధమా? ప్రజలు ఆల్రెడీ ఛీకొడుతున్నారు. ఇక నీ ఓటమి తథ్యం' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లోని కాతేరులో సోమవారం జరగబోయే చంద్రబాబు 'రా కదలిరా' సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్‌కు ఇప్పటికే తనపట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని అర్థమైపోయింది. ఓటమి తప్పదని కూడా తెలిసిపోయింది. అందుకే హ్యాపీగా దిగిపోతానని ప్రకటిస్తే ప్రజలేమైనా సానుభూతితో ఓట్లేస్తారే మోననే భ్రమలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. భీమిలి జగన్ సభ పూర్తిగా ఫెయిలైంది. పైగా సభలో ఎక్కడా సీఎంగా తాను చేసిన పనులేమీ చెప్పలేదు. 90 శాతం పథకాలు అమలు చేశానని అబద్ధాలు చెప్పాడు. బాబును విమర్శించే స్థాయి, అర్హత జగన్‌కు లేదు' అన్నారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ 'జగన్ నిరాశా నిస్పృహలతో ఉన్నాడు. అవినీతి సొమ్ము ఎంత పంచినా జగన్‌కు ప్రజలు ఓట్లు వేయరు' అని అన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన కలసి ఐక్యంగా వైసీపీని సాగనంపుతాయని హెచ్చరించారు. మాజీ మంత్రి కెఎస్ జవహర్ మాట్లాడుతూ 'ఆనాడు ఏసుక్రీస్తు సిలువ మోశారు. కానీ భీమిలి సభలో జగన్ సిలువ గుర్తు ర్యాంపు మీద నడిచాడు. ఆ పాపం జగన్‌కు శాపంగా మారుతుంది' అని హెచ్చరించారు.

సిద్ధం సభలో అన్నీ అబద్ధాలే: గంటా



అమలుకాని వైసీపీ హామీల వివరాలను చూపుతున్న గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సంగివలసలో 'సిద్ధం' పేరుతో వైసీపీ నిర్వహించిన బహిరంగసభలో ముఖ్యమంత్రి జగన్ అన్నీ అబద్ధాలే చెప్పి ప్రజల్ని మోసం చేసే ప్రయత్నం చేశారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించడానికి ప్రజలు 'సిద్ధం'గా ఉన్నారని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో ప్రజలకు కావల్సినవి అన్నీ చేశానని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరఫున పనిచేయడానికి అదే ప్రజలు తన సైన్యంగా చెప్పుకోవడం చూస్తే జగన్‌లో భయం పట్టుకుందన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరగడం జగన్ ఇష్టపడడం లేదని విషయం ఆయన మాటల ద్వారా తేటతెల్లమవుతోందని గంటా ఆరోపించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తిచేశామని గొప్పలు చెప్పిన జగన్, వాస్తవానికి 15 శాతం మాత్రమే అమలుచేశారని స్పష్టంచేశారు. ఎన్నికలను కురుక్షేత్ర సంగ్రామంతో పోల్చుతున్న జగన్‌రెడ్డి.. వైసీపీది పాండవ సైన్యమని చెప్పుకుంటున్నారని, అయితే ప్రజలు మాత్రం ఆ పార్టీని కౌరవ సైన్యంగా భావిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం పనిచేసిన తల్లి, చెల్లి ఇప్పుడెందుకు వ్యతిరేకమయ్యారో జగన్ చెప్పగలరా? అని గంటా ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ కచ్చితంగా గెలవగలిగే మూడు సీట్లు చెప్పండని ఆ పార్టీ నేతలను ప్రశ్నించారు.

దోచుకోవడం.. దాచుకోవడమే తెలుసు

» మంగంపేట బెరైటీస్‌నూ దోచేస్తున్న జగన్‌రెడ్డి

» దీనిపై న్యాయపోరు... త్వరలో బెరైటీస్ వద్ద దీక్ష: సీఎం రమేశ్

కడప (మారుతీనగర్), జనవరి 28 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు మంచి చేయడం అటుంచి అందినకాడికి దోచుకోవడం... దాచుకోవడమే తప్ప మరో ఆలోచనే లేకుండా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ ధ్వజమెత్తారు. కడపలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ భూములు, ఇసుక, మద్యం.. మట్టి.. కొండలు.. గుట్టలు.. వాగులు.. వంకల్లో కొల్లగొట్టిన లక్షలాది కోట్లు చాలక, మరో 75 రోజులకు దిగిపోతున్న తుది రోజుల్లో ఏకంగా జిల్లా సంపదైన మంగంపేట బెరైటీస్‌పై జగన్‌రెడ్డి కన్నేసి వేశాడన్నారు. ప్రపంచ మార్కెట్‌లో మంగంపేట బెరైటీస్‌కు చాలా విలువ ఉందని, అలాంటి అరుదైన సంపదను కొల్లగొట్టేందుకు నిబంధనలకు పాతరేసి మరీ ఏకంగా 5 సంవత్సరాలకు ఓ వ్యక్తికి బెరైటీస్‌ను అమ్మేందుకు వీలుగా ఒప్పందం కుదుర్చుకోవడం దారుణమని మండిపడ్డారు. దీనిపై కలిసివచ్చే అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి మంగంపేట బెరైటీస్ వద్ద త్వరలో దీక్ష చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఎంతసేపూ డబ్బు యావ తప్ప ప్రజల ఇబ్బందులను జగన్‌రెడ్డి ఏమాత్రం ఖాతరు చేయడం లేదన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దోచుకున్న డబ్బంతా కుమ్మరించినా జగన్‌రెడ్డికి ఓటమి తప్పదన్నారు. ఏపీలో జరిగే అరాచకాలను త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచకాలపై పీసీసీ చీఫ్ షర్మిల ప్రశ్నలకు వైసీపీ నాయకులతో పాటు ఏకంగా జగన్‌రెడ్డి సైతం సమాధానం చెప్పలేక ఆమె వ్యక్తిత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మోదీ హవా సాగుతుందని, ముచ్చటగా మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్రమోదీ ప్రధాని కావడం తథ్యమని జోష్యం చెప్పారు.

మహిళా సంఘాలను వైసీపీ బెదిరించడమేంటి?

» ఆ సంఘాలకు నిధులు కేంద్రానివి: పురందేశ్వరి

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార వైసీపీ మహిళా స్వయం సంఘాలను బెదిరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. బీజేపీ దేశ వ్యాప్తంగా చేపడుతున్న 'శక్తి వందన్' కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం స్వయం సహాయ సంఘాలకు నిధులిస్తుంటే రాష్ట్రంలోని వైసీపీ సర్కారు.. సభలకు రాకుంటే లోన్లు ఇవ్వబోమని బెదిరింపులకు దిగడం ఏంటని ఆగ్రహించారు. క్షేత్ర స్థాయిలో ప్రతి మహిళా మోర్చా కార్యకర్త, నాయకులు విస్తృతంగా ఈ విషయాన్ని డ్వాక్రా సంఘాలకు తెలియజేయాలని సూచించారు.


పార్టీపెట్టి హోల్‌సేల్‌గా అమ్మేసింది!

» షర్మిలపై నారాయణస్వామి విసుర్లు

పెనుమూరు, జనవరి 28: మన రాష్ట్రంలో ఇస్తున్న పథకాలు లేకపోతే జగన్ వంట గ్యాస్‌ను రూ.100కే ఇచ్చేవాడని నారాయణస్వామి అన్నారు. ఆదివారం అయన చిత్తూరు జిల్లా పెనుమూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన ఆసరా కార్యక్రమంలో మాట్లాడారు. షర్మిల.. తన సొంత అన్నను జగన్ రెడ్డి అని మాట్లాడ్డం పద్ధతి కాదన్నారు. ఆమె రాజశేఖర్‌రెడ్డి వారసురాలు కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో పార్టీ పెట్టి కాంగ్రెస్‌కు హోల్‌సేల్‌గా అమ్మేసి.. ఇప్పుడు ఆంధ్రలో తన అన్నను జైల్లో పెట్టిన పార్టీలో చేరి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతోందని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, షర్మిల అందరూ కలిసి వచ్చినా జగన్‌ను ఏమీ చేయలేరన్నారు.

జగన్‌రెడ్డి.. భస్మాసురుడు!

(మొదటి పేజీ తరువాయి)



» మాకు ప్రతి ఉద్యోగీ ఒక స్టార్ క్యాంపెయినర్, ప్రతి పేదవాడు ఒక స్టార్ క్యాంపెయినర్.. ఐదు కోట్ల మంది ప్రజలు స్టార్ క్యాంపెయినర్లుగా మమ్మల్ని నడిపిస్తున్నారు. అఖండ మెజారిటీతో గెలిపించనున్నారు. జగన్ పతనం ప్రారంభమైంది. దేవుడు కూడా కాపాడలేడు.

» జగన్.. నువ్వు పుట్టకముందు నుంచీ నేను రాజకీయాలు చేస్తున్నా. నేనేం చేశానో మీ నాయన్ను అడుగు కలలోకి వచ్చి చెబుతాడు. నేనేం చేశానో ఊరూరికీ వెళ్లి ఐటీ ప్రొఫెషనల్స్‌ను అడుగు వాళ్లూ చెబుతారు. మొన్న నాకు కష్టం వస్తే 80 దేశాల్లో ఐటీ ప్రొఫెషనల్స్ మద్దతుగా నిలబడ్డారు.

» 'వైనాట్ 175'.. అంటూ జగన్ పదే పదే చెబుతున్నాడు. నేను ఈ పత్తికొండ సభ నుంచి సవాల్ విసురుతున్నా.. ముందు పులివెందులలో గెలువు చూస్తా! -చంద్రబాబు



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరిగిన రా... కదలి రా సభకు హాజరైన జనం

నెల్లూరు, కర్నూలు జిల్లాలోని పత్తికొండల్లో నిర్వహించిన 'రా..కదలిరా' సభల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూల్చుడు, నొక్కుడు, బొక్కుడు, బొంకుడు ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. "పేదల కడుపు కొట్టిన వ్యక్తి జగన్. చంద్రన్న బీమా, పండుగ కానుకలు, విదేశీ విద్య వంటి వంద పథకాలను రద్దు చేసిన వ్యక్తి పేద బిడ్డా!?. ఈ దేశంలో అందరు ముఖ్యమంత్రులకు కలిపి ఎన్ని ఆస్తులున్నాయో, ఒక్క జగన్‌కి అంతకన్నా ఎక్కువ ఆస్తులున్నాయి. మరోవైపు ఇల్లే లేదంటున్నారు. కానీ, తాడేపల్లిలో పెద్ద ప్యాలెస్, బెంగళూరులో మరో పెద్ద ప్యాలెస్, పులివెందులలో ఇంకో ప్యాలెస్, హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఒక ప్యాలెస్ ఇవన్నీ చాలవన్నట్లు నిన్ననే రుషికొండను బోడికొట్టించి అక్కడ మరొక ప్యాలెస్ కడుతున్నాడు. ఈ పేద బిడ్డ బతకలేడని పాపం రూ.500 కోట్లు ఖర్చుపెట్టి అది కూడా సముద్రం వైపు ఫెన్సింగ్ పెట్టి ఆ పెద్ద ప్యాలస్ కడుతున్నారు" అని చంద్రబాబు అన్నారు. అందరికీ ఉద్యోగాలు ఇచ్చేశానని చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశారు. "ఏం తమ్ముళ్లూ ఉద్యోగాలు ఇచ్చాడా మీకు, జాబ్ క్యాలెండర్ వచ్చిందా, డీఎస్సీ పెట్టాడా" అని సభకు హాజరైన యువతను చంద్రబాబు ప్రశ్నించగా అందరూ 'లేదు.. లేదు' అని సమాధానమిచ్చారు. 'సచివాలయంలో వలంటీర్ల ఉద్యోగం, మటన్‌కొట్టు, బ్రాందీ షాపుల్లో కొలువులు ఇవీ ఈయన ఇచ్చిన ఉద్యోగాలు. వీటినీ ఉద్యోగాలంటారా? రాష్ట్రంలో 24 శాతం నిరుద్యోగులు ఉన్నారని, దేశంలోనే ఎక్కువ శాతం నిరుద్యోగులు ఉన్న రాష్ట్రం ఏపీనేనని నివేదిక ఇచ్చారు. అబద్ధాలు చెప్పడానికి సిగ్గనిపించలేదా" అని అన్నారు. ఇంకా ఏమన్నారంటే..

జనం రక్తం తాగుతున్నాడు

టీడీపీ ప్రభుత్వంలో క్వార్టర్ మద్యం బాటిల్ రూ.60. ఇప్పుడు రూ.200. అప్పుడు నాణ్యమైన మద్యం, ఇప్పుడు నాశిరకం. ప్రజల రక్తం తాగుతున్నాడు. మద్యం అమ్మకాల ద్వారా ప్రతి రోజు సాయంత్రానికి తాడేపల్లి కొంపకు డబ్బు అందకపోతే ఈ సీఎంకి నిద్ర పట్టదు. తొమ్మిదిసార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.56 వేల కోట్లు దోచుకున్నాడు.

నేనేం చేశానో మీ నాన్నను అడుగు

జగన్ నువ్వు పుట్టకముందు నుంచీ నేను రాజకీయాలు చేస్తున్నా. నేనేం చేశానో మీ నాయన్ను అడుగు కలలోకి వచ్చి చెబుతాడు. హైదరాబాద్ నేను వేసిన ఫౌండేషన్. ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డితో సహా నలుగురు ముఖ్యమంత్రులు నేను అభివృద్ధి చేసిన హైదరాబాద్ ఫలితాలను అనుభవించారు. ఇప్పటికీ అనుభవిస్తున్నారు. నేనేం చేశానో ఊరూరికి వెళ్లి ఐటీ ప్రొఫెషనల్స్‌ను అడుగు వాళ్లే చెబుతారు. నీ విధ్వంస పాలన అంతమొందించడానికి ప్రజలు నిర్ణయించుకున్నారు. నీ ఫ్యానుకు మూడు రెక్కలున్నాయి. తొందర్లో ఆ రెక్కలను విరిచి పక్కన పడేస్తారు. గెట్ రెడీ జగన్ రెడ్డీ. నీ ఫ్యాన్ బాదుడు రెక్కలు ఉత్తరాంధ్ర ప్రజలు విరిచేస్తారు. ఇన్‌ఫ్రా రాజకీయ రెక్కలు సీమ ప్రజలు తుంచేస్తారు. నీ విధ్వంస నిర్ణయాల రెక్కలు కోస్తా ప్రజలు పీకి పాతరేస్తారు. కడాన మొండి ఫ్యానును నీ చేతిలో పెట్టి నిన్ను ఇంటికి పంపిస్తారు.

డైపర్లు వేసుకుని...

ఎప్పుడైతే టీడీపీ, జనసేన పార్టీలు కలిశాయో అప్పుడే వైసీపీకి కాలం చెల్లిందని ఆ పార్టీ నేతలకు అర్థమైంది. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు చారిత్రక అవసరమని ప్రజలు గుర్తించారు. ఈ విషయం వైసీపీ నేతలకు కూడా అర్థమైంది. మమ్మల్ని బయటకు విమర్శిస్తున్నారు కానీ, భయంతో డైపర్లు వేసుకొని తిరుగుతున్నారు. కలలో కూడా నేను, పవన్ కల్యాణే కనిపిస్తున్నాం. రాష్ట్రాన్ని నెంబర్ 1 చేసే బాధ్యత నేను తీసుకున్నా. టీడీపీ, జనసేనలను ఆశీర్వదించండి. సైకో పాలనలో రాష్ట్రం అతలాకుతలమైంది. ఈ పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవడం కోసమే రా...కదిలిరా! అంటూ జనం మధ్యకు వస్తున్నా. జగన్ కూడా సిద్ధం అంటున్నాడు. ఆయన సిద్ధం అని పిలుపునిస్తే వైసీపీ నేతలు ఇక సెలవు అంటున్నారు. టికెట్లు ఇస్తామంటే పారిపోతున్నారు. అందుకే రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేనలతో కలిసి పనిచేయాలనుకునే వైసీపీ నేతలు, కార్యకర్తలను కూడా రా... కదలిరా! అని పిలుపునిస్తున్నా. రద్దులు, కూల్చివేతలు, దాడులు, అక్రమ కేసులు తప్ప ఈ సైకో జగన్‌కు ఏమీ తెలియవు. రాష్ట్రమంతటా టీడీపీ, జనసేన కూటమి గాలి బలంగా వీస్తోంది. విజయాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు. పత్తికొండకు తరలివచ్చిన జనసందోహాన్ని చూస్తే సైకో జగన్‌కు రాత్రి నిద్రపట్టదు. తాడేపల్లి ప్యాలెస్‌లో టీవీలు పగిలిపోతాయి. ఒక ప్రభుత్వంపై ప్రజల్లో ఇంతటి కోపం మునుపెన్నడూ చూడలేదు. ఈ దెబ్బతో వైసీపీ ప్రభుత్వం ఫినిష్ అవడం ఖాయం. తాను ప్రజల బిడ్డనని చెప్పుకొంటున్న జగన్.. ప్రజల బిడ్డ కాదు.. క్యాన్సర్ గడ్డ.

బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం

టీడీపీ అంటే బీసీల పార్టీ. ఎందరో బడుగు, బలహీనవర్గాల నేతలను రాష్ట్రానికి, దేశానికి అందించిన పార్టీ. బీసీ సామాజిక వర్గానికి చెందిన కేఈ కృష్ణమూర్తిని డిప్యూటీ సీఎం చేశాం. యనమల రామకృష్ణుడిని ఆర్థిక మంత్రిని చేశాం. జగన్ ప్రభుత్వం వచ్చాక బీసీలకు న్యాయం చేశారా? ఆదరణ సహా వివిధ బీసీ పథకాలు రద్దు చేసిన ఘనత జగన్‌దే. ఆయన వచ్చాక బీసీలపై దాడులు పెరిగాయి. ఈ రోజు కోడికత్తి శ్రీను జైల్లో ఉన్నాడు. బాబాయిని హత్య చేసిన వ్యక్తులు బయట తిరుగుతున్నారు. ఇదీ జగన్ నైజం.

ఇక 73 రోజులే

అరాచక పాలనను అంతమొందించేందుకు జగన్‌ను ఇంటికి పంపేందుకు మిగిలినది 73 రోజులే. రాబోయే కురుక్షేత్ర సంగ్రామంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం కొలువుదీరుతుంది. ఎవరూ నిర్లక్ష్యంగా ఉండవద్దు. ఈ 73 రోజులు సైకిలెక్కండి.. టీడీపీ, జనసేన జెండాలు పట్టుకోండి.. కష్టపడి పని చేసి మన ప్రభుత్వాన్ని తీసుకురావడం మీరు బాధ్యతగా తీసుకుంటే.. మీ భవిష్యత్తును అందంగా తీర్చేదిద్దే బాధ్యత నేను తీసుకుంటా. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను తీసుకురావడం వల్ల ఎందరో మాదిగలకు విద్య, ఉద్యోగాల్లో న్యాయం జరిగింది. ఇప్పటికీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం. కర్నూలు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు భూకబ్జాలు, ఇసుక దోపిడీ, మద్యం మాఫియాను పెంచి పోషిస్తున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే ఫ్యామిలీ మాఫియాకు లీడర్‌గా మారారు. ఆదోని ఎమ్మెల్యే భూకబ్జాలకు కేరాఫ్‌గా మారారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే తన సొంతూరు పక్కనే వందెకరాలు కాజేశారు. కర్నూలు ఎమ్మెల్యే అవినీతిలో కింగ్‌కాంగ్.

పులివెందులలో గెలువు చూస్తాం

'వైనాట్ 175'.. అంటూ ఈ జగన్ పదే పదే చెబుతున్నాడు. నేను ఈ పత్తికొండ సభ నుంచి సవాల్ విసురుతున్నా.. ముందు పులివెందులలో గెలువు చూస్తా. ఎన్నికలకు ముందే పారిపోయిన పార్టీ వైసీపీ. 69 మంది అభ్యర్థులను మార్చారు. అందులో 29 మంది బీసీ, ఎస్సీలే ఉన్నారు. మీరు మీ ఎమ్మెల్యేలను నమ్మడం లేదు.. ప్రజలు మిమ్మల్ని నమ్మడం లేదు.

నగరి బరిలో నేనే: రోజా

» ఒంగోలు లోక్‌సభకు చెవిరెడ్డి!



తడ, జనవరి 28: నగరి నియోజకవర్గం నుంచి ఇప్పటికే రెండుసార్లు గెలిచానని.. ముచ్చటగా మూడోసారి కూడా అక్కడి నుంచే పోటీచేస్తానని మంత్రి ఆర్కే రోజా స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం తిరుపతి జిల్లాలోని తడ మండలం భీములవారిపాళెం టూరిజం రిసార్ట్‌ల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె ఆమె మీడియాతో మాట్లాడారు. తనను ఒంగోలు లోక్‌సభకు పోటీచేయిస్తారని వచ్చిన వార్తల్లో నిజం లేదని.. అక్కడి నుంచి తనను మార్చే ఉద్దేశం అధిష్ఠానానికి లేదని చెప్పారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ రోజుకో కృష్ణుడు ఆంధ్రాకు వస్తున్నారని.. షర్మిలను ఉద్దేశించి అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. సీట్ల సర్దుబాటులో టికెట్లు రానంత మాత్రాన.. అప్పటివరకు దేవుడిగా ఉన్న పెద్దిరెడ్డి ఇప్పుడు పనికిరాకుండా పోయారా అంటూ ప్రశ్నించారు. ఒంగోలు లోక్‌సభ స్థానానికి వైసీపీ తరఫున ఎమ్మెల్యే చెవిరెడ్డి బరిలోకి దిగనున్నట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి.

మంత్రి ఉష శ్రీచరణ్‌కు చేదు అనుభవం

» సొంత పార్టీ నేతలే అడ్డుకున్న వైనం

» తాగునీరు, రోడ్డు లేవని మండిపాటు



మంత్రి ఉష శ్రీచరణ్‌ను నిలదీస్తున్న మహిళలు

హిందూపురం, జనవరి 28: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం మోటువారిపల్లిలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్‌కు సొంత పార్టీ కార్యకర్తల నుంచే చేదు అనుభవం ఎదురైంది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్‌ను వైసీపీ అధిష్ఠానం మార్పుచేర్పుల్లో భాగంగా పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మోటువారిపల్లికి వెళ్లగా వైసీపీ కార్యకర్తలు, నాయకులే.. మంత్రి వాహనాన్ని అడ్డుకున్నారు. మంత్రి వాహనం దిగిన వెంటనే గ్రామస్థులు సమస్యలు ఏకరువు పెట్టారు. ఎన్నికల సమయంలో గ్రామానికి రోడ్డు వేస్తామని హామీ ఇస్తున్నారు తప్ప.. ఇప్పటి వరకు వేసింది లేదన్నారు. కాలేజీలకు వెళ్లిన తమ పిల్లలు రాత్రిపూట ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి రావాలంటే జంకుతున్నారన్నారు. పెనుకొండ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శంకర్‌నారాయణ గతంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా పనిచేసినా.. ప్రస్తుతం మీరు మంత్రిగా ఉన్నా చేసిందేమిటని నిలదీశారు. కనీసం 4 కి.మీ., రోడ్డు వేయలేని నేతలు మాటలు మాత్రం కోటలు దాటిస్తున్నారంటూ సొంత పార్టీ కార్యకర్తలే ప్రశ్నించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందన్నారు. దీంతో మంత్రి సమాధానం చెప్పలేక అక్కడినుంచి నెమ్మదిగా జారుకున్నారు. ఆమె తీరుపై అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహించారు. కనీసం 5 నిమిషాలు తమ సమస్యలు వినని నేతలు తమకొద్దంటూ ఫైర్ అయ్యారు. శాపనార్థాలు పెట్టారు. ఎన్నికల్లోపు గ్రామానికి రోడ్డు వేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని గ్రామస్థులు ఖరాకండిగా చెప్పారు.



అనంతపురంలో కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో వైఎస్ షర్మిల

ఇచ్చిన ప్రతి మాటా తప్పారు!

(మొదట పేజీ తరువాయి)

- మాట నిలబెట్టుకోలేని మీరు కేడీ అవుతారు తప్ప మోదీ ఎలా అవుతారు? బీజేపీ కేడీల పార్టీ. అలాంటి పార్టీకి మద్దతు తెలిపిన చంద్రబాబు, జగనన్న కూడా కేడీలు కారా?
- చంద్రబాబు అమరావతిని సింగపూర్ అంటూ త్రీడీ గ్రాఫిక్స్ చూపించి ప్రచారం చేశారు. జగనన్న మూడు రాజధానులు అన్నారు. చివరకు ఒక్క రాజధాని కూడా లేకుండా చేశారు.

\- వైఎస్ షర్మిల

భవిష్యత్ కోసం 3,200 కి.మీ. పాదయాత్ర చేశానని.. వైసీపీని గెలిపించానని.. ఆయన కోసం అనేక ఇబ్బందులకు ఓర్చానని.. అయినా కనీసం కృతజ్ఞత లేదని దుయ్యబట్టారు. అధికారం చేపట్టగానే జగనన్న మారిపోయారన్నారు. ఇవాళ తనమీద, తన వ్యక్తిగత జీవితం మీద నానారకాలుగా దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను భయపడనని, తాను వైఎస్ బిడ్డనని స్పష్టం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని 2014లో తిరుపతిలో మోదీ హామీ ఇచ్చారని.. కాంగ్రెస్ ఇచ్చే ఐదేళ్ల వ్యవధి సరిపోదని, పదేళ్లపాటు హోదాకావాలన్నారని.. పదిహేనేళ్లు కావాలని ఇదేచోట చంద్రబాబు కూడా అడిగారని.. బీజేపీ అధికారంలోకి వస్తే హోదా ఇస్తామని చెప్పిన మాట ఏమైందని మోదీని ప్రశ్నిస్తున్నానని షర్మిల అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన చేసింది అన్యాయం.. పాపమని స్పష్టం చేశారు. 'ప్రత్యేక హోదా వచ్చి ఉంటే రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు వచ్చేవి. లక్షల ఉద్యోగాలు వచ్చేవి. పోలవరం ప్రాజెక్టుకు కాంగ్రెస్ జాతీయ హోదా కల్పించి 90శాతం నిధులు ఇస్తామంది. మోదీ ప్రభుత్వం నిధులివ్వలేదు. రాజధాని నిర్మాణానికి సహకారమివ్వలేదు. దక్షిణాదిన మెట్రో రైలు ప్రాజెక్టు లేని ఏకైక రాష్ట్రం ఏపీయే. ఆంధ్ర ప్రజలు అంత తీసిపోయారా? రాష్ట్ర ప్రజలను మోదీ కడుపులో పొడిచారు. అయినా జగనన్న, చంద్రబాబు బీజేపీకి బానిసలయ్యారు. మోదీ రాష్ట్రానికి హోదా ఇచ్చారని బానిసలయ్యారా? ప్రాజెక్టులిచ్చారని భజన చేస్తున్నారా? వీళ్లు బానిసలై.. ఆంధ్ర ప్రజలను బానిసలుగా చేయాలని చూస్తున్నారు. అందువల్లే ఒక్క సీటు కూడా గెలవని బీజేపీ ఏపీలో రాజ్యమేలుతోంది. రాయలసీమలో 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించే హంద్రీ-నీవా ప్రాజెక్టుకు వైఎస్ హయాంలో రూ.4,500 కోట్లు ఖర్చు చేసి.. 90శాతం పనులు పూర్తిచేస్తే, మిగిలిన పది శాతం పనులు పూర్తిచేయడం జగనన్నకు చేతకావడం లేదు. వైఎస్ రూ.750కోట్లు వెచ్చించి గుండ్లకమ్మ ప్రాజెక్టు కట్టిస్తే, దానికి నిర్వహణకు నిధులివ్వక గేట్లు ఊడిపోయి నీళ్లలో తేలుతున్నాయి. అలాంటప్పుడు వైఎస్‌కు జగనన్న వారసుడెలా అవుతారు' అని నిలదీశారు. ఇంకా ఏమన్నారంటే..

మద్యనిషేధం తర్వాతే ఓట్లడుగుతానని..

మద్యపాన నిషేధం చేయకపోతే ఓట్లు అడగనని, ఎన్నికలు వచ్చేనాటికి పూర్తిగా మద్యపాన నిషేధం చేసి, ఓట్లు అడుగుతానని జగనన్న చెప్పారు. మేనిఫెస్టో అంటే బైబిల్, ఖురాన్, భగవద్గీత వంటిదని చెప్పి.. ఇచ్చిన ప్రతి మాటా తప్పారు. దీనిపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి.

జగన్‌కు ఎందుకు ఓటేయాలి..?

అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా తెస్తామని జగన్ అన్నాడు. పోలవరం పూర్తి చేస్తామన్నారు. రాజధాని కడతామన్నాడు. అవేమీ సాధించలేదు. ఒక్క పరిశ్రమ తీసుకురాలేదు. నిరుద్యోగ యువత పొట్ట చేతపట్టుకుని వలసలు పోతున్నారు. ఏటా జాబ్ కేలెండర్ అన్నాడు. అదీ అమలు చేయలేకపోయాడు. రాష్ట్రానికి మేలు చేయకపోగా.. బీజేపీకి బానిసగా మారాడు. అధికారమిచ్చినా ఏమీ సాధించని జగన్‌కు ఎందుకు ఓటేయాలో ఆయనే చెప్పాలి. నన్ను ఎంత తిట్టినా ఫర్వాలేదు. ఎన్ని నిందలు వేసినా ఫర్వాలేదు. ఎంత అవమానించినా... రాష్ట్ర ప్రజల మేలు కోసం ముందుకే సాగుతా. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని రావాలి. ఈ క్రమంలో ఎంతటి త్యాగానికైనా, పోరాటానికైనా నేను రెడీ. కార్యకర్తలు సిద్ధమా? కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రత్యేక హోదా సాధ్యమవుతుంది.. పోలవరం పూర్తవుతుంది.. రాజధానినీ నిర్మించుకోగలం. వైఎస్ పాలనకు, జగన్ పాలనకు పొంతన లేదు. బీజేపీ మతతత్వ పార్టీ. మతాల మధ్య చిచ్చుపెట్టి ఆ మంటల్లో చలి కాచుకుంటోంది. వైఎస్ మొదటి నుంచీ బీజేపీని వ్యతిరేకించారు. తండ్రి వ్యతిరేకించిన పార్టీకి జగన్ ఊడిగం చేస్తున్నారు. ఇవాళ 19 లక్షల మంది యువకులు నిరుద్యోగులుగా మిగిలిపోయారు. ఉద్యోగాలు లేక వారు డెలివరీ బాయ్‌లుగా పనిచేసుకునే పరిస్థితి తెచ్చారు. జగన్ వారికేం జవాబు చెబుతారు? రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే భవిష్యత్ ఉంటుంది. రాహుల్ గాంధీ ప్రధాని అయిన వెంటనే ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం. వైసీపీ పాలనలో ఏం అభివృద్ధి జరిగిందో జనం గుర్తించాలి. అభివృద్ధి నిరోధక వైసీపీకి ఓటేస్తే బీజేపీకి ఓటేసినట్లే. ఇతర పార్టీలకు ఓట్లేసినా అదే పరిస్థితి. బాబు, జగన్, పవన్ ఎవరో కాదు.. బీజేపీ అంటే వారే.

వైసీపీ వలంటీర్లే!

(మొదటి పేజీ తరువాయి)

నియమితులైంది తమ అభిమానులు, కార్యకర్తలేనని ఎట్టకేలకు అంగీకరించారు. ఇప్పటిదాకా వైసీపీ పెద్దలు మాత్రమే ఈ విషయం చెబుతున్నారు. '90శాతానికిపైగా వలంటీర్లు మా కార్యకర్తలే' అని బహిరంగంగానే ప్రకటించారు. ఇప్పుడు తొలిసారిగా సీఎం నోటా ఆ మాట వచ్చింది. అంటే.. పథకాల పంపిణీ పేరిట ప్రభుత్వ ఖజానా నుంచి వలంటీర్లకు వేతనాలు ఇచ్చి, సొంత పార్టీ కోసం ఉపయోగించుకుంటున్నారన్న మాట.

ఎన్నికల ప్రక్రియలో జోక్యం...

సొంత పార్టీకి లబ్ధి చేకూర్చడానికి, ఎన్నికల్లో విజయానికి పనిచేయడానికి వలంటీర్లను నియమించారనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రజలకు సేవ చేయడంకంటే.. పార్టీకి వలంటీర్లతో సేవ చేయించుకోవడమే అసలు ఉద్దేశం. దాదాపు 2.5లక్షల మంది వలంటీర్లను వైసీపీ సర్కారు నియమించింది. ఎన్నికల కమిషన్ ఇప్పటికీ వారిని కాంట్రాక్ట్ ఉద్యోగుల మాదిరిగానే పరిగణిస్తోంది. ఎన్నికల విధుల్లో వలంటీర్లు జోక్యం చేసుకుంటున్నారని ప్రతిపక్షాలు ఇంతకుముందే ఈసీకి ఫిర్యాదు చేశాయి. వలంటీర్లకు ఎన్నికల విధులు అప్ప చెప్పవద్దని కలెక్టర్లకు ఆదేశాలిచ్చి ఈసీ చేతులు దులుపుకొంటోంది. కలెక్టర్లు మొక్కుబడిగా కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు పంపించడమే గానీ వలంటీర్లపై చర్యలు తీసుకున్న దాఖలాలేవు. వారంతా నేటికీ అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారు. జగన్ సర్కారు వలంటీర్ల ద్వారా ఎన్నికల ప్రచారం కూడా చేయిస్తోంది. ఇప్పటికే పలు చోట్ల ఓటర్ల జాబితాలో ప్రత్యర్థుల ఓట్లను తొలగించే ప్రక్రియకు అధికార పార్టీ నేతలు వలంటీర్ల సహకారం తీసుకున్నారు. ఎన్నికల కోడ్ వచ్చాక వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలను ప్రభావితం చేసే అవకాశముంది. ఎన్నికల సమయంలో వలంటీర్లను విధుల్లో కొనసాగిస్తే ప్రతిపక్ష పార్టీలపై తీవ్ర ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ల నియామకానికి సంబంధించి గతం లోకోర్టులో వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండటం ప్రతిపక్షాలకు ఇబ్బందికరంగా మారింది.

వలంటీర్లను నమ్ముకున్న జగన్

జగన్ సర్కార్ వలంటీర్లను సొంత సైనికులుగా భావిస్తోంది. ఎమ్మెల్యేలతో పాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు వంటి స్థానిక సంస్థల నేతలను కూడా విస్మరించి జగన్ వలంటీర్లనే నమ్ముకున్నారు. ప్రభుత్వ ఖర్చుతో ఏటా రూ.1500 కోట్లు వేతనాలు అందిస్తున్నారు. ప్రతి ఉగాదికి వారిని ప్రత్యేక పురస్కారాలతో సత్కరిస్తున్నారు. ప్రజల్లో జగన్ పేరు నిత్యం వినపడేలా చేసేందుకు వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఓ రకంగా గ్రామాల్లో సర్పంచ్‌ల కంటే వలంటీర్లే కీలకంగా తయారయ్యారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన కేంద్ర నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకుని సర్పంచ్‌లను డమ్మీలను చేసింది. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలతో రాజకీయంగా ఎలాంటి అవసరం లేదన్న భావనతోనే వ్యవహరించారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నప్పటికీ జగన్ పట్టించుకోలేదు. వలంటీర్లు ఉంటే చాలు మళ్లీ తాను అధికారంలోకి వస్తానన్న నమ్మకంతో ఉన్నారు. మిగతా ప్రభుత్వ యంత్రాంగం చేసిన పనులను కూడా వలంటీర్ల ఖాతాల్లో వేసి సీఎం జగన్ ప్రశంసలు కురిపిస్తున్నారు.

రాజకీయ వేదికలుగా సచివాలయాలు

గ్రామ, వార్డు సచివాలయాలను వైసీపీ సర్కార్ రాజకీయ వేదికలుగా మార్చేసింది. ప్రభుత్వ సొమ్ముతో జీతాలు తీసుకుంటున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను రాజకీయ ప్రచారానికి వాడుకునేందుకు సిద్ధమైంది. లక్షలు ఖర్చు చేసి జగన్ బొమ్మలతో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. సర్కార్ అమలు చేసిన పథకాలు, ఆయా పథకాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసిన నిధుల వివరాలను బోర్డుల మీద రాసి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఊదరగొట్టారు. సచివాలయాల వారీగా జనాలను సమీకరించి వైసీపీ స్థానిక నేతలు, ఎమ్మెల్యేలతో ఉపన్యాసాలు ఇప్పించేలా గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పల్లెకు పోదాం కార్యక్రమం పేరుతో ప్రభుత్వ నిధులు అడ్డగోలుగా పార్టీ కార్యక్రమాల కోసం ఖర్చు చేశారు. సంక్షేమ పథకాలపై అవగాహన పేరుతో జగన్ ప్రభుత్వం అంత చేసింది, ఇంత చేసిందంటూ గొప్పలు చెప్పుకొనేందుకు సచివాలయాలను వేదికలుగా వాడుకుంటున్నారు. నవరత్నాల పేరిట అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు స్వస్తి పలికిన జగన్ సర్కార్.. ఇప్పుడు నవరత్నాలపై అవగాహన అంటూ ఎన్నికల ముందు ప్రభుత్వ నిధులతో సొంత ప్రచారం చేసుకుంటోంది. ఇప్పటికే సచివాలయాలను జగన్ బొమ్మలతో, ఆ పార్టీ రంగులతో నింపేసి పార్టీ కార్యాలయాల్లాగా మార్చేసింది. వైసీపీ రాజకీయ సభలకు జనాలు మొహం చాటేస్తుండటంతో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఉపయోగించుకుంటున్నారు.

ఎన్నికల ముందే ఎందుకు?

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడానికి అంటూ సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఆదేశాలిచ్చింది. లబ్ధిదారులను పోగేసి పథకాల గురించి వివరించాలని తెలిపింది. సచివాలయాల వేదికగా ఎన్నికల ముందు జనాలను వలంటీర్ల ద్వారా సమీకరించి ఆ సమావేశాలకు వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఆహ్వానించడమంటే అది ఎన్నికల ప్రచారమే! ఈ విషయంపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని అంటున్నారు. వివిధ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, వాటిని అభివృద్ధి సిద్ధాంతాలుగా సూత్రీకరిస్తూ ప్రభుత్వ ఖర్చుతో బుక్‌లెట్స్ రూపొందించారు. జగన్ రాకపోతే నవరత్నాలు ఆగిపోతాయని, పెన్షన్లు నిలిచిపోతాయని, కావున జగన్‌కు ఓటేయడం అత్యావశ్యకమని ప్రచారం చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ సొమ్ము ఖర్చు పెట్టి జగన్ సర్కారు ప్రచారం చేసుకుంటున్నట్టుగా గతంలో ఏ ప్రభుత్వం కూడా చేసుకోలేదు. దాదాపుగా అన్ని పథకాలకు జగన్ పేరు పెట్టుకున్నారు. వాటిపై జగన్ బొమ్మ కచ్చితంగా ఉండాల్సిందే. సచివాలయ భవనాలపైన ఏకంగా జగన్ బొమ్మ వేశారు. ప్రతి సచివాలయం వద్ద హోర్డింగ్‌లు పెట్టి జగన్ పథకాలను ప్రచారం చేస్తున్నారు. గతం లో సచివాలయ భవనాలపై సీఎం బొమ్మ తీసేయాలని కోర్టులు ఆదేశించినా ఖాతరు చేయడం లేదు. రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల భవనాలపైనా స్థానిక ఎమ్మెల్యేలు, సీఎం జగన్ బొమ్మలు ముద్రించారు. చివరకు విద్యుత్ స్తంభాలకు కూడా జగన్ బొమ్మ, వైసీపీ రంగులు పులిమారు. ఎన్నికల సమయానికి ఓటర్లకు జగన్, వైసీపీ, ఫ్యాన్ తప్ప మరేదీ గుర్తురాకూడదన్న ఆలోచనతో ప్రభుత్వ నిధులతో ప్రచారం చేసుకుంటున్నారు. వలంటీర్లతో అధికారికంగా వైసీపీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

గళమెత్తినందుకు గురి పెట్టారు!

(మొదటి పేజీ తరువాయి)


లోకేశ్, గల్లా ఆత్మీయ ఆలింగనం

తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం లేదని స్పష్టం చేశారు. పాండవులు, శ్రీరాముడు ఎలాగైతే అరణ్యవాసం చేసి తిరిగి బలంగా వెనక్కి వచ్చి పరిపాలించారో.. తాను కూడా అలాగే తిరిగొచ్చి రాజకీయాల్లో రాణిస్తానని చెప్పారు. పదేళ్ల రాజకీయ ప్రస్థానం అనంతరం రాజకీయ నాయకుడిగా కొనసాగాలా.. పారిశ్రామికవేత్తగా ఉండాలా అని ఎంచుకోవలసిన పరిస్థితి వస్తుందని ఊహించలేదని అన్నారు. దశాబ్ద కాలం తనను రాజకీయంగా ఆదరించిన గుంటూరు ప్రజలకు 'కృతజ్ఞతాభివందనం' పేరుతో జయదేవ్ ఆదివారం గుంటూరులో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకపక్క కేంద్రం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్ చేసినా నిలబడ్డానే తప్ప రాజీ పడలేదన్నారు. లోక్‌సభలో ఎన్‌డీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు టీడీపీ తరఫున తాను ప్రసంగించి.. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి ప్రధాని మోదీని నిలదీశానని గల్లా గుర్తుచేసుకున్నారు. దీనివల్ల రెండుసార్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని పరోక్షంగా జగన్ సర్కారును ఉద్దేశించి తెలిపారు. 'ఇప్పుడు కూడా నా వ్యాపారాలన్నింటిపై భూతద్దం పెట్టి స్కానింగ్ చేస్తున్నారు. ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారు. అయినా భయం లేదు. అమరావతి రాజధానిని భారత చిత్రపటంలో చేర్చడం కోసం పార్లమెంటులో కొట్లాడాను. ఏదైనా వ్యాపారం పెట్టాలంటే 70 అనుమతులు కావాలి. అవన్నీ తెచ్చుకున్నా వేధింపులు తప్పడం లేదు. నన్ను కొట్టినా.. తిట్టినా.. జైలుకు పంపినా పర్వాలేదు. గమ్మున కూర్చోమంటే నా వల్ల కాదు. నాకు బలాలైన నిజాయితీ, ఆర్థిక స్వాతంత్ర్యం, సామర్థ్యాలు రాజకీయాల వల్ల బలహీనతలుగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రాజకీయాలకు దూరంగా ఉండి కోర్టు కేసులు గెలిచి స్వచ్ఛంగా బయటకు రాగలమన్న నమ్మకం ఉంది' అని చెప్పారు. 2024లో పోటీ చేయకూడదనే తన నిర్ణయానికి ప్రధాన కారణం ప్రజాగొంతుకగా ఉండలేకపోతున్నానన్న భావన ఏర్పడడమేనని గల్లా తెలిపారు. 'అమర్‌రాజా టర్నోవర్‌ను వచ్చే ఐదేళ్లలో రూ.58వేల కోట్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అప్పుడు 25 వేల మందికి ఉద్యోగాలు, రాష్ట్రానికి పన్నుల రూపంలో రూ.5 వేల కోట్లు, కేంద్రానికి రూ.16,500 కోట్లు చెల్లించే స్థాయికి చేరుకుంటాం. తెలంగాణ, ఉత్తరాదితో పాటు పశ్చిమాసియా దేశాల్లోనూ కంపెనీలు స్థాపిస్తున్నాం. భవిష్యత్‌లో కేంద్రంపైన, ఒక రాష్ట్రంపైన ఆధారపడకుండా ఉండాలనేదే లక్ష్యం. రెండేళ్ల క్రితమే నా తండ్రి రిటైరయ్యారు. నా పిల్లలు చిన్న వయసులోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో బిజినెస్‌లపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నాను. ఈసారి కచ్చితంగా సంపూర్ణమైన రాజకీయవేత్తగానే వస్తా' అని ప్రకటించారు.

జయదేవ్ పోరాట యోధుడు: లోకేశ్

అమరావతి రాజధాని రైతుల పక్షాన నిలిచి అసెంబ్లీని ముట్టడించిన పోరాట యోధుడు గల్లా జయదేవ్ అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ కొనియాడారు. 'కృతజ్ఞతాభివందనం' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'గుంటూరు ఎంపీ టికెట్‌కు టీడీపీలో విపరీతమైన పోటీ ఉంది. ఆయన మళ్లీ పోటీచేస్తే బ్రహ్మాండమైన మెజారిటీతో మూడోసారీ గెలుస్తారు. అయినప్పటికీ కొన్నాళ్ల పాటు రాజకీయాల నుంచి విరామం కోరుకుంటున్నారు. ఈ నిర్ణయం ఎంతో బాధిస్తున్నా జయదేవ్ ఆలోచనను ప్రతి ఒక్కరం గౌరవించాలి' అని లోకేశ్ చెప్పారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు, జయదేవ్ తల్లి గల్లా అరుణకుమారి, ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనికో రేటు.. అవినీతి రూటు!

పత్రికల్లో వచ్చినా బేఖాతర్

» కృష్ణా జిల్లా ఫైర్ బ్రాండ్ మంత్రి స్టయిల్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)



ఆయన అధికార పార్టీలో కీలక మంత్రి. విపక్షాలపై నోరేసుకు పడడంలో స్టేట్ ఫస్ట్‌లో ఉన్న నేత కూడా. ఆయనే ఉమ్మడి కృష్ణా జిల్లాలోని బందరు సమీపంలో ఉన్న ఓ కీలక నియోజకవర్గం ఎమ్మెల్యే కమ్ మంత్రి కూడా! చిత్రం ఏంటంటే.. ఎవరైనా అవినీతి చేయాలంటే కొంత జంకుతారు. కానీ, ఈయన స్టయిల్ వేరు. ఏ పని కావాలన్నా దానికో రేటు ముందుగానే నిర్ణయించేశారు. ఆ రేటు చెల్లిస్తే పని ఆగమేఘాలపై అయిపోతుంది. చెరువు తవ్వుకోవాలన్నా.. నియోజకవర్గ పరిధిలో ఏదైనా పోస్టింగ్ కావాలన్నా.. చివరికి సొంత పార్టీ వారికి ఏదైనా నామినేటెడ్ పోస్టు వేయించాలన్నా తన, మన అనే బేధం లేకుండా ఆయన కలెక్షన్ చేసేస్తారు. ఎక్కడా రాజీ ధోరణి మచ్చుకు కూడా కనిపించదు.

అంచనా పెంచి మరీ అవినీతి

ఫైర్‌బ్రాండ్ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని బంటుమిల్లి మండలంలో మల్లంపూడి వద్ద రోడ్డు కమ్ బ్రిడ్జి నిర్మిస్తే వేలాది మంది రైతులకు ఉపయోగపడుతుంది. ఈ వంతెన నిర్మాణానికి అనుమతి ఇచ్చేందుకు సాక్షాత్తు స్థానిక ప్రజాప్రతినిధి భర్త ఒకరు మంత్రి పేరు చెప్పి వసూళ్లకు తెగబడ్డారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం స్థానిక రైతులు కొద్ది రోజుల కిందట వైసీపీ మాజీ మండల పార్టీ కన్వీనర్, డ్రైనేజీ ఏఈని కలిశారు. పనుల ఎస్టిమేషన్, భూసారపరీక్ష, అప్రూవల్ నిమిత్తం రూ.50 వేలు అడగటంతో ఆ మొత్తం ముట్టచెప్పారు. అయినా పనులు ముందుకు కదలకపోవడంతో కొద్ది మంది రైతులు మాజీ మండల పార్టీ కన్వీనర్‌ను కలవగా ఆయన మంత్రి వర్యులు రూ.40 లక్షలు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. అంత ఇచ్చుకోలేమని మొరపెట్టుకున్న రైతులు రూ.20 లక్షలు వరకు ఇచ్చుకోగలమని తెలిపారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటి వరకు మొత్తంగా మూడు విడతల్లో రూ.4.50 లక్షలు ఇచ్చినట్లు రైతులు వివరించారు. వాస్తవానికి మల్లంపూడి వంతెన నిర్మాణానికి రూ.కోటి సరిపోతోంది. కానీ, కమీషన్ల కోసం వంతెన ఎస్టిమేషన్లను మూడు రెట్లు పెంచేసి రూ.3 కోట్లు చేశారని స్థానికంగా చర్చ సాగుతోంది. సాక్షాత్తు మంత్రి సూచనల మేరకే ఇలా చేశామని వైసీపీ నాయకులు రైతులకు చెప్పడం గమనార్హం.

కాపు సారాతో రూ.కోట్లు

కాపు సారా మత్తులో కృష్ణా జిల్లా సముద్రతీరం ఊగుతోంది. మడ అడవులు, చేపల చెరువులు, కాల్వ గట్లు, మల్లె తోటలు, చిక్కటి పొదలు ఇవే కాపుసారా బట్టీలకు నెలవుగా మారాయి. మంత్రి నియోజకవర్గంలోని మండలాల్లో కాపుసారా కాచే వారికి ఆయన అండదండలు పుష్కలంగా ఉన్నాయని అంటారు. అనుచరులే అన్నీ చూసుకుంటున్నారు. కాపుసారా ద్వారా నెలకు రూ.10 కోట్ల పైచిలుకు అక్రమ సంపాదన పోగవుతున్నట్టు సమాచారం.

దశ మార్చిన దాడి!

మాజీ సీఎం చంద్రబాబు నివసిస్తున్న ఉండవల్లి కరకట్ట ఇంటిపై 2021, సెప్టెంబరు 17న వైసీపీ నాయకులు దాడికి యత్నించారు. వందల సంఖ్యలో కార్లలో తరలివచ్చి ఈ దాడికి సిద్ధమయ్యారు. ఈ దాడిలో సదరు మంత్రి, ఆయన అనుచరులు కీలకంగా వ్యవహరించారు. మంత్రి అనుచరులైన పాలడుగు దుర్గా ప్రసాద్(గుంటుపల్లికి చెందిన ఈయన ఎన్టీటీపీఎస్‌లో సాధారణ కాంట్రాక్టర్. ఈయన భార్య ఇబ్రహీంపట్నం ఎంపీపీ. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సెటిల్‌మెంట్స్ ద్వారా అక్రమ సంపాదనకు తెరలేపారు), నల్లమోతు జాన్(మంత్రి తమ్ముడి అనుచరుడు), మధుపల్లి ఆనంద్‌కుమార్(చంద్రబాబు ఇంటిపై దాడిలో టీడీపీ నేతలను కొట్టిన వారిలో ఈయన ఉన్నారు)లతో కలిసి చంద్రబాబు ఇంటిపై దాడికి దిగారు. ఈ ఘటన తర్వాతే సదరు ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కిందని వైసీపీలోనే చర్చసాగుతోంది.

జడ్జి కుటుంబానికే ఎసరు!

మంత్రి వర్యుల నియోజకవర్గంలోని కొంకేపూడి గ్రామంలో జడ్జి తిరుమలరావుకు 5.30 ఎకరాల పొలం ఉంది. ఈయన 2021లో కొవిడ్‌తో మృతి చెందారు. తిరుమలరావుకు కొంకేపూడిలో ఉన్న 5.30 ఎకరాలను కౌలుకు ఇచ్చి దాని ద్వారా వచ్చే ఆదాయంపై ఆయన తల్లి వెంకటసుబ్బమ్మ జీవనం సాగించేవారు. తిరుమలరావు భార్యకు, తల్లికి ఈ భూమికి సంబంధించి వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి అనుచరుడైన పామర్తి సాంబశివరావు అలియాస్ జోకోమో సాంబ ఈ వివాదంలో జోక్యం చేసుకుని మొత్తం భూమిని తిరుమలరావు భార్య పరమయ్యేలా చూస్తానని, తనకు 1.30 ఎకరాలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం మేరకు 2022 డిసెంబరులో 1.30 ఎకరాల భూమిని పామర్తి సాంబశివరావు తండ్రి అర్జునరావు పేరుతో రిజిస్టర్ కూడా చేయించుకున్నారు. మిగిలిన 4 ఎకరాల భూమిని మంత్రి అండతో బలవంతంగా కబ్జా చేసి తిరుమలరావు భార్యకు అప్పగించే ప్రయత్నం చేయడంతో 75 ఏళ్ల వృద్ధురాలైన తిరుమలరావు తల్లి పోలీసులను ఆశ్రయించారు. ఇక్కడ న్యాయం జరగకపోవడంతో కోర్టును ఆశ్రయించారు.

వందల ఎకరాల్లో పట్టాలు

కృత్తివెన్ను మండలం పోడు గ్రామంలో 80 ఎకరాల వరకు బీఫారం పట్టా భూములను చాల తక్కువ రేట్లకు కొనుగోలు చేసి, మంత్రి బినామీల పేరిట చెరువులు తవ్వారు. కృత్తివెన్ను గుడిదిబ్బ గ్రామంలో తగదాల్లో ఉన్న 35 ఎకరాలను అతి తక్కువ ధరకు అనుచరులు దక్కించుకున్నారు. గరిశపూడి గ్రామ సమీపంలో 300 ఎకరాల బీఫారం భూములకు త్వరలో పట్టాలు ఇప్పిస్తామని చెప్పి, వారికి ఏడాదికి రూ.5 వేలు, రూ.10 వేలు చొప్పున లీజుకు రాయించుకున్నారు. అలా తీసుకొన్న భూములను చెరువులుగా మార్చి ఏడాదికి రూ.70 వేల నుంచి రూ.లక్ష లీజుకు వేరే వ్యక్తులకు కట్టబెట్టారు. బ్రహ్మపురంలో ని 22వ వార్డులో 3 ఎకరాల భూమిని బినామీల పేరిట కొనుగోలు చేసి, రియల్ ఎస్టేట్ వెంచర్ వేస్తున్నారు. ఇక, ఈ మంత్రికి తన సొంత నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వకాలపై దృష్టిపడింది. అప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యేకు ఎదురే లేకుండా ఉండేది. ఎప్పుడైతే మంత్రి వర్గం ఇక్కడ అడుగు పెట్టిందో అప్పటి నుంచి రెండు వర్గాలు ఎదురుదాడికి దిగాయి. మంత్రి అయిన తర్వాత గ్రావెల్ తవ్వకాల ద్వారా సుమారు రూ.50 కోట్లు ఆర్జించినట్లు పార్టీ నేతల్లో చర్చగా ఉంది.

అమాత్యుడి అక్రమాల రేట్లు!

- నియోజకవర్గంలో చెరువు తవ్వాలంటే ప్రతి ఎకరాకు రూ.20 వేలు కప్పం కట్టాలి.
- మట్టి తోలకాలకు ఏడాదికి రూ.కోటి చెల్లించక తప్పదు.
- పాస్‌పుస్తకానికో రేటు, సర్వేకో రేటు, తగదాల్లో నున్న భూ సమస్యల పరిష్కారానికి మరో రేటు.
- బంటుమిల్లి మండలంలో పేదలైన 129 మందికి పట్టాలు ఇచ్చేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు నుంచి రూ.లక్ష గుంజారు.
- నడుపూరు-కొత్తపల్లి రోడ్డుకు రూ.52 కోట్లు విడుదలైనా పనులు మొదలు కాలేదు. దీనికి మంత్రి కమీషన్ రూ.కోటి కావడమే కారణం.
- నియోజకవర్గంలో పేకాట శిబిరాల నుంచి మంత్రికి మామూళ్లు ఠంచనుగా ముడుతున్నాయి.
- పార్టీ పెద్దలకు సైతం నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నా మంత్రి అడిగినంత చెల్లించాల్సిందే.
- అధికారుల ట్రాన్స్‌ఫర్‌లు జరగాలన్నా.. కొత్త అధికారులు రావాలన్న ముడుపు మామూలే.



» తాడేపల్లి ప్యాలెస్‌లో సీఎంకు షాక్

» 'సర్వేలో వ్యతిరేకత' అని చెప్పిన సీఎం

» నేనేం మర్డర్లు చెయ్యలేదు: ఎమ్మెల్యే

నీ పరిస్థితేం బాలేదు!

నీది మాత్రం బాగుందా?.. జగన్ వర్సెస్ 'సొంత' జిల్లా ఎమ్మెల్యే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి!

మరోవైపు... ఆయనకు సన్నిహితుడు, అపాయింట్‌మెంట్ లేకుండానే తాడేపల్లి ప్యాలెస్‌లోకి అడుగుపెట్టగల ఎమ్మెల్యే!

ఇద్దరి మధ్య 'ఢీ అంటే ఢీ'! విశ్వసనీయ సమాచారం ప్రకారం... అభ్యర్థుల మార్పుచేర్పులపై కసరత్తు చేస్తున్న జగన్... కడప జిల్లాకు చెందిన ఆ శాసన సభ్యుడిని రెండు రోజుల క్రితం తాడేపల్లికి పిలిపించారు. "నియోజకవర్గంలో నీ పరిస్థితి ఏమీ బాలేదు" అని ఆయన ముఖాన్నే చెప్పారు. అయితే... ఇతర ఎమ్మెల్యేల్లాగా ఆ ఎమ్మెల్యే మౌనముద్ర దాల్చలేదు.. అప్పటికప్పుడే జగన్‌కు కౌంటర్ ఇచ్చారు. "రాష్ట్రంలో నీ పరిస్థితి మాత్రం బాగుందా?" అని సూటిగా ప్రశ్నించారు. 'ఎవరి పరిస్థితి ఏమిటో ఓటర్లే తేలుస్తారులే' అని వ్యాఖ్యానించారు. 'సర్వేలో బాగా వ్యతిరేకత వచ్చిందని చెబుతున్నా' అని సీఎం అనగానే, 'నేనేం మర్డర్లు చెయ్యలా! చేయించినోడిని వెనకేసుకురాలా!' అంటూ ఆ ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. దీంతో జగన్ ఒక్కసారిగా సహనం కోల్పోయి... ఆగ్రహంతో ఊగిపోయారు. 'నేనేం చెబుతున్నా.. నువ్వేం మాట్లాడుతున్నావ్..' అంటూ సీరియస్ అయ్యారు. అదే సమయంలో అక్కడే ఉన్న వైసీపీ ముఖ్యనేత వైవీ సుబ్బారెడ్డి 'సమయస్ఫూర్తి' ప్రదర్శించారు. వివాదం పెద్దది కాకుండా ఎమ్మెల్యే చేయి పట్టుకుని బయటికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఆ ఎమ్మెల్యే గట్టిగా తన వాదన వినిపించారు. 'పులివెందుల నియోజకవర్గంలో కార్యకర్తలు అందరూ సంతోషంగా ఉన్నారా? ఇదేమి పార్టీయలో ప్రశ్నించింది తెలీదా? నేనేమైనా నియోజకవర్గానికి అన్యాయం చేశానా? నాపై ఎందుకు వ్యతిరేకత ఉంటుంది? అవినీతి నేనొక్కడినే చేశానా? మిగతా వాళ్లందరూ పత్తిత్తులా? రాష్ట్రంలో అవినీతి కేంద్రీకృతమైందని దేశమంతా అంటున్నారు. నా సీటు ఎవడికి స్తాడో ఇచ్చుకోమను. ఎలా గెలుస్తాడో నేనూ చూస్తా!!' అంటూ కారెక్కి వెళ్లిపోయారు.


సీసీ రోడ్డును ధ్వంసం చేసిన తరువాత ఇలా..

మీరు రోడ్డేస్తే... మేం తవ్వేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు రోజుల క్రితం సీసీ రోడ్డు వేశారు. 'వేస్తే మేం వేయాలి. ఇంకొకరు రోడ్డు వేయించడమేంటి' అంటూ ఓ వైసీపీ నాయకుడు కస్సుమన్నాడు. తమ అనుమతి లేకుండా తమ గ్రామ పరిధిలో రోడ్డు ఎలా వేస్తావని కాంట్రాక్టర్‌ను బెదిరించాడు. కాంట్రాక్టరు సర్దిచెప్పాలని ప్రయత్నించారు. అవసరమైతే మీరే మిగిలిన రోడ్డు వేసుకుని, బిల్లు కూడా చేసుకోవాలని, తనకేమీ అవసరం లేదని చెప్పినా స్థానిక నేత వినిపించుకోలేదు. వేసిన రోడ్డును ధ్వంసం చేయకపోతే కేసు పెడతానని బెదిరించారు. దీంతో చేసేదిలేక నష్టం వచ్చినా ఫర్వాలేదనుకుని ఆ కాంట్రాక్టర్ తాను వేసిన రోడ్డును ఆదివారం ధ్వంసం చేయించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు.. సదరు వైసీపీ నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'అధికార పార్టీ నిధులు మంజూరు చేసిందీలేదు, రోడ్లు వేసిందీ లేదు. ఎమ్మెల్యే చొరవతో రోడ్డు వేయిస్తే దానిని కూడా బెదిరించి, ధ్వంసం చేయించడం దారుణం' అని మండిపడుతున్నారు.

వీధి లైట్లు తీసేసి.. రాళ్లు రువ్వి..!


ముప్పాళ్ల మండలం తొండపిలో టీడీపీ సభను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం

» పల్నాడులో పథకం ప్రకారం కన్నాపై దాడి

» త్రుటిలో తప్పించుకున్న మాజీ మంత్రి

» అనుచరుడు సహా ముగ్గురికి గాయాలు


రాళ్ల దాడిలో గాయపడ్డ కన్నా వ్యక్తిగత సహాయకుడు స్వామి

ముప్పాళ్ల, జనవరి 28: పల్నాడు జిల్లాలో వైసీపీ శ్రేణులు మరింత బరితెగించాయి. వీధి దీపాలు ఆర్పేసి.. చీకట్లో ఇళ్లపై నుంచి మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణపై రాళ్లు రువ్వారు. అయితే ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. దాడిలో ఆయన వ్యక్తిగత సహాయకుడు సహా ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటనతో ముప్పాళ్ల మండలం తొండపిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సత్తెనపల్లె టీడీపీ అభ్యర్థి అయిన కన్నా.. ఆదివారం రాత్రి ఈ గ్రామంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్తుండగా షాదీఖానా బజార్లో వీధిలైట్లు ఆపేసి వైసీపీ కార్యకర్తలు డాబాలపై నుంచి రాళ్ల దాడి చేశారు. కన్నా పీఆర్వో స్వామి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పీఏ శ్రీధర్, ముప్పాళ్ల మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు కూడా గాయపడ్డారు. పోలీసులు గ్రామంలో ఉండగానే ఈ ఘటన జరగడం గమనార్హం. దాడి అనంతరం గ్రామంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు. గ్రామంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరుతున్న నేపథ్యంలో సభ ఏర్పాటు చేశారు. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ మూకలు ఈ రాళ్ల దాడికి తెగబడ్డాయి. డీఎస్పీ ఆదినారాయణ తొండపి చేరుకుని సభను నిలిపివేయాలని కోరడంతో టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. డీఎస్పీపై కన్నా మండిపడ్డారు. అనంతరం జరిగిన సభలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. వీరికి కన్నా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భయం నా బ్లడ్‌లోనే లేదు: కన్నా

పోలీసుల వైఫల్యం వలనే రాళ్ల దాడి జరిగిందని కన్నా ఆరోపించారు. దాడిని తీవ్రంగా ఖండిస్తూ.. పిరికిపందల చర్యలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. భయం తన బ్లడ్‌లోనే లేదని స్పష్టం చేశారు. '1980ల కాలంలో ఇలాంటి దుష్టరాజకీయాలను చూశాను. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోనే రాజకీయాలు చేశాను. అన్నిటికీ కాలమే సమాధానం చెబుతుంది. కార్యకర్తలు, నేతలు ధైర్యంగా ఉండాలి వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే' అని స్పష్టం చేశారు.


శనివారం ఇలా.. పూలదండలతో నివాళి


ఆదివారం ఇలా..

పనైపోయింది.. పక్కన పడేశారు!

» వైఎస్ విగ్రహాన్ని పక్కన పడేసిన వైసీపీ నేతలు

నిడదవోలు, జనవరి 28: పనైపోతే పక్కన పెట్టేయడం వైసీపీ నాయకుల నైజం! అధినేత నుంచి కింది స్థాయి నాయకుల వరకూ ఇదే తీరు! అయితే, సాక్షాత్తూ సీఎం జగన్ తండ్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఇలా పక్కన పడేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం నిడదవోలు నియోజకవర్గ పరిధిలో 4వ విడత ఆసరా సంబరాలు నిర్వహించారు. ఒక పక్క డిగ్రీ పరీక్ష జరుగుతుండగానే ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు సభ నిర్వహించడం ఇప్పటికే విమర్శలకు దారి తీసింది. ఇదిలా ఉండగా శనివారం ఆసరా సభలో వైఎస్ విగ్రహానికి ఒక పెద్ద పీట వేశారు. ఎమ్మెల్యేతో పాటుగా నేతలంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభ అయిపోయిన తరువాత విగ్రహాన్ని అదే కళాశాల గ్రౌండులో వదిలేశారు. ఆదివారం ఉదయం స్థానికులు చూసి.. విగ్రహంతో పనైపోయింది పక్కన పెట్టేశారంటూ గుసగుసలాడుకోవడం కనిపించింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వైసీపీ నాయకులు వెంటనే వైఎస్ విగ్రహాన్ని తీసుకుని వెళ్లిపోయారు.

ఓపీఎస్ పునరుద్ధరించే వారికే ఓటు

» అన్ని పార్టీలు వైఖరి స్పష్టం చేయాలి

» ఓపీఎస్ సాధన సభలో యూటీఎఫ్ నేతలు

» 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమం


రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపీఎస్ సాధన సభలో సంఘీభావం తెలియజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28: పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించే వారికే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని, రాష్ట్రంలో సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించాలని యూటీఎఫ్ నేతలు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆదివారం పాత పెన్షన్ సాధన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపీఎస్‌పై రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని, అధికారంలోకొచ్చాక మొదటి సంతకంగా ఓపీఎస్‌ను అమలుచేయాలని యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఓపీఎస్ సాధన కోసం ఫిబ్రవరి 1నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం కావాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించేందుకు సిద్ధం కావాలన్నారు. పాత పెన్షన్ సాధన కోసం జరిగే పోరాటానికి సీపీఎం సంపూర్ణమద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. 'ఓట్ ఫర్ ఓపీఎస్'కు ఏ పార్టీ నుంచీ మద్దతు లభించకపోతే శాసనసభలకు సొంతంగా ప్రతినిధుల్ని పంపేందుకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు.

హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేక పోరాటం

» విరసం రాష్ట్ర మహాసభల్లో ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపు





విరసం రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న కల్యాణరావు; హరగోపాల్

విజయవాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుతం హిందుత్వ ఫాసిజం ఆవహించి ఉందని, ఈ పరిస్థితికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. విరసం రాష్ట్ర మహాసభలు విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందుత్వ ఫాసిజం ప్రజల మధ్య ద్వేషాలను పెంచుతూ మానవీయతను కోల్పోయేలా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని నివారించడానికి వర్గ పోరాట రాజకీయాలు, ప్రజల మధ్య విస్తృతంగా పనిచేస్తూ చైతన్యం కలిగించాలని, ఈ పనిని విరసం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విరసం సీనియర్ సభ్యుడు కల్యాణరావు మాట్లాడుతూ బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు నేడు దేశంలో పోరాడుతున్న ప్రజలను, మేధావులను అణిచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని ప్రశ్నిస్తున్న వారిని అర్బన్ నక్సల్స్ పేరుతో అక్రమంగా అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారని పేర్కొన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్య పెట్టుబడి సంక్షోభంలో కూరుకుపోయిందని, దీనినుంచి బయటపడటానికి కార్పొరేట్ వర్గాలు ఫాసిస్టు ప్రభుత్వాలను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. వాటిలో భాగంగానే ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులు మోదీని మూడోసారి ప్రధాని చేయడానికి తమ శక్తులను వినియోగిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికలు దేశ ప్రజల లౌకికవాద, ప్రాథమిక హక్కుల రక్షణకు సంబంధించిన అంశంగా చూడాలని, మోదీ అధికారంలోకి రాకుండా ప్రజలను సమీకృతం చేయాలని కల్యాణరావు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విరసం అధ్యక్షుడిగా అరసవల్లి కృష్ణ, కార్యదర్శిగా రివేరా, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.


దుర్గారావు మృతదేహంతో రోడ్డుపై ధర్నా చేస్తున్న బ్రహ్మారెడ్డి, మృతుని కుటుంబసభ్యులు

పోలీసుల వేధింపులు తాళలేక మత్స్యకారుడు ఆత్మహత్య

» బోటుకున్న తాడు మెడకు చుట్టుకుని నదిలో దూకి బలవన్మరణం

వెల్దుర్తి, జనవరి 28: పోలీసుల వేధింపులు తాళలేక మత్స్యకారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బోటుకు ఉన్న తాడు మెడకు చుట్టుకుని నదిలోకి దూకి బలవంతంగా ప్రాణం తీసుకున్నాడు. ఈ సంఘటన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలోని బంగారుపెంట తండాలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన చవిటిపల్లి దుర్గారావు (38) కృష్ణానదిలో చేపలవేట వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన అక్రమ మద్యం విక్రయిస్తున్నాడంటూ పోలీసులు గతనెలలో అతనిపై కేసు నమోదుచేశారు. ఈ కేసులో దుర్గారావు హైకోర్టు నుంచి బెయిల్ తెచ్చుకున్నాడు. ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో స్టేషన్‌కు వెళ్తే పోలీసులు వేధిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లిన ఆయన బోటులో ఉన్న తాడు మెడకు చుట్టుకుని నదిలోకి దూకాడు. బోటును గమనించిన మత్స్యకారులు అక్కడకు వెళ్లి బోటుకు కట్టి ఉన్న తాడును పైకి లాగగా దుర్గారావు నిర్జీవస్థితిలో కనిపించాడు. మృతునికి భార్య ధనలక్ష్మి, ముగ్గురు సంతానం ఉన్నారు. పోలీసుల వేధింపులు తాళలేకనే దుర్గారావు ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు ఆరోపించారు. రూ.2 లక్షలు ఇవ్వాలని, వైసీపీ కండువా కప్పుకోవాలని పోలీసులు పదేపదే వేధించారని చెప్పారు. దుర్గారావు మృతదేహంతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. కాగా, దుర్గారావు మృతికి కారణమైన వెల్దుర్తి ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.